అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 14-02-2025
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 356 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



భవిష్యత్తు ఏఐదే

500 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్య :

మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు-ఏఐ)దేనని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌తో కలిసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించేందుకు రాష్ట్రంలో 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ విద్యను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రజా సేవల కోసం ఏఐను ఉపయోగించుకోనున్నట్టు వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఏఐ ఫెసిలిటీ సెంటర్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ అభివద్ధిలో మరో మైలురాయి అని అభివర్ణించారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్టు సీఎం ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏండ్లు పూర్తి చేసుకుందని గుర్తు చేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని చెప్పారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని ఉద్ఘాటించారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని మెరుగైన ఉద్యోగాలు లభించను న్నాయని తెలిపారు. మైక్రోసాఫ్ట్ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతో పాటు మెంటార్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటైన ఫెసిలిటీ సెంటర్ ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందని వివరించారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల వారికున్న నిబద్ధత తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

ప్రపంచస్థాయి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.15 వేల కోట్లు : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం రూ.15 వేల కోట్లతో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. మెట్రో రైలు విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, విద్యుత్తు వాహనాల ఉత్పత్తి కేంద్రంగా, క్వాంటమ్ ఇంజనీరింగ్, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగాలతో ...11లో

ఓఆర్ఆర్ లోపల సదుపాయాల కల్పనకు ప్రణాళిక
సీఎం రేవంత్ రెడ్డి 10లో

గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం
పలు రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
వివరాలు 11లో



మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ జారీ

రెండేండ్లుగా రాష్ట్రంలో జాతుల మధ్య హింస

న్యూఢిల్లీ : మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ నెల 9న ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేసిన నాలుగు రోజులకు ఈ పరిణామం సంభవించింది. మణిపూర్ అసెంబ్లీని సస్పెండ్ చేస్తున్నట్టు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ఆ రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగే పరిస్థితులు కనిపించడం లేదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారని ఆ నోటిఫికేషన్ పేర్కొంది. అందువల్ల రాజ్యాంగంలోని 356వ అధికరణ కింద సంక్రమించిన అధికారాలు, అలాగే తనకు గల ఇతర అన్ని అధికారాలను వినియోగించుకుంటూ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని విధులను, అలాగే గవర్నర్‌కు గల అధికారాలను అన్నింటినీ రాష్ట్రపతి స్వీకరిస్తున్నట్టు ఆ నోటిఫికేషన్ పేర్కొంది. బీరెన్ సింగ్‌కు వారసుడిని కనుగొనడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

గత ఆదివారం బీరెన్ సింగ్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లాను కలిసి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం కొత్త ముఖ్యమంత్రి పేరును ఖరారు చేయడానికి బీజేపీ బిజెపి నాయకుల వరుస సమావేశాలు ప్రారంభ మయ్యాయి. మణిపూర్ ఇన్‌చార్జి సంబిత్ పాత్రా సీనియర్ బీజేపీ నాయకులతో ...11లో

వక్ఫ్ బిల్లుపై రగడ

ప్రతిపక్షాల నోట్‌లను చేర్చకుండానే జేపీసీ నివేదికకు ఓకే

పార్లమెంట్‌లో విపక్షాల ఆగ్రహం..వాకౌట్



లోక్‌సభలో ఆదాయపు పన్ను సవరణ బిల్లు కేంద్రబడ్జెట్ 2025కు ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లుపై నివేదికకు పార్లమెంటు ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మూజు వాణి ఓటుతో ఆమోదం లభించింది. గురువారం లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నో త్తరాలు నిర్వహిం చేందుకు ప్రయత్నించారు. సభ ప్రారంభ మైన నాలుగు నిమిషా ల్లోనే వక్ఫ్ బిల్లుపై జేపీసీ రిపోర్టులో ప్రతిపక్షాల నోట్‌లను చేర్చ లేదంటూ ప్రతిపక్షాలు ఆం దోళన చేపట్టాయి. తీవ్ర గందం "గోళం నెలకొనడంతో మధ్యా హ్నం 2 గంటల వరకు సభను వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమవ్వగానే 'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై అధ్యయన నివేదికను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మెన్ జగదాంబికా పాల్ ప్రవేశపెట్టారు. తమ అసమ్మతిని నివేదికలో జత చేయలేదని, అది వాస్తవమైన నివేదిక కాదని, కేవలం బీజేపీ, మిత్ర పక్షాల నివేదిక మాత్రమేనని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తూ ఆందోళనకు దిగారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యుల అసమ్మతి నోట్‌లను నివేదికకు జత చేయడంలో తమ పార్టీకి ...10లో

ముగిసిన తొలి విడత బడ్జెట్ సమావేశాలు

కేంద్రబడ్జెట్..2025ను మోడీ సర్కార్ ఆమోదించుకున్నది. గురువారంతో తొలివిడత బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. రెండోవిడత బడ్జెట్ సమావేశాలు మార్చి 10 నుంచి ప్రారంభం కానున్నాయి.

లోక్‌సభలో కొత్త ఆదాయ పన్ను బిల్లు

ఆదాయ పన్ను 2025 బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. ఆ బిల్లును హౌజ్ కమిటీకి సిఫారసు చేయాలని ఆమె స్పీకర్ ఓం బిర్లాను కోరారు. కొత్త ఆదాయ పన్ను బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించి నప్పటికీ మూజువాణి ఓటుతో ఆమోదించారు. సెలెక్ట్ కమిటీకి ఆదాయ పన్ను ముసాయిదా తీర్మా నాన్ని రిఫర్ చేయాలని మంత్రి సీతారామన్ కోరారు. చాలా సరళమైన రీతిలో పన్ను బిల్లు రూపొందించినట్టు, వచ్చే సెషన్ తొలి రోజున ఆ సెలెక్ట్ కమిటీ కొత్త బిల్లుపై నివేదికను ఇవ్వనున్నట్టు మంత్రి వెల్లడించారు. కొత్త ఆదాయపు పన్ను బిల్లు మునుపటి బిల్లు కంటే చాలా క్లిష్టంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ అన్నారు.

కలిసి పనిచేద్దాం



అమెరికా నుంచి ప్రధాని మోడీ పోస్ట్

జాతీయ భద్రతా సలహాదారు వాల్జ్, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసితో భేటీ

నిఘా సహకారం పెంపుపై చర్చలు

వివరాలు 2లో



ఫార్మా బాధిత రైతులకు న్యాయం చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి

- నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి
- వారికి రైతు భరోసా, రైతు బీమాను వర్తింపజేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలు చేయాలి
- రైతులకు అండగా నిలబడతాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ-యాచారం

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీ బాధిత రైతులకు వెంటనే న్యాయం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ సెంటర్‌లో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఫార్మాసిటీ రైతులతో ముచ్చటించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఫార్మాసిటీ రైతులకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. యాచారం, కందుకూరు మండలాల్లోని పలు గ్రామాల్లో బలవంతపు భూసేకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త, నానక్‌నగర్, తాడిపర్తి, కురిమిద్ద గ్రామాల్లో దాదాపు 2800 ఎకరాల పట్టా భూమిని గత రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో సేకరించిందని, ఆయా భూములను నిషేధిత జాబితాలో పెట్టిందని గుర్తు చేశారు. వెంటనే నిషేధిత జాబితాలో నుంచి ఆ భూములను తొలగించి రైతులందరికీ రైతు భరోసా, రైతు బీమా, పంట లోన్లు, అదేవిధంగా భూమి అమ్మకాలు, కొనుగోళ్లు చేసుకునే విధంగా వీలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం భూసేకరణ చేసేటప్పుడు 2013 చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ఫార్మా బాధిత రైతులందరికీ కోర్టు ఆర్డర్ ప్రకారం వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించి, వారికి అన్ని అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికారులు ...11లో


11లో

శ్రీలంకలోని విద్యుత్ ప్రాజెక్టులకు

అదానీ గుడ్‌బై

విచారణ దెబ్బతో ముందస్తు జాగ్రత్త..!


2లో

ఆసియా కుబేర కుటుంబాల్లో

అంబానీ టాప్

ఆర్ఆర్ఆర్ పనుల వేగం పెంచండి



వైమానిక రంగానికి ప్రోత్సాహం

ఆక్రమణకు గురవుతున్న ఆర్అండ్‌బీ ఆస్తుల సంరక్షణకు చర్యలు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మేరకే రహదారుల నిర్మాణం

నిధుల కొరత లేదు

పనులు పూర్తవుతున్న కొద్దీ కేటాయిస్తాం : ఆర్అండ్‌బీ శాఖ ముందస్తు బడ్జెట్ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖ ముందస్తు బడ్జెట్ సమీక్ష చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు డీపీఆర్ త్రిడీ డిజైన్లు వంటి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంత వేగంగా పనులు చేపడితే అంత వేగంగా నిధులు మంజూరు చేస్తామని, నిధుల కొరత లేదని డిప్యూటీ సీఎం అధికారులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ శాఖకు ఉన్న ఆస్తులపై నివేదిక రూపొందించాలనీ, పెద్ద సంఖ్యలో ఉన్న విలువైన ఈ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు అన్ని స్థాయిల్లో చర్యలు చేపట్టాలని ఇరువురు మంత్రులు ఆదేశించారు. హైబ్రిడ్ యాన్యూటీ హెడ్ (హమ్) రహదారుల నిర్మాణం వేగవంతం చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర ...11లో

బకాయిలు ఇస్తాం..

హాస్టళ్లు, గురుకులాల అద్దె భవనాల చెల్లింపులపై
డిప్యూటీ సీఎం భట్టి , మంత్రి పొన్నం
వివరాలు 11లో

యూరియా ఏదయా..?

డిమాండ్‌కు తగినట్టుగా లేని సరఫరా

పీఏసీఎస్‌లు, దుకాణాల వద్ద పడిగాపులు

రాష్ట్రాన్ని యూరియా కొరత వెంటాడుతోంది. పలుచోట్ల ఎరువుల లభ్యత క్షీణించింది. మూడో రైల్వేలైన్ నిర్మాణ నేపథ్యంలో ఖమ్మంలోని వ్యాగన్ పాయింట్‌ను మార్చడంతో రవాణాపరమైన సమస్యలు ఉత్పన్నమయ్యాయి. మూడు జిల్లాల్లో యూరియాతో పాటు ఇతర ఎరువులకు కటకట ఏర్పడింది. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొన్నిచోట్ల యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉన్నవారికే ఎరువులు ఇస్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో సామాన్య రైతులు ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. వీటికి తోడు నాగార్జున ఎరువుల కర్మాగారాన్ని మూసివేయటం కూడా సమస్యను మరింత జఠిలం చేసింది. కనీసం రెండు, మూడు రాష్ట్రాలకు ఎరువులు సరఫరా చేసే సామర్థ్యం ఉన్న ఈ ఫ్యాక్టరీ మూత పడినప్పటి నుంచి ఫర్టిలైజర్ సమస్యలు తప్పట్లేదని డీలర్స్ చెబుతున్నారు.

సర్కారు నిర్లక్ష్యం లేక సతమతం

- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇదే తీరు..
- 'మూడో రైల్వేలైన్'తో మూడు జిల్లాలకు కటకట
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిలేని ప్రభుత్వాలు
- మోతాదుకు మించి వినియోగిస్తున్న రైతాంగం



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

డిమాండ్‌కు తగినట్టుగా యూరియా సరఫరా లేక రైతాంగం సతమతమవుతోంది. పలుచోట్ల ప్రాథమిక సహకార సంఘాల వద్ద రైతులు ఆందోళనలు చేస్తున్నారు. గురువారం రాష్ట్రంలో కొన్నిచోట్ల పీఏసీఎస్ చైర్మెన్లు, సీఈవోలను నిలదీశారు. స్టాక్ లేదనడంతో కోపోద్రిక్తులయ్యారు. కొందరు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందుగానే నిల్వ చేసుకుంటున్నారు. దీనివల్ల కూడా సమస్య తీవ్రతరం అవుతోంది. ఇదే అదనుగా కొందరు దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని కూడా రైతులంటున్నారు. 45 కిలోల యూరియా బస్తాను రూ.265కు విక్రయించాల్సి ఉండగా కొన్నిచోట్ల రూ.300కు పైగా ధరకు అమ్ముతున్నారు. కొందరు విక్రేతలు యూరియాకు ఇతర ఎరువులకు లింక్ పెడుతున్నారు. ఇతర ఎరువులు కొంటేనే యూరియాను ఎంఆర్‌పీ ధరకు ఇస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉంటేనే యూరియా ఇస్తున్నారనే ఆరోపణలు సైతం కొన్నిచోట్ల వస్తున్నాయి. మార్క్‌ఫెడ్, సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు ఈ-పీవోస్ మిషన్ల సహాయంతో విక్రయిస్తున్నారు. పీఏసీఎస్‌ల్లో ఒక్కో ఆధార్‌కార్డుపై ఐదు బస్తాల యూరియాను మాత్రమే విక్రయిస్తున్నారు.

లెక్కకు మించి వినియోగం..

రబీ సీజన్‌లో ఏ పంటలు ఎంత మొత్తంలో సాగు చేస్తారనే అంచనాతో జిల్లా వ్యవసాయశాఖలు విత్తనాలు, ఎరువుల ప్రణాళికలు రూపొందిస్తాయి. రైతులు మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తుండటంతో ఈ ప్రణాళికలు కూడా తల్లకిందులు అవుతున్నాయి. రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా.. భూసారాన్ని పట్టించుకోకుండా అధిక దిగుబడిపై ఆశతో రసాయనిక ఎరువులనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. తద్వారా ...10లో

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం..



యూరియా సరఫరా ఆటంకం లేకుండా కొనసాగించేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. ఒక్కో సొసైటీని ఏవో, ఏడీఏతో పాటు నేను వారంలో మూడుసార్లు సందర్శిస్తున్నాం. పందిళ్ల పల్లికి రేక్‌పాయింట్ ను మార్చడంతో రవాణపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. వ్యవసాయ, మార్క్‌ఫెడ్, సొసైటీల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం సరైంది కాదు. భూ సాంద్రత దెబ్బతింటుందనే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి.

- డి.పుల్లయ్య, ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రక్షణ ఉత్పత్తితోనే మెరుగైన లక్ష్యాలు

- సింగరేణి సంస్థ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం



మాట్లాడుతున్న సీఎండీ బలరాం నాయక్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

రక్షణతో కూడిన ఉత్పత్తే మెరుగైన లక్ష్యాలను సాధిస్తుందని సింగరేణి సంస్థ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం అన్నారు. డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వి.సూర్యనారాయణ, ప్లానింగ్, ప్రాజెక్ట్స్ అధికారి కె.వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 కృషిభవన్‌లో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ తమకు కేటాయించిన విధులను తప్పనిసరిగా ఎనిమిది గంటల సమయంలో నిర్వర్తించాలని, భారీ యంత్రాల వినియోగ సమయం పెంచాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం బి.వెంకటయ్య, జీఎం రక్షణ ఆర్జీ రీజియన్ కె.హెచ్ఎస్ గుప్తా,జీఎం క్వాలిటీ ఆర్జీ రీజియన్ బైద్యా, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ నర్సింహులు, బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం

వాషింగ్టన్ : అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్ట్జ్, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్‌తో ప్రధాని నరేంద్రమోడీ సమావేశమయ్యారు. ఫ్రాన్స్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకుని గురువారం ఆయన అమెరికా చేరుకున్నారు. ఈ పర్యటనలో ఆయన అధ్యక్షుడు ట్రంప్‌తో పాటూ ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామిలతో సహా పలువురు నేతలతో భేటీ అయ్యే అవకాశముంది. వరుస ద్వైపాక్షిక సమావేశాల్లో భాగంగా మైఖేల్ వాల్ట్జ్, తులసి గబ్బార్డ్‌తో మోడీ విడివిడిగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య గల వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య తీవ్రవాద నిరోధక కార్యకలాపాల్లో నిఘా సహకారాన్ని మరింత పెంచాల్సిన అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. సైబర్ భద్రతతో సహా ముంచుకువస్తున్న పలు ముప్పులను ఎదుర్కొనడంలో కూడా సహకారం వుండాలని పేర్కొన్నారు. అమెరికా అత్యున్నత నిఘా అధికారిగా బాధ్యతలు చేపట్టిన హిందూ అమెరికన్ తులసి గబ్బార్డ్‌ను మోడీ ఈ సందర్భంగా అభినందించారు. ఈ మేరకు మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని కోరారు. అమెరికా అధ్యక్షుడి అతిథి గృహమైన బ్లెయర్ హౌస్‌లో బస చేసిన మోడీ భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అవుతున్నారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొంటారని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆసియా కుబేర కుటుంబాల్లో అంబానీ టాప్

ముంబయి : ఆసియాలోనే అత్యంత కుబేరుల్లో ముకేశ్ అంబానీ కుటుంబం టాప్‌లో ఉంది. అగ్రశ్రేణి 20 మంది కుబేరుల్లో భారత్‌కు చెందిన ఆరు కుటుంబాలు ఈ జాబితాలో చోటు సంపాదించుకున్నాయని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఈ జాబితాలో మిస్త్రీ, జిందాల్, బిర్లా, బజాజ్, హిందుజా కుటుంబాలు ఉన్నాయి. అంబానీ ఫ్యామిలీ సంపద ఏకంగా 90.5 బిలియన్ డాలర్లు (రూ.7.86 లక్షల కోట్లు)గా ఉంది. రెండో స్థానంలో థాయ్‌లాండ్‌కు చెందిన చీరావనోంట్ కుటుంబం రూ.3.70 లక్షల కోట్లుగా నమోదయ్యింది. కాగా.. అంబానీ కుటుంబ సంపదలో దాదాపు ఇది సగం కంటే తక్కువ. ఈ జాబితాలో నాలుగు, ఏడు, తొమ్మిదవ స్థానాల్లో భారత్ నుంచి మిస్త్రీ కుటుంబం, జిందాల్ ఫ్యామిలీ, బిర్లా కుటుంబాలు ఉన్నాయి. బజాజ్, హిందుజా కుటుంబాలు వరుసగా 14, 19వ స్థానాలను దక్కించుకున్నాయి.

సచివాలయ రెయిలింగ్ కూలిన ఘటనలో
నివేదిక ఆలస్యం

ఆర్అండ్‌బీ ఇంజినీర్లపై వికాస్‌రాజ్ ఆగ్రహం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సచివాలయంలో రెయిలింగ్ కూలిన ఘటన నేపథ్యంలో ఆర్అండ్‌బీ ఇంజినీర్లు నివేదిక ఇవ్వడంలో చేసిన ఆలస్యంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు రూ. 1200 కోట్లతో కొత్త సచివాలయాన్ని గత ప్రభుత్వం నిర్మించిన సంగతి తెలిసిందే. తెలంగాణ సంస్కృతితో పాటు ఇతర అనేక విశిష్టతలతో సచివాలయం రూపుదిద్దుకుంది. అయితే సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చాంబర్ ఉండే అయిదో అంతస్తులోని రెయిలింగ్ పట్టీ కొంత భాగం బుధవారం కూలింది. పట్టీ కూలి కిందప పడటంతో రామగుండం మార్కెట్ కమిటీ చైర్మెన్ వాహనం దెబ్బతింది. ఈ ఘటనపై రోడ్లు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ విచారణకు ఆదేశించారు. 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. కాగా, దీన్ని సచివాలయం ఆర్అండ్‌బీ శాఖ ఇంజినీర్లు పట్టించుకోలేదు. వికాస్‌రాజ్‌కు నివేదిక పంపలేదు. దీంతో వికాస్‌రాజ్ గురువారం సచివాలయ భవన ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటలు దాటినా ఎందుకు నివేదిక ఇవ్వలేదంటూ ప్రశ్నించినట్టు తెలిసింది.

మరో 24 గంటల్లో సచివాలయం భవన నిర్మాణంలో లోపాలు, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయి, పార్కింగ్ తదితర మొత్తం సమస్యలపై పూర్తిస్థాయి నివేదిక పంపాలని భవనానికి చెందిన ఇంజినీర్లను ఆదేశించారు. మొత్తం భవనాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి పెచ్చులు ఊడటం, పగుళ్లు రావడం, చిలీకలు తదితర అంశాల గురించి నివేదికలో పొందుపరచాలని వికాస్‌రాజ్ సూచించినట్టు సమాచారం. సచివాలయ భవనాన్ని నిర్మించిన షాపూర్జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రెయిలింగ్ కూలిన ఘటనపై ఆ సంస్థ ప్రతినిధులు వివరణ ఇచ్చేందుకు గురువారం మంత్రిని కలిశారు. బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన సచివాలయ నిర్మాణంపై గతం నుంచే విమర్శలు ఉన్నాయి. ఫర్నీచర్, కంప్యూటర్లు, ఇతర కొనుగోళ్లకు సంబంధించి దాదాపు రూ. 300 కోట్ల మేర అవినీతి జరిగిందనే విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. కాగా ఇప్పటి సీఎం, అప్పటి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కొత్త సచివాలయ నిర్మాణంపై విమర్శలు, ఆరోపణలు చేసిన విషయం విదితమే.

30 క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

12 కిలోల తెల్ల పట్టిక సీజ్

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని న్యూలక్ష్మీపురం వద్ద సీఐ ఓ.మురళి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి నుంచి మహబూబాబాద్ జిల్లా కురవికి అశోకాలైలాండ్ ట్రాలీ ఆటోలో 30 క్వింటాళ్ల (60 బస్తాలు) నల్లబెల్లం, 12 కిలోల తెల్ల పట్టిక ను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని సీజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుబడ్డ నల్లబెల్లం, తెల్ల పట్టిక విలువ రూ.1,80,880 ఉంటుందని సీఐ మురళి తెలిపారు. అక్రమంగా వాహనంలో నల్లబెల్లం తరలిస్తున్న డ్రైవర్ ఆడియాల అనిల్ తోపాటు, వాహన యజమాని కొరివి ఇజ్రాయెల్, కొరివికి చెందిన నల్ల బెల్లం వ్యాపారి వెంకట్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వాహన తనిఖీలో పాల్గొని నల్లబెల్లం పట్టుకున్న ఎస్సై ఎస్సై డి అనంతరాములు, హెడ్‌కానిస్టేబుల్ ఖలీక్, కానిస్టేబుల్ ఉపేందర్‌ను సిఐ మురళి అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


మండల పరిధిలో గంధసిరి, పెద్దమండవ మున్నేరుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం సువర్ణాపురం వద్ద పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ ఓ మురళి తెలిపారు.

క్రమబద్ధీకరించాలి

- అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ దేశవ్యాప్త ఆందోళన
- మే మొదటివారంలో సార్వత్రిక సమ్మె: ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ జాతీయ కన్వెన్షన్ పిలుపు







నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తమను క్రమబద్ధీకరించాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమయ్యారు. ఇందుకు దేశవ్యాప్తంగా మూడు కోట్ల సంతకాలను సేకరించనున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే మొదటి వారంలో జరిగే సార్వత్రిక సమ్మెకు ప్రచారం చేయనున్నారు. "ఐసీడీఎస్.. పిల్లలు, కార్మికులకు చట్టపరమైన హక్కు. దాన్ని నాణ్యతతో పటిష్టం చేయాలి" అని కన్వెన్షన్ పిలుపునిచ్చింది. గురువారంనాడిక్కడ తల్కటోరా స్టేడియంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్) అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల జాతీయ కన్వెన్షన్ జరిగింది. ఈ కన్వెన్షన్‌లో అండమాన్ నికోబార్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, జమ్ముకాశ్మీర్, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ తదితర 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి దాదాపు మూడు వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ.. కార్పొరేట్ల దోపిడీ కోసం అన్ని ప్రజాస్వామ్య హక్కులను అణగదొక్కే ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు స్కీమ్‌లను అప్పగించే ప్రయత్నం చేస్తున్నారనీ, స్కీమ్ వర్కర్లకు నష్టం జరుగుతున్నదని తెలిపారు.

ప్రొఫెసర్ ఉత్సా పట్నాయక్ మాట్లాడుతూ.. దేశ ఆహార భద్రతను పాలక వర్గాలు ఎలా రాజీ పడ్డాయో వివరించారు. ప్రస్తుతం భారతదేశ తలసరి ఆహార ధాన్యాల లభ్యత బ్రిటిశ్ పాలన కంటే తక్కువగా ఉన్నదని వివరించారు. ప్రభుత్వ వాదనలకు విరుద్ధంగా దేశంలో పిల్లల పోషకాహార లోపం, మహిళల్లో రక్తహీనత పెరిగిందనిన్నారు. కాబట్టి, ఐసీడీఎస్ వంటి పథకాలను బలోపేతం చేయడం చాలా ముఖ్యమని ఆమె అన్నారు.

ఈ కన్వెన్షన్‌లో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్,డీవైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, ఐలు జనరల్ సెక్రెటరీ అడ్వైజర్ పి. వి సురేంద్రంత్, రైట్ టు ఫుడ్ క్యాంపెయిన్ నుంచి ప్రొఫెసర్ దీపా సిన్హా, పార్లమెంటు సభ్యులు వి శివదాసన్, ఎ.ఎ రహీమ్, జాన్ బ్రిట్టాస్ ప్రసంగించారు.

ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ అధ్యక్షురాలు ఉషారాణి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షురాలు డాక్టర్ వీణా గుప్తా ప్రతినిధులకు స్వాగతం పలికారు. డిమాండ్ల చార్టర్, భవిష్యత్తు కార్యాచరణపై ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్ సింధు తీర్మానం చేశారు. ఆయా రాష్ట్ర నాయకులు కైలాష్ రోహిత్ (గుజరాత్), కె.కె ప్రసన్నకుమారి (కేరళ), చంద్రవతి (ఆంధ్రప్రదేశ్), గీతా దేవి (అండమాన్), ఊర్మిళ రవత్ (హర్యానా), వీణా శర్మ (హిమాచల్‌ప్రదేశ్), హనీఫా (జమ్ముకాశ్మీర్), సత్యభామ సింగ్ (మధ్యప్రదేశ్), సంగీత (మహారాష్ట్ర), అమృత్ పాల్ అకూర్ (పంజాబ్), డైసీ (తమిళనాడు), జయలక్ష్మి (తెలంగాణ), జయ బర్మన్ (త్రిపుర), సల్మా (ఉత్తరప్రదేశ్), చిత్రకళ (ఉత్తరాఖండ్), షీలా మండల్ (పశ్చిమ బెంగాల్) ఈ సమావేశంలో ప్రసంగించారు. సీఐటీయూ అధ్యక్షురాలు కె హేమలత కూడా ఈ సదస్సుకు హాజరయ్యారు.

డిమాండ్లు

1. గ్రాట్యుటీపై సుప్రీంకోర్టు ఉత్తర్వులను, క్రమబద్ధీకరణపై గుజరాత్ హైకోర్టు ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలి. క్రమబద్ధీకరణ పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాలు సహాయకులకు రూ. 26,000, వర్కర్లకు రూ. 32,000 చెల్లించాలి. 45, 46వ ఐఎల్‌సీ సిఫారసుల ప్రకారం పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ మొదలైనవి అందించాలి.
2. ఆరేండ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభ బాల్య సంరక్షణ విద్య అభివృద్ధి హక్కు (ఈసీసీడీ)ని నిర్ధారించడానికి ఒక చట్టాన్ని రూపొందించాలి. ఎన్ఈపీని ఉపసంహరించుకోవాలి. ఈసీసీఈని అధికారిక విద్యా వ్యవస్థకు అనుసంధానించకూడదు.
3. ఈసీసీఈ చట్టం ప్రకారం ఐసీడీఎస్ (సాక్షమ్ అంగన్‌వాడీ అండ్ పోషన్ 2.0)ను అంగన్‌వాడీ కమ్ క్రెచ్‌లుగా పటిష్టం చేయడానికి సరైన మౌలిక సదుపాయాలు, అవసరమైన మానవ వనరులతో స్థానిక అవసరాలను తీర్చడాని తగిన నిధులు కేటాయించాలి.
4. ఏ రూపంలోనూ ప్రయివేటీకరణ ఉండకూడదు. సీఎస్ఆర్ పేరుతో ఐసీడీఎస్‌లో కార్పొరేట్ ప్రమేయం ఉండకూడదు. ఐసీడీఎస్‌లో నగదు బదిలీలు ఉండకూడదు. ఐసీడీఎస్‌ను బలహీనపరిచే అన్ని చర్యలనూ ఉపసంహరించు కోవాలి. లబ్దిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ, పథకాల డిజిటలైజేషన్ పేరుతో లక్ష్యాలను నిర్దేశించడం, నిఘా, కేంద్రీకృత వంటగదిని ప్రవేశపెట్టడం వంటి ప్రయివేటీకరణ చర్యలు ఆపాలి.
5. నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలి.

భవిష్యత్ కార్యాచరణ

1. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే మొదటి వారంలో దేశవ్యాప్తంగా సమ్మె, భారీ ప్రచారం.
2. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లను క్రమబద్ధీకరించడం, ఐసీడీఎస్‌ను పటిష్టం చేయడం వంటి డిమాండ్లపై అంగన్‌వాడీ కార్మికులు, సహాయకుల ఐదు లక్షల సంతకాలతో ఏప్రిల్‌లో రాష్ట్రపతికి వినతి సమర్పించాలి.
3. ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ డిమాండ్ల దినోత్సవం జులై 10న భారీ సమీకరణ.
4. మే నుంచి నవంబర్ వరకు డిమాండ్లపై ప్రజల నుంచి రెండు కోట్ల సంతకాలను సేకరించాలి. వివిధ ఆందోళనలు, పార్లమెంట్ మార్చ్‌తో ఈ దేశవ్యాప్త ప్రచారం ముగుస్తుంది.

సంకెళ్లు వేసి తీసుకొస్తున్నా పట్టదా?

ప్రధాని మోడీ తమాషాగా చూడటం దుర్మార్గం

ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి తీసుకొచ్చినోళ్లు.. అమెరికా నుంచి తీసుకురాలేరా?

బతకడానికి పోయినోళ్లపై బీజేపీ వాళ్ల విషప్రచారం తగదు : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో ఏఐపీఎస్ఓ జాతీయ నేతలు కె.యాదవరెడ్డి, డిడ్డి సుధాకర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమెరికాలో బతకడానికి ఏజెంట్లు, దళారుల ద్వారా వెళ్లి మోసపోయిన భారతీయులను యుద్ధ ఖైదీల మాదిరిగా కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తుంటే ప్రధాని మోడీ తమాషాగా చూడటం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ, ఏఐపీఎస్ఓ జాతీయ నేత కె.యాదవరెడ్డి, ఏఐపీఎస్ఓ జాతీయ అధ్యక్ష వర్గసభ్యులు డిడ్డి సుధాకర్ విమర్శించారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపి భారతీయులను విమానాల్లో తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని మోడీ.. అమెరికాలో ఇన్‌లీగల్‌గా ఉంటున్న ఐదారు వేల మందిని గౌరవంగా తీసుకురాలేరా? అని నిలదీశారు. అక్కడకు బతకడానికి వెళ్లిన వారిపై బీజేపీ వాళ్లు క్రిమినల్స్ అని ముద్ర వేయడమేంటని ప్రశ్నించారు. అక్కడకు వెళ్లిన వారిలో ఎక్కువగా అప్పులు చేసిన వెళ్లినవారు, గుజరాతీయులు ఉన్నారని తెలిపారు. వారికి బేడీలు వేసి తీసుకు రావడాన్ని తప్పుబట్టారు. అమెరికాలోని మన ఎంబసీ ద్వారా దేశానికి తీసుకొచ్చే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను కాపాడాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో ట్రంప్ సర్కారు తీరుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలెన్ మస్క్ సంస్థల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదారు లక్షల మంది పనిచేస్తున్నారనీ, వారిని సగానికి కుదించడంలో భాగంగా వలసదారులను తిరిగి పంపాలని ట్రంప్‌పై ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే భారతీయులను అక్కడ నుంచి క్రిమినల్స్ మాదిరిగా తరలిస్తున్నారని వాపోయారు. భారతీయ యువత 30,40 ఏండ్లుగా అమెరికా దేశ అభివృద్ధికి దోహద పడుతున్న తీరును వివరించారు. బతకడానికి అమెరికా వెళ్లిన భారతీయులను అవమానకరంగా తిరిగి పంపుతుంటే కొందరు బీజేపీ తొత్తులు ట్రంప్ చర్యలను సమర్థించడం దుర్మార్గమన్నారు. వారంతా ఏజెంట్లు, దళారులను నమ్మి మోసపోయిన వారేనని చెప్పారు. వారు క్రిమినల్స్ కాదనీ, ఈ దేశంలో తాము చదువుకున్న చదువులకు సరైన వసతులు లేక ఉపాధిని వెతుక్కుంటూ అమెరికా వెళ్లినవారని గుర్తుచేశారు. వారికి సరైన సౌకర్యాలు, వసతలు కల్పిస్తే విదేశాలకు పోవాల్సిన అవసరం ఏముస్తుందని ప్రశ్నించారు. స్టీలు, అల్యూమినియం పన్ను వేసి మన దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే కుట్రకు ట్రంప్ పూనుకున్నారని విమర్శించారు. దీన్ని ఖండించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ నిరసనలో ఏఐపీఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వర్‌రావు, కాచం సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర నాయకులు వి.జయలక్ష్మి, ఉమా మహేశ్, జెకే.శ్రీనివాస్, పోలగాని రవికిషోర్, కిరణ్, హసన్, నరేంద్ర ప్రసాద్, రజాక్, అర్షద్, సమత, జగన్‌మోహన్, ఎమ్‌డీ.జావిద్, వైవీ.సుధావన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

భూమి పేరు మార్పిడికి రూ.లక్ష లంచం

నవతెలంగాణ-దుబ్బాక

భర్త పేరిట ఉన్న భూమిని భార్య పేరిట మార్చడానికి రూ.లక్ష లంచం తీసుకుంటూ దుబ్బాక ఆర్ఐ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా ఎం.నర్సింహారెడ్డి పనిచేస్తున్నాడు. అప్పనపల్లి గ్రామానికి చెందిన కుంభం రాజిరెడ్డి పేరిట ఉన్న 3.25 ఎకరాల భూమిని ఆయన భార్య సుజాత పేరు మీద మార్చడానికి గత నెల దరఖాస్తు చేసుకున్నారు.

మేడారం.. జనసంద్రం

- వనదేవతలకు ప్రత్యేక మొక్కులు
- ముగిసిన పూజారుల రహస్య పూజలు





నవతెలంగాణ -తాడ్వాయి

మేడారం మినీ జాతర రెండవ రోజు సందర్శకులు పోటెత్తడంతో జనసంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. జంపన్న వాగులో బ్యాటరీ ఆఫ్ టాప్స్ కింద స్నానాలు ఆచరించి, కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జంపన్న వాగు, మేడారం గద్దెల ప్రాంతం, ఇంగ్లీష్ మీడియం, ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట, రెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో సందర్శకులు కిక్కిరిసిపోయారు. తొక్కిసలాట జరగకుండా సులువుగా దర్శనాలు అయ్యేలా పోలీసులు దగ్గర ఉండి చర్యలు చేపట్టారు. కాగా, మేడారంలో పూజారులు రాత్రి 11గంటల ప్రాంతంలో గుడుల వద్ద పూజలు నిర్వహించి, మేడారంలోని సమ్మక్క-సార్లమ్మల గద్దెల వరకు చేరుకొని రహస్య పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రంతా జాగారాలు నిర్వహించి, గురువారం తెల్లవారుజాము ఉదయం 4గంటలలోపే ప్రత్యేక పూజలు చేయడంతో రహస్య పూజలు ముగిశాయి. కాగా ఈ నెల 12 న ప్రారంభమైన మినీ మేడారం జాతర ఈనెల 15తో ముగియనుంది.



వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.. బుధవారం రాత్రి 11గంటల సమయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, గ్రంధాలయ చైర్మెన్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మేడారం చేరుకున్నారు. గుడి నుంచి సమ్మక్కను గద్దెల వద్దకు తీసుకెళ్లేటప్పుడు ఆదివాసులతో కలిసి ఆమె వెళ్లారు. గురువారం ఉదయం సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలను ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. వనదేవతలకు ఇష్టమైన పసుపు, కుంకుమ, చీర సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు కూడా ముఖ్యమే కాబట్టి లక్నవరం నుంచి నీటిని విడుదల చేయలేదని, జంపన్న వాగు దగ్గర బ్యాటరీ ఆఫ్ టాప్స్ ఏర్పాటు చేశామని అన్నారు. వాటితో పుణ్యస్నానాల ఆచరించాలని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా వచ్చి దర్శించుకుని సురక్షితంగా ఇండ్లకు చేరాలని చెప్పారు.

నిరుద్యోగులూ..జాగ్రత్త

• ఉద్యోగాల పేరుతో మోసం • మయన్మార్, కంబోడియాలలోని కొన్ని కంపెనీల నిర్వాకం

- భారీగా జీతాలను ఎరగా చూపి ఆకర్షిస్తున్న వైనం
- అక్కడికి వెళ్లి తీవ్ర ఇబ్బందుల్లో భారతీయ యువత
- కట్టుదిట్టమైన భద్రతతో కంపెనీల కాంపౌండ్‌లు
- అక్కడి నుంచే కంపెనీల 'మోసపూరిత ప్లాన్లు' అమలు
- నివారించటంలో మోడీ సర్కారు విఫలం

భారత్‌లో డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగాలు దొరకక లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నారు. ఒకవేళ ఉద్యోగం దొరికినా.. వచ్చే జీతం తక్కువ కావటంతో చాలా మంది తీవ్ర నిరుత్సాహంలో ఉంటున్నారు. వీరి బలహీనతలనే కొన్ని విదేశీ కంపెనీలు క్యాష్ చేసుకుంటున్నాయి. భారీ జీతాలిస్తామంటూ భారతీయ యువతను ఆకర్షిస్తూ.. తీరా వారు అక్కడికి వెళ్లిన తర్వాత మోసం చేస్తున్నాయి. వారిని స్కామ్‌లలోకి దింపుతున్నాయి. మయన్మార్, కంబోడియా దేశాలు కేంద్రంగా ఇవి జరుగుతున్నాయి. ఇలాంటి కంపెనీలట్రాప్‌లో పడకుండా చూడటంలో మోడీ సర్కారు విఫలమవుతున్నది. దీంతో ఇలాంటి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళనకరం.





న్యూఢిల్లీ : యూపీలోని దాసౌలి గ్రామంలో ఒక కూరగాయల దుకాణం వద్ద ఉన్న రామ్ జనమ్ రావ్(35) తన ఫోన్‌ను చూస్తున్నాడు. మయన్మార్‌లోని ఇండియన్ ఎంబసీ నుంచి వచ్చిన ఈ-మెయిల్‌ను ఆయన చదువుతున్నాడు. తన అల్లుడు అజయ్ కుమార్(22) మయన్మార్‌లోని మయవాడ్డి ప్రాంతంలో ఐదు నెలలుగా చిక్కుకుపోయాడని ఆగస్టు 6న జనమ్ రావ్.. ఎంబసీకి లేఖ రాశాడు. 'దయచేసి ఓపిక పట్టండి' అంటూ ఆ తర్వాతి రోజే ఒక ఈ-మెయిల్‌లో ఎంబసీ పేర్కొన్నది. "ఆ ప్రాంతం చేరుకోలేనిది. మయన్మార్ యంత్రాంగం నియంత్రణలో లేదు. కాబట్టి ఎంబసీకి సహాయక చర్యలు సవాలుగా మారాయి" అని వివరించింది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో గల ఒక కాల్ సెంటర్ అజయ్ కుమార్‌తో పాటు వారి గ్రామానికి ధ్గరలోని మరొక ఇద్దరు సాగర్ చౌహాన్, ఆరుశ్ గౌతమ్‌లకు ఉద్యోగాలు ఆఫర్ చేసింది. " ఇక్కడ(యూపీ) ఉద్యోగాలు లేవు. అజయ్‌కు ఏదో ఒక ఉద్యోగం దొరికిందని సంతోషించాను. ఉద్యోగం కోసం ముగ్గురు కలిసి వెళ్తుండటంతో నేను దీమాగా ఉన్నాను" అని జనమ్ రావ్ తెలిపాడు. అయితే, ఆ ఉద్యోగాలు ఫేక్ అని ఆ తర్వాత తేలింది.



మహిళల్లా నటించి.. పురుషులను అందినకాడికి దోచుకోవాలంటూ..

ఈ ముగ్గురి లాగే ప్రపంచవ్యాప్తంగా వందలాది మందిని ఇలా తీసుకొచ్చారు. వారంతా మయవాడ్డీలోని ఒక కాంపౌండ్‌లో కంప్యూటర్ల ముందు ఉంటూ, మహిళల్లా నటిస్తూ సంపన్నులైన పురుషులను పరిచయం చేసుకోవాలనే బలవంతపు చర్యలు అక్కడ ఉన్నాయి. థాయ్‌లాండ్‌తో తూర్పున సరిహద్దును పంచుకునే ప్రాంతమే మయవాడ్డీ. ఇది స్కామ్‌స్టర్లుగా మారిన బాధితుల కథ. తొలుత వీరిని దక్షిణాసియాకు ఉద్యోగాల పేరిట ఆకర్షిస్తారు. ఆ తర్వాత స్కామ్ కాంపౌండ్‌లకు పరిమితం చేస్తారు. అక్కడ వారిని కొత్త సైబర్ ఐడెంటీలు తీసుకోవాలని బలవంతం చేస్తారు. వారి ద్వారా ప్రజలను మోసం చేయించి, అందినకాడికి దోచుకుంటారు.

తాము మోసపోతామన్న విషయం మలేషియాకు వెళ్లే ముందు ఈ ముగ్గురిలో ఏ ఒక్కరికీ అనుమానం రాలేదు. ఈ ప్రాంతం గురించి ఎంతో కొంత అవగాహన ఉన్న ఆరుశ్ గౌతమ్ కూడా మోసపోతామని అనుకోలేదు. 2023లో ఈయన కౌలాలంపూర్‌లో కస్టమర్ సపోర్ట్ సర్వీస్ సంస్థకు నాలుగు నెలలు పని చేశాడు. అయితే, ఆరోగ్య కారణాలరీత్యా ఆరుశ్ గౌతమ్ సర్జరీ కోసం అదే ఏడాది డిసెంబర్‌లో ఉద్యోగాన్ని విడిచి ఇంటికి రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

పని చేయటానికి నిరాకరిస్తే భౌతిక దాడులు

ఒక ట్రాన్స్‌లేటర్ ద్వారా ఓ వ్యక్తి దగ్గరకు మమ్మల్ని తీసుకెళ్లి, పని గురించి మాకు చెప్పారని గౌతమ్ వివరించాడు. క్రిప్టోకరెన్సీలో ఇన్వెస్ట్ కోసం వాట్సాప్‌లో ప్రపంచవ్యాప్తంగా పురుషులను ఆకర్షించటానికి తాము మహిళల్లా నటించాల్సి వచ్చిందని తెలిపాడు. అలా చేయటానికి తాను నిరాకరించినందుకు సదరు వ్యక్తి తనను కొట్టాడని చెప్పాడు. ఇక్కడి నుంచి వెళ్లాలనుకుంటే 8వేల డాలర్లయినా చెల్లించాలనీ లేకుంటే ఏడాదిన్నరపాటు పని చేయాలని ఆ వ్యక్తి గౌతమ్‌ను బెదిరించాడని వివరించాడు.

కేరళలోని కోజీకోడ్ జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితే కనిపించింది. థాయ్‌లాండ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఐదుగురికి హామీ ఇచ్చి కంబోడియాకు తీసుకెళ్లి అక్కడ వారిని సైబర్‌బానిసల్లా బలవంతంగా పని చేయించుకున్నారు కొందరు మోసగాళ్లు. గతేడాది ఆగస్టులో సెమిల్ దేవ్(25)కు ఇదే అనుభవం ఎదురైంది. ఆ సమయంలో మారుతీ సుజుకీలో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా రూ.20వేల జీతంతో పని చేస్తున్నాడు. థాయ్‌లాండ్‌లో ఒక సంస్థ నెలకు రూ.89వేలతో ఉద్యోగం ఆఫర్ చేస్తున్నదని తన తోటి ఉద్యోగి ద్వారా తెలుసుకున్నాడు. ఇలా తనతో పాటు మరో నలుగురు మిత్రులు అరుణ్, అశ్వంత్, అభినవ్, అభినంద్‌లు సెప్టెంబర్‌లో బ్యాంకాక్‌కు పయనమయ్యారు.

వారికి మరో ఇద్దరు మళయాళీలు తోడయ్యారు.ఒక రౌండ్ ఇంటర్వ్యూ తర్వాత.. ఏడుగురిని పట్టణంలో మధ్యలో ఉన్న కంపెనీ వసతికి తీసుకెళ్లారు. ఇది ఎత్తైన భవనాలతో కూడిన విశాలమైన, భారీ కాపలా కలిగి ఉన్న ఒక స్కామ్ కాంపౌండ్. అక్కడ వారి పాస్‌పోర్ట్‌లను సీజ్ చేశారు. కాంపౌండ్‌ను విడిచి వెళ్లొదంటూ హెచ్చరించారు. కేవలం కొన్ని గంటలే మొబైల్ ఫోన్‌లను ఉపయోగించుకోవటానికి అనుమతినిచ్చారు. పోయ్‌పెట్‌లో తొలి వర్కింగ్ డే రోజు 'డిజిటల్ అరెస్ట్'లకు సంబంధించిన ఒక స్క్రిప్ట్‌ను వారికి అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) కస్టమర్లను ఎలా డిజిటల్ అరెస్ట్ చేయాలో అందులో ఉంటుంది. ఒకవేళ చెప్పినట్టు చేయకపోతే.. కంపెనీ యాజమాన్యాల చేతిలో నరకం అనుభవించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి వెళ్లాలనుకుంటే డాలర్ల రూపంలో డబ్బు చెల్లించాలని బెదిరిస్తారు. భౌతికంగా దాడులు కూడా చేస్తారు. ఇలా వందలాది భారతీయ యువత విదేశీ కంపెనీల చేతుల్లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అయితే, కేంద్రంలోని మోడీ సర్కారు ఈ విషయంలో భారతీయ యువతను అప్రమత్తం చేయలేకపోతున్నదని కొందరు విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా.. కేంద్రం దృష్టిని సారించి, భారత యువత మోసపోకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

భారత్‌లో ఉద్యోగం దొరకక..

గతేడాది ఫిబ్రవరిలో ఆరుశ్ గౌతమ్.. కౌలాలంపూర్‌లోని తన మాజీ సహోద్యోగి జితేంద్ర సింగ్ (రోన్ని)ని మలేషియాలో మరో ఉద్యోగం కోసం సంప్రదించాడు. డిగ్రీ పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్న ఆరుశ్ గౌతమ్ స్నేహితులైన అజయ్ కుమార్, సాగర్ చౌహాన్‌లు కూడా తోడయ్యారు. నెలకు రూ.65వేల జీతంతో యాంగ్ కియాన్ గ్రూపు ఉద్యోగులను నియమించుకుంటున్నదని జితేంద్రసింగ్ ద్వారా తెలిసినట్టు తన ఇద్దరు స్నేహితులకు ఆరుశ్ గౌతమ్ తెలిపాడు.

దీంతో ఇంటర్వ్యూ కోసం సన్నద్ధమయ్యారు. వీడియో ఇంటర్వ్యూల ద్వారా వారు తమ ఆంగ్ల భాషా నైపుణ్యాలను పరీక్షించుకున్నారు. భారత్‌లో తమకు సరైన జీతం ఇచ్చే ఉద్యోగం దొరకటం కష్టంగా మారటంతోనే యాంగ్ కియాన్ జాబ్‌కు ఆసక్తి చూపినట్టు గౌతమ్, ఆయన మిత్రులు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం లేదని తల్లిదండ్రులు బాధపడటం, ఇంట్లోని పలు పరిస్థితుల కారణంగా సాగర్ జాబ్‌పై ప్రత్యేక ఆసక్తిని చూపెట్టాడని గౌతమ్ చెప్పాడు. అజయ్ కుమార్, ఆరుశ్ గౌతమ్‌లు ఇద్దరూ దళితులు కాగా.. సాగర్ చౌహాన్ ఠాకూర్ సామాజిక వర్గానికి చెందినవారు.

మయన్మార్‌లోని మయవాడ్డీ కేంద్రంగా..

సదరు సంస్థ ఫిక్స్ చేసి షెడ్యూల్ ప్రకారం.. కౌలాలంపూర్‌కు వెళ్లే ముందు గౌతమ్ తొలుత మయన్మార్‌లోని యంగోన్‌కు వెళ్లారు. కుమార్ చౌహాన్‌లు ఇద్దరు మరో రూట్‌లో వెళ్లారు. యంగోన్‌లో గౌతమ్‌ను తెల్ల యూనిఫామ్ ధరించిన ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్లారు. వారి ఎస్‌యూవీ కార్‌లోకి ఎక్కిన తర్వాత ఏదో తప్పు జరిగిందని గౌతమ్ తెలుసుకున్నాడు. ఆ ఇద్దరు సాయుధ గ్రూపునకు చెందినవారి వలే రైఫిల్‌ను కలిగి ఉన్నారని గౌతమ్ చెప్పాడు. 24 గంటల ప్రయాణం తర్వాత మయవాడ్డీలోని కాంపౌండ్‌కు వారు చేరుకున్నారు. సాయుధులైన గార్డులు అక్కడ పెట్రోల్ చేస్తూ కనిపించారు. కొన్ని రోజుల తర్వాత బ్యాంకాక్ గుండా గౌతమ్ స్నేహితులు చేరుకున్నారు.

జామియాలో విద్యార్థుల ఆందోళనలు

•10 మంది అరెస్టు •భారీగా పోలీసుల మోహరింపు



న్యూఢిల్లీ : గత డిసెంబరులో చేసిన కార్యక్రమం కారణంగా ఇద్దరు పిహెచ్‌డి స్కాలర్లకు తాజాగా షోకాజ్ నోటీసును జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆందోళనకు దిగారు. షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని, విద్యార్థులపై 'అణిచివేత చర్యలు' విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారుల ఫిర్యాదుతో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు రంగంలోకి దిగిన పోలీసులు 10 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. క్యాంపస్‌లో భారీగా భద్రతను ఏర్పాటు చేశారు. ఒక కంపెనీ పారామిలటరీ సిబ్బందితో పాటు, 100 మందికి పైగా ఢిల్లీ పోలీసులు మోహరించారు. అయినా విద్యార్థులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. కల్కాజీ పోలీస్ స్టేషన్ వద్ద కూడా విద్యార్థులు బతాయించారు. 10 మందిని అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నా.. పోలీసు చర్య తరువాత 20 మంది కనిపించకుండా పోయారని విద్యార్థులు విమర్శిస్తున్నారు. కనీసం అరెస్టు చేసిన వారి వివరాలను కూడా పోలీసులు వెల్లడించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగా, ఈ సంఘటన పూర్తి వివరాల ప్రకారం 2019 పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) వ్యతిరేక ఆందోళనలను గుర్తు చేస్తూ గతేడాది డిసెంబరు 15న 'జామియా రెసిస్టెన్స్ డే'ను విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు బాధ్యులుగా పేర్కొంటూ ఇద్దరు పిహెచ్‌డి స్కాలర్లకు విశ్వవిద్యాలయం పరిపాలన విభాగం అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 25న జరిగే క్రమశిక్షణా కమిటీ విచారణకు హాజరు కావాలని, వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ షోకాజ్ నోటీసు వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆందోళనల చేస్తున్న విద్యార్థులు విశ్వవిద్యాలయ ఆస్తులను ధ్వంసం చేశారని కూడా నకిలీ ఆరోపణలు చేశారు. అధికారుల ఫిర్యాదుతో క్యాంపస్‌లో ప్రవేశించిన పోలీసులు విద్యార్థులను చెదరగొట్టారు. 10 మందిని అరెస్టు చేశారు.



అనుకున్న ప్రకారమే

బందీల విడుదల

- ప్రకటించిన హమాస్
- ఒప్పందంలోని ప్రతి అంశమూ అమలు కావాలని స్పష్టీకరణ
- మధ్యవర్తులతో చర్చలు
- గాజాలోకి మొబైల్స్, భారీ పరికరాలపై ఇజ్రాయిల్ అభ్యంతరం

గాజా : కాల్పుల విరమణ ఒప్పందంలో ముందుగా అనుకున్న ప్రకారమే బందీల విడుదల జరుగుతుందని హమాస్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందంలోని నిబంధనలు, షరతుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించి, కైరోలో ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులతో తమ ప్రతినిధి బృందం చర్చలు జరిపినట్లు హమాస్ తెలిపింది. గాజాకు తిరిగి వచ్చిన తమవారికి ఇళ్ళు కల్పించడం, అత్యవసరంగా శిబిరాలు (కారవాన్) తెప్పించడం, భారీ పరికరాలు, వైద్య సరఫరాలు, ఇంధనం, ఆహారం, ఇతర సహాయ సదుపాయాలకు సంబంధించిన ప్రతీదీ ఒప్పందంలో పేర్కొన్న విధంగానే అమలు కావడంపై చర్చించామని తెలిపింది. చర్చలు సానుకూల వాతావరణంలోనే సాగాయని, ఇవన్నీ అమలు కావడంలో ఎదురయ్యే అడ్డంకులు, అభ్యంతరాలను తొలగించేందుకు తాము కృషి చేస్తామని మధ్యవర్తులు హామీ ఇచ్చారని తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఇంతకుముందు నిర్దేశించిన టైమ్ టేబుల్ ప్రకారమే బందీల విడుదలతో సహా అన్నీ జరుగుతాయని పేర్కొంది.


గాజాలోకి మొబైల్ ఫోన్లు, లేదా భారీ యంత్రాలు, పరికరాలు ప్రవేశించడానికి వీల్లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ప్రతినిధి ఒమర్ దోస్త్రి స్పష్టం చేశారు. ఇందుకోసం తమ మధ్య ఎలాంటి సమన్వయం లేదని చెప్పారు. పైగా ఒప్పందం ప్రకారం రాఫా క్రాసింగ్ ద్వారా ఎలాంటి వస్తువులు కూడా గాజాలోకి ప్రవేశించరాదని దోస్త్రి చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ ప్రకటన నేపథ్యంలోనే హమాస్, కైరోలో మధ్యవర్తులతో చర్చలు జరపాల్సి వచ్చింది. శనివారం విడుదల చేయాల్సిన ముగ్గురు ఇజ్రాయిల్ బందీలను విడిచిపెట్టడంలో ప్రతిష్టంభన నెలకొంటే గాజాలో మళ్లీ దాడులు మొదలవుతాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ కూడా హెచ్చరించారు. మరోవైపు ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ మాట్లాడుతూ, గాజాను మొత్తంగా ఆక్రమించి అక్కడ బాధ్యత తీసుకుని చర్యలు చేపడుతామని తెలిపారు. ట్రంప్ ప్రతిపాదనను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గత 16మాసాలుగా జరుగుతున్న దాడుల్లో గాజాలో మరణించిన వారి సంఖ్య 48,239 కాగా, గాయపడిన వారి సంఖ్య 1,11,676గా గాజా ఆరోగ్య శాఖ ధృవీకరించింది. అయితే, ప్రభుత్వ మీడియా కార్యాలయం మృతుల సంఖ్యను సవరించింది. మరణించిన వారి సంఖ్యను 61,709గా పేర్కొంది. శిథిలాల కింద చిక్కుకుపోయి అదృశ్యమైన వారుగా లెక్కిస్తూ వచ్చిన వేలాదిమందిని ఇక మృతులుగా లెక్కగట్టినట్లు మీడియా కార్యాలయం పేర్కొంది. గత 24 గంటల్లో గాజాలో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించగా, 14 మృత దేహాలను స్వాధీనం చేసుకున్నారు.

మానుకోట సాలార్ తండా వద్ద ఉద్రిక్తత

ఎన్‌హెచ్ సర్వేను అడ్డుకున్న గిరిజనులు | పోలీసులు, మహిళలకు మధ్య వాగ్వాదం, తోపులాట

- 300 మంది పోలీసుల పహారాలో సర్వే.. 13 మంది గిరిజనుల అరెస్ట్, విడుదల
- మాజీ ఎమ్మెల్యేల భూములు తప్పించారు
- మా శవాలపై రోడ్లు వేయండి : గిరిజనుల ఆవేదన



నవతెలంగాణ-మహబూబాబాద్

వలిగొండ నుంచి భద్రాచలం వరకు ప్రభుత్వం నిర్మిస్తున్న 930పీ జాతీయ రహదారి సర్వేలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గురువారం ఉదయం మహబూబాబాద్ జిల్లా శివారు కొత్త కలెక్టరేట్ సాలార్‌తండాకు ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేషనల్ హైవే అధికారులు సర్వేకు రాగా.. గిరిజనులు అడ్డుకున్నారు. దాంతో గిరిజన మహిళలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. డీఎస్పీ తిరుపతి నేతృత్వంలో 300మంది పోలీసుల పహారాతో 100మందిని హౌస్ అరెస్ట్ చేసి సర్వే కొనసాగించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియనాయక్ భూములను తప్పించేందుకు లంబాడీ గిరిజనుల భూముల పైనుంచి రోడ్డు వేయడానికి సర్వే చేస్తున్నారని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వలిగొండ నుంచి వయా తిరుమలగిరి, తొర్రూరు, మహబూబాబాద్, ఇల్లందు-కొత్తగూడెం మీదుగా భద్రాచలం వరకు 930పీ నేషనల్ హైవే 2017లో మంజూరైంది. ఈ రోడ్డు కోసం వలిగొండ నుంచి తురుము వరకు భూసేకరణతో పాటు టెండర్లు పూర్తయి పనులు కొనసాగుతున్నాయి. తొర్రూరు వయా నెల్లికుదురు, మహబూబాబాద్, ఇల్లెందు కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు ల్యాండ్ ఆక్టివేషన్ కోసం సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిపురం గ్రామం, మెడికల్ కాలేజీ, కలెక్టరేట్ పక్క నుంచి ఇల్లందు రోడ్డుకు నేషనల్ హైవేను కలుపుతున్నారు. అయితే మానుకోట పట్టణానికి ఎంత దూరం నుంచి హైవే నిర్మించాలనే దానిపై ఇప్పటికే అధికారులు మూడు నాలుగు సార్లు సర్వేలు చేశారు. చివరికి కలెక్టరేట్ పక్క నుంచి తీయాలని నిర్ణయించారు. సర్వేలో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులు.. కలెక్టరేట్ సమీపంలో ఉన్న సాలార్ తండా వద్దకు వచ్చారు. కాగా, భూ సేకరణను వ్యతిరేకిస్తున్న గిరిజనులు సర్వే సమయంలో ఘర్షణకు దిగుతారన్న అనుమానంతో 300 మంది పోలీసులతో అధికారులు గ్రామానికి వచ్చారు. 100 గృహాల వద్ద పోలీసులను కాపలా పెట్టారు. అయినా సర్వేను అడ్డుకోవడానికి 50 మంది గిరిజన రైతులు రాగా.. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా.. వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని అదుపులోకి తీసుకొని మానుకోట కొరివి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిని సర్వే అనంతరం 12 గంటల తర్వాత 13మందిపై కేసులు నమోదు చేసి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో.. బాదావత్ బాలాజీ, బానోత్ రంజిత్, భూక్య రమేష్, భూక్య రవి, భూక్య సిరి, భూక్య పద్మ, బాధావతి విజయ, బాదావత్ వాష్య, భూక్య కళ్యాణ్, బాదావత్ పంతుల్య, నీరుటి లక్ష్మీనారాయణ, గూగుల్లోతు రాము బాదావత్ యశ్వంత్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేల భూములు తప్పిస్తున్నారు : గిరిజన రైతులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, హరిప్రియ నాయక్‌ల భూములను తప్పించడం కోసం గిరిజన తండాల మీదుగా నేషనల్ హైవే తీస్తున్నారని రైతు నీరుటి లక్ష్మీనారాయణ, గిరిజన మహిళ భూక్య పద్మ, బాధావతి విజయ, రైతులు భూక్య రమేష్ భూక్య రవి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మానుకోట జిల్లాలో అభివృద్ధి సంక్షేమ పథకాల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీల భూములు పోవడం లేదని, కేవలం పేద గిరిజన రైతుల భూములే లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నర్సంపేట, సూర్యాపేట నేషనల్ హైవే కోసం గిరిజన భూములు లాక్కున్నారని, కలెక్టరేట్, మెడికల్ కాలేజీ నిర్మాణం కోసమూ తమ భూములు లాక్కున్నారని తెలిపారు. ఇప్పుడు నేషనల్ హైవే 930 కోసం కూడా గిరిజన తండాలను కూడా లాక్కుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో మల్యాలలో నిర్మించే హార్టికల్చర్ కళాశాల కోసం కూడా గిరిజన భూములే సర్వే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, సీఎం, కేంద్ర మంత్రి గడ్కారీ, బీజేపీ నేతలకు సైతం వినతిపత్రాలు ఇచ్చినా పట్టించులేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఐదు కిలోమీటర్ల దూరం నుంచి నేషనల్ హైవే తీయాలని తీర్మానం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. కేవలం గిరిజన భూములే టార్గెట్‌గా నాలుగో అలైన్‌మెంట్ సర్వే చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యే చేతులెత్తేయడం శోచనీయమని మండిపడుతున్నారు.

మా శవాలపై రోడ్లు వేయండి : గిరిజన మహిళా రైతులు

తమ సాలార్ తండా గిరిజన రైతుల శవాల మీద నుంచి రోడ్లు వేస్తారా అంటూ గిరిజన మహిళా రైతులు నీరుటి లక్ష్మీ నారాయణ, భూక్య పద్మతో పాటు మరికొంతమంది గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుంచి సర్వే చేస్తున్నారని, అయినా తెగడం లేదని తెలిపారు. తమకు కేవలం 5 నుంచి 6 గుంటల భూమి మాత్రమే ఉండగా అది కూడా లాక్కుంటున్నారని వాపోయారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు వచ్చి మహిళలు పడుకొని ఉండగా నైటీల మీద అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. తాత ముత్తాతల కాలం నుంచి వచ్చిన భూమిలో ఇల్లు కట్టుకుంటే కలెక్టరేట్ రోడ్డు కోసం కూల్చి వేశారని, ఇప్పుడు ఉన్న గుంట భూమిని లాక్కొంటే తామెట్లా బతకాలని అన్నారు. చావనైనా చస్తాం కానీ శవాల మీద రోడ్లు వేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

ఉక్రెయిన్ పోరు ముగిసేనా?

అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ బుధవారం నాడు రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌తో గంటన్నరపాటు ఫోన్లో చర్చలు జరిపారు. ఉక్రెయిన్ పోరును ముగించేందుకు సంప్రదింపులు ప్రారంభించాలని ఇద్దరూ అంగీకరించారు. నేతలిద్దరూ సౌదీ అరేబియాలో భేటీ అయ్యే ముందు ఇరు దేశాల ప్రతినిధి వర్గాలు చర్చలు జరుపుతాయి. ఇవీ బుధ, గురువారాల నాటి వార్తల సారాంశం. మరోవైపున అంతకుముందు రోజు ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ ఏమన్నాడు! 'ఉక్రెయిన్ లేకుండా ఉక్రెయిన్ గురించి చర్చలు కుదరవు, తమ భూభాగాలను తిరిగిస్తే దానికి బదులుగా మేము ఆక్రమించుకున్న కురుస్క్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగిస్తాం' అన్నాడు. ససేమిరా అది కుదిరేది కాదని రష్యా స్పష్టం చేసింది. ఏ సంప్రదింపుల్లోనైనా ఐరోపా, ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం ఉండాల్సిందే, ఉక్రెయిన్ భద్రతకు గట్టి హామీ

ఇంతకాలం జెలెన్‌స్కీ సేనలు రష్యన్లను ఎదుర్కొంటున్నాయంటే అవి ఇచ్చిన ఆయుధాలు, మద్దతే కారణం. ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కార సమస్యలో అమెరికా-ఐరోపా దేశాల మధ్య మిత్ర వైరుధ్యం ఉన్నట్లు ఏడు దేశాల ప్రకటన సూచిస్తున్నది. పుతిన్‌తో చర్చల తరువాత జెలెన్‌స్కీ కూడా ట్రంప్‌తో మాట్లాడినప్పటికీ వివరంగా చర్చ జరిగినట్టు మాత్రమే చెప్పాడు తప్ప ఉత్సాహం కనపడలేదు. ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారం కావాలని అందరూ కోరుకుంటున్నారు.శాంతి చేకూరాలని కోరుకోవటమే కాదు, దానికి చిత్తశుద్ధితో చేతులు కలపటం కూడా ముఖ్యమే.

కావాలంటూ బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీతో సహా ఏడు నాటో కూటమి దేశాలు ఒక సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి. ఇదీ తాజా పరిస్థితి.



'నేను అధికారానికి వచ్చిన ఇరవై నాలుగు గంటల్లోనే ఉక్రెయిన్ పోరును ముగిస్తా' అని ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. అయితే అది అంత తేలిక కాదని, ఒక వేళ ముగియాలన్నా కొన్ని నెలలు పడుతుందని అతగాడి యంత్రాంగం చెప్పిన తర్వాతతీరు మారింది. తమ ఆయుధాలు అమ్ముకోవటానికి, లాభాలను కొనసాగించటానికి ఉక్రెయిన్ పోరు కొనసాగాలని అమెరికా ఆయుధ పరిశ్రమ ఒత్తిడి తెస్తున్నది. నిజానికి ఉక్రెయిన్ పోరుతో నిమిత్తం లేకుండానే నాటో కూటమి దేశాలు జీడీపీలో రెండుశాతం మొత్తాలను ఖర్చు చేయాలని ఎప్పటి నుంచో అమెరికా ఒత్తిడి తెస్తున్నది, ఐరోపా రక్షణకు తామెందుకు మూల్యం చెల్లించాలని తొలిసారి అధికారానికి వచ్చినపుడే ట్రంప్ ప్రశ్నించాడు. ఇప్పుడు కనీసం ఐదుశాతం ఉండాలని చెబుతున్నాడు.అమెరికా 3.4శాతం, బ్రిటన్2.3, రష్యాకు దగ్గరగా ఉన్న పోలాండ్, బాల్టిక్ దేశాలు నాలుగు శాతానికి అటూఇటూగా ఖర్చు చేస్తున్నాయి. ఇదంతా రష్యాను బూచిగా చూపుతున్న ఫలితమే.

ప్రతిదాన్నీ డాలర్లలో కొలుచుకునే ట్రంప్‌కు ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిస్తే అమెరికన్లకు నష్టమే తప్ప లాభముండదు. అందువలన పుతిన్‌తో చర్చలు జరిపినా నిజంగా పరిష్కా రానికి ట్రంప్ ముందుకు వెళతాడా అన్నది సందేహమే. ఇజ్రాయిల్-హమాస్ మధ్య కుదిరిన ఒప్పందానికి విఘాతం కలిగించే విధంగా గాజా ప్రాంతం నుంచి పాలస్తీనియన్లు ఈజిప్టు, జోర్డాన్ వెళ్లి ఆ ప్రాంతాన్ని తమకు అప్పగించాలని ట్రంప్ కోరటం చూస్తున్నదే.ఒక వైపు 2014కు ముందున్న స్థితి గురించి ఉక్రెయిన్ పట్టుబడితే అది వాస్తవికతకు దూరం అని, కొన్ని ప్రాంతాలను వదులుకోక తప్పదనే సందేశాన్ని అమెరికా ఇస్తున్నది. మరోవైపు విలువైన ఖనిజ సంపదలున్న ప్రాంతాలను తమకు అప్పగిస్తే ఉక్రెయిన్‌కు సాయం చేస్తామని కూడా అది బేరం పెట్టింది. దీనికి ఐరోపాలోని ధనిక దేశాలు అంగీకరిస్తాయా? అంటే లేదని వేరే చెప్పనవసరం లేదు.

చర్చలు జరపాలన్న ట్రంప్ ప్రతిపాదనను రష్యా వ్యతిరేకించదు. చర్చలు, పరిష్కారం తన అజెండా ప్రకారం జరగాలని అది కోరుకుంటున్నది. నాటోను తమ దిశగా విస్తరించకూడదు, ఉక్రెయిన్‌కు చోటు కల్పించకూడదన్న హామీ కావాలని అది తొలినుంచీ డిమాండ్ చేస్తున్నది. దానికి తిరస్కరించిన కారణంగానే గతంలో తన భాగంగా ఉన్న క్రిమియా ప్రాంతాన్ని 2014లో ఉక్రెయిన్ నుంచి విలీనం చేసుకున్నది. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో తలెత్తిన వేర్పాటువాదానికి మద్దతు ఇచ్చి ఇప్పటి వరకు దాదాపు ఇరవై శాతం ప్రాంతాన్ని తమ అదుపులోకి తెచ్చుకుంది. దానితో పోలిస్తే జెలెన్‌స్కీ చెబుతున్న కురుస్క్ ప్రాంతాన్ని అసలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరమే లేదు. దాన్నుంచి అది వెనక్కు తగ్గటం తప్ప తురుపుముక్కగా వాడే పరిస్థితిలో లేదు.ట్రంప్, అతని అధికారగణం ఆలోచన ప్రకారం నాటోలో ఉక్రెయిన్ చేరకూడదు. నిజంగా అదే జరితే జెలెన్‌స్కీ రాజకీయంగా ఆత్మహత్యకు పాల్పడినట్లే. చర్చలు జరిగి ఒప్పందం అంటూ కుదిరితే, అది కేవలం సైనిక చర్య నిలుపుదలకే పరిమితమైతే ఐరోపా దేశాల పరువూ పోవటం ఖాయం. ఈ మాత్రం దానికి మూడేండ్లు ఎందుకు ప్రతిఘటించినట్లు అని జనం కూడా ప్రశ్నిస్తారు. ఇంతకాలం జెలెన్‌స్కీ సేనలు రష్యన్లను ఎదుర్కొంటున్నాయంటే అవి ఇచ్చిన ఆయుధాలు, మద్దతే కారణం. ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కార సమస్యలో అమెరికా-ఐరోపా దేశాల మధ్య మిత్ర వైరుధ్యం ఉన్నట్లు ఏడు దేశాల ప్రకటన సూచిస్తున్నది. పుతిన్‌తో చర్చల తరువాత జెలెన్‌స్కీ కూడా ట్రంప్‌తో మాట్లాడినప్పటికీ వివరంగా చర్చ జరిగినట్టు మాత్రమే చెప్పాడు తప్ప ఉత్సాహం కనపడలేదు. ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారం కావాలని అందరూ కోరుకుంటున్నారు.శాంతి చేకూరాలని కోరుకోవటమే కాదు, దానికి చిత్తశుద్ధితో చేతులు కలపటం కూడా ముఖ్యమే.

మహాత్ముడినే కాల్చి చంపిన
మతోన్మాద రాక్షస మూకల
వారసులు వాళ్లు!
గుడిలో అర్చకులు వాళ్లకొక లెక్కనా!

గుళ్ల గోపురాల మీద
ఆధిపత్యం వాళ్ల ఆశయం!
ఉన్నాడో లేడో తెలియని
దేవుడి కండ్లుగప్పి
హుండీని ఖాళీ చేయడమే
వాళ్ల లక్ష్యం!

విద్వత్తుగల పండితులకు
పాదాభివందనం చేయడం ఓ నాటకం!
ప్రశ్నిస్తే పీకలు కోయడం వాళ్ల నైజం!

మూసీని కాదు, మూకలను ప్రక్షాళన చేయాలి..




చదువులు, చర్చలు,
తర్కమంటే వాళ్లకు రోత
మూర్ఖంగా జేజేలు పలికే
వాళ్లే కావాలి వాళ్లకు!
అందుకే పుస్తకాలను చించి
తగలేస్తుంటారు వాళ్లు!

మధ్య యుగాల అనాగరిక సంస్కృతికి
ఆధునికత ముసుగేసుకున్న మూక వాళ్లు!
అంతిమంగా ఈ దేశాన్ని
చీకటి యుగంలోకి నడిపిస్తారు వాళ్లు!

గంగా జమునా తెహజీబ్ తెలంగాణను
ఇప్పటికే కలుషితం చేశారు వాళ్లు!
మూసీ ప్రక్షాళన కాదు, ముందుగా
వీళ్లనుండి తెలంగాణ ప్రక్షాళనకు
నడుం బిగించాలి మనమందరం!

- జనార్ధన్. యస్

అశోకమౌర్య యువరాజు ఎలా అయ్యాడు?



డాక్టర్ దేవరాజు మహారాజు

గతాన్ని భవిష్యత్ తరాలకు అందించడంలో గ్రంథాలు ఎంతటి గణనీయమైన పాత్ర పోషించాయన్నది మాటలకు అందదు. అర్థం చేసుకోవాల్సిందే! ఉదాహరణకు 'అశోక వదన' సంస్కృత గ్రంథం ప్రకారం- అశోకుడు సాధారణ - శకానికి పూర్వం 304వ సంవత్సరం చైత్రమాసం శుక్లపక్షం అష్టమి రోజు పుట్టాడు. అదే సంవత్సరం అశోకుడి తాత చంద్రగుప్త మౌర్య (350- 295 BCE) సిరియా రాజు సెల్యుకస్ భారతదేశంపై చేసిన దండ యాత్రను తిప్పికొట్టాడు. సిరియా ఆక్రమణలో ఉన్న నాలుగు ప్రాంతాలు: హరాత్, కాంధహార్, బెలూచిస్థాన్, హిందూ కుష్‌లు భారత్‌లో అంటే మౌర్య సామ్రాజ్యంలో కలిశాయి. అశోకుడు పుట్టిన శుభసందర్భంలో తమకు ఈ విజయం దక్కిందని మౌర్యులు భావించారు. చంద్రగుప్త - దుర్ధరల కుమారుడు, మౌర్యవంశపు రెండో రాజు బిందుసారుణ్ణి గ్రాము, రోమన్ రచయితలు అమిత్ర ఘాట- అని పిలుచుకున్నారు. అంటే, అమిత్రుల్ని (శత్రువుల్ని) సంహరించే వాడు అని అర్థం! బిందుసారుడికి ఉన్న పదహారు మంది భార్యల్లో శుభద్రాంగి (ధర్మ) ఒకరు. ఈమే అశోకుడి కన్నతల్లి. ఈమె ఏ దేశపు రాజు కుమార్తెనో కాదు, జానపదుల బిడ్డ. అయితే ఆమెకు మాలిష్ చేయడం బాగా వచ్చేది. మాలిష్ చేసి అలసట తీర్చగలిగే ఆమె ప్రతిభకు మెచ్చి, బిందుసారుడు ఆమెను పట్టపురాణిగా ప్రకటించాడు. ఆమె అందరిలోకి పెద్దది కాకపోయినా రాజాజ్ఞ ప్రకారం మిగతా రాణులందరూ ఆమెను పట్టపురాణిగా గుర్తించక తప్పలేదు. గౌరవించక తప్పలేదు.

కొంతకాలం తర్వాత, శుభద్రాంగి (ధర్మ) ఒక కుమారుడికి జన్మనిచ్చింది. ఎక్కడో చిన్న పల్లెలో ఉండే తను, చక్రవర్తికి పట్టమహిషి కావడమేమిటీ? అతని సంతానానికి తల్లి కావడమేమిటీ? జీవితంలో అద్భుతాలు జరుగుతూ ఉండడం వల్ల ఆమె ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. కుమారుడికి ఏ పేరు పెడదామని బిందుసారుడు శుభద్రాంగిని అడిగినప్పుడు - తనకు శోక నివృత్తి జరిగిందనీ, తన కోరికలన్నీ తీరాయనీ చెపుతుంది. ఆమె చెప్పిన విషయం ప్రతిఫలించే విధంగా కుమారుడికి 'అశోక' అని పెట్టాడు తండ్రి బిందుసారుడు. ఇక్కడ అశోక వదన (మహావంశం) గురించి కొన్ని విషయాలు చెప్పుకోవాలి. అశోక ద గ్రేట్ అని పిలువబడ్డ చక్రవర్తికి సంబంధించిన జీవిత చరిత్రే అశోక వదన- అనే సంస్కృత గ్రంథం: మధుర ప్రాంతానికి చెందిన కొందరు బౌద్ధసన్యాసులు సాధారణ శకానికి ముందు నుండే - దీని కూర్పు ప్రారంభించారనీ, కాలానుగుణంగా సాధారణ శకం ఐదవ శతాబ్దం వరకు ఆకూర్పు కొనసాగి, దానికొక సమగ్ర రూపం లభించిందనీ చెపుతారు. అది వెలువడిన తొలిదశలోనే ఆగ్రంథం చీనీ భాషలోకి అనువాదమయింది. ఆ తర్వాత, అనేక ప్రపంచ భాషల్లోకి అనువాదమవుతూ వెళ్లింది. 1983లో జాన్. ఎస్. స్ట్రాంగ్ చేసిన ఇంగ్లీషు అనువాదం మనలాంటి ఆధునికులకు అందింది. దాన్ని పిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రచురించింది. (అశోక వదనతో పాటు అశోక చక్రవర్తిపై... వెలువడ్డ అనేక ఇంగ్లీషు పుస్తకాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయి.. అశోకవదన లోంచి తీసుకున్న అంశాలనే నేను ఈ వ్యాసంలో పొందుపరుస్తున్నాను)

బిందుసారుడికి ఇతర భార్యలతో కలిగిన కుమారులు ఉన్నారు. వారితో పాటుగా అశోకుడికి విద్య - యుద్ధకళలు నేర్చుకునే ఏర్పాటుచేశాడు తండ్రి. కొడుకులందరిలోకి పెద్దవాడు సుశీమ్. అందువల్ల అతడినే తన వారసుడిగా ప్రకటించాలని అనుకున్నాడు బిందుసారుడు. కానీ, చురుకైన స్వభావం, కుశాగ్ర బుద్ధితో అశోకుడు సత్వరమే అన్ని విషయాలలో ఉన్నతంగా రాణిస్తూ వచ్చాడు. దానితో సుశీమ్‌లో అసూయ పెరిగింది. ప్రతి విషయంలో ప్రతిసారి అశోకుణ్ణి చిన్నబుచ్చడం, తక్కువ చేసి మాట్లాడడం, దాసీ పుత్రుడనడం చేస్తూ వచ్చాడు. అశోకుడి ప్రతిభా పాటవాలకు ముగ్ధులైన మంత్రులు అశోకుడే కాబోయే రాజు అని నిర్ణయించుకున్నారు. అదే విషయం రాజు బిందుసారుడికి చెప్పారు. కానీ, ఆయన నిర్ణయం వేరుగా ఉంది. పెద్దవాడు సుశీమ్ ఉండగా రాజ్యాధికారం మరొకరికి కట్టబెట్టడం కుదరదు కదా? అన్నది ఆయన ఆలోచన. ఆమాత్యుల సలహా వేరుగా ఉండడం వల్ల ఆయన సందిగ్ధంలో పడ్డారు. ఎటూ తేల్చుకోలేక చివరకు తనకు నమ్మకమున్న అజీవక సంప్రదాయ సన్యాసులని సంప్రదించ చాలనుకున్నాడు. తన



"రాజా! నేను చూసింది. అర్థం చేసుకుంది - చెపుతాను వినండి! రాజ కుమారులందరూ అలంకరించబడ్డ రథాలలో వచ్చారు. అశోకుడు మాత్రం వీరుడిలా ఒంటరిగా ఏనుగుపై స్వారీ అయి వచ్చాడు. రాజుకు ఉండాల్సిన లక్షణం అది! అలాగే రాజకుమారులందరూ ఎత్తయిన మెత్తని ఆసనాల మీద కూర్చుని, వెండి, బంగారు పాత్రల్లో భోజనాలు చేశారు. ఒక్క అశోకుడు మాత్రమే నేలమీద కూర్చున్నాడు. మట్టి పాత్రలో భోజనం చేశాడు. నేలతల్లిని గౌరవించడం అతనికి తెలుసు. మట్టిపాత్ర విలువ అతడికి తెలుసు. ప్రకృతిని, పర్యావరణాన్ని అంతగా ప్రేమించే వాడు, భూమ్మీద కూర్చుని మట్టి పాత్రలో భోజనం చేయగలిగిన వాడు.. తప్పక ప్రజలతో మమేకం కాగలడు! వారి కష్ట సుఖాలు సులభంగా గ్రహించగలడు. వారి దుఃఖాన్ని రూపుమాపగలడు. మట్టి బంధాన్ని వదులుకోలేని వాడు, మట్టితో బాంధవ్యం గల మనుషులందరితో తన బంధాన్ని పదిలంగా చూసుకోగలడు. నిస్సందేహంగా అశోకుడే యువరాజు కావడానికి యోగ్యుడు- అని అన్నాడు ఆచార్య వత్సజీవ్.

కుమారులందరికీ పరీక్షపెట్టి అందరిలోకి అర్హుడైన వాడెవరో తేల్చమని అప్పటికి తన సభలో ఉన్న పింగల వత్సజీవ్ అనే సాధువును కోరాడు. అందుకు ఆయన సమ్మతించి రాకుమారులందరినీ సువర్ణమండప ఉద్యానవనానికి పిలిపించమన్నాడు. అక్కడయితే తను అందరినీ శ్రద్ధగా పరీక్షించగలనని చెప్పాడు. ఇంకేముంది? రాజాజ్ఞ వెంటనే రాకుమారులందరికీ అందింది.అందరికందరు పరీక్షాస్థలానికి వెళ్లడానికి సంసిద్ధులవుతూ ఉన్నారు. ఆ పిలుపు తనకు కాదన్నట్లు అశోకుడు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నాడు. రాజ కుమారులందరూ ఉత్సా హంగా ఉరక లేస్తూ సిద్ధమవుతూ ఉంటే, తన కుమారుడికేమయ్యిందీ? అలా నీరసపడి కూర్చున్నాడూ? అని తల్లి శుభద్రాంగి (ధర్మ) వచ్చి అడిగింది.

"ఇతర రాజకుమారుల వలె తను అందగాణ్ణి కాదని, తన తండ్రి తన ముఖం చూడడానికే ఇష్టపడడనీ, అలాంటప్పుడు ఎందుకు హడావుడి పడి అక్కడికి వెళ్లడం?" అన్నాడు అశోకుడు. 'అందచందాలు ముఖ్యం కాదని, ప్రతిభ ముఖ్యమనీ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించడానికి నువ్వెందుకు వెనుకాడుతున్నావని' - ప్రశ్నించింది తల్లి. ఒక జనపదం నుండి వచ్చిన తను, కేవలం ప్రతిభ సేవాభావంతోనే పట్టపురాణి కాగలిగానా లేదా? - అంటూ తన విషయం ఉదహరించి చెప్పింది. ఆశోకుడన్న పేరు తండ్రి పెట్టిందేననీ, పుత్రవాత్సల్యం లేకుండా ఎలా ఉంటుంది? - అని ప్రశ్నించింది. సమాధాన పరిచి అశోకుడిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తనకు తన కుమారుడి మీద పూర్తి విశ్వాసముందని ఎన్నో విధాలా నచ్చచెప్పింది. తల్లి మనసు కష్టపెట్టగూడదనుకుని, అశోకుడు పరీక్షలకు సిద్ధపడ్డాడు. తల్లి ఆశిస్సులతో స్వర్ణమండప ఉద్యానవనానికి బయలుదేరాడు. తన భోజనం అక్కడికే పంపమని చెప్పుకుంటూ వెళ్లిపోయాడు?

రాకుమారులందరూ మనోహరంగా అలంకరించబడ్డ తమ తమ రథాలలో ముందే అక్కడికి చేరుకున్నారు. రథాలు దిగి, వారు ఏర్పాటు చేసుకున్న రత్న ఖచిత ఆసనాలపై ఆసీనులయ్యారు. అశోకుడు ఏనుగు నెక్కి అక్కడికి చేరుకున్నాడు. అతని కోసం అక్కడ ఆసనమేద లేకపోవడంతో, భుజం మీది కండువా తీసి, నేలమీద పరుచుకుని, కూర్చున్నాడు. రాజకుమారులందరూ బంగారు పళ్లాలలో భోజనాలు చేశారు. అశోకుడి తల్లి శుభద్రాంగి కొడుకు కోసం మట్టి పాత్రలో భోజనం పంపింది - అందరూ భోజనాలు ముగించుకున్న తర్వాత తన కుమారులలో పట్టాభిషేకానికి ఎవరు యోగ్యుడో తేల్చమని రాజు బిందుసారుడు ఆచార్య వత్సజీవ్‌ను అడిగాడు. ఆ సాధువు ఆలోచించి ఇలా చెప్పాడు.

"రాజా! నేను చూసింది. అర్థం చేసుకుంది - చెపుతాను వినండి! రాజ కుమారులందరూ అలంకరించబడ్డ రథాలలో వచ్చారు. అశోకుడు మాత్రం వీరుడిలా ఒంటరిగా ఏనుగుపై స్వారీ అయి వచ్చాడు. రాజుకు ఉండాల్సిన లక్షణం అది! అలాగే రాజకుమారులందరూ ఎత్తయిన మెత్తని ఆసనాల మీద కూర్చుని, వెండి, బంగారు పాత్రల్లో భోజనాలు చేశారు. ఒక్క అశోకుడు మాత్రమే నేలమీద కూర్చున్నాడు. మట్టి పాత్రలో భోజనం చేశాడు. నేలతల్లిని గౌరవించడం అతనికి తెలుసు. మట్టిపాత్ర విలువ అతడికి తెలుసు. ప్రకృతిని, పర్యావరణాన్ని అంతగా ప్రేమించే వాడు, భూమ్మీద కూర్చుని మట్టి పాత్రలో భోజనం చేయగలిగిన వాడు.. తప్పక ప్రజలతో మమేకం కాగలడు! వారి కష్ట సుఖాలు సులభంగా గ్రహించగలడు. వారి దుఃఖాన్ని రూపుమాపగలడు. మట్టి బంధాన్ని వదులుకోలేని వాడు, మట్టితో బాంధవ్యం గల మనుషులందరితో తన బంధాన్ని పదిలంగా చూసుకోగలడు. నిస్సందేహంగా అశోకుడే యువరాజు కావడానికి యోగ్యుడు- అని అన్నాడు ఆచార్య వత్సజీవ్. ఆ నిర్ణయం అమాత్యులందరికీ ఆనందాన్ని చ్చింది. అశోకుడి వినయ విధేయతలు, విషయ పరిజ్ఞానం ఒకపక్క ఆచార్యుడు, అమాత్యుల నిర్ణయం మరొక పక్క

బిందుసారుడికి ఇతర భార్యలతో కలిగిన కుమారులు ఉన్నారు. వారితో పాటుగా అశోకుడికి విద్య - యుద్ధకళలు నేర్చుకునే ఏర్పాటుచేశాడు తండ్రి. కొడుకులందరిలోకి పెద్దవాడు సుశీమ్. అందువల్ల అతడినే తన వారసుడిగా ప్రకటించాలని అనుకున్నాడు బిందుసారుడు. కానీ, చురుకైన స్వభావం, కుశాగ్ర బుద్ధితో అశోకుడు సత్వరమే అన్ని విషయాలలో ఉన్నతంగా రాణిస్తూ వచ్చాడు. దానితో సుశీమ్‌లో అసూయ పెరిగింది. ప్రతి విష యంలో ప్రతిసారి అశోకుణ్ణి చిన్నబుచ్చడం, తక్కువ చేసి మాట్లాడడం, దాసీ పుత్రుడనడం చేస్తూ వచ్చాడు. అశోకుడి ప్రతిభా పాటవాలకు ముగ్ధులైన మంత్రులు అశోకుడే కాబోయే రాజు అని నిర్ణయించుకున్నారు. అదే విషయం రాజు బిందుసారుడికి చెప్పారు. కానీ, ఆయన నిర్ణయం వేరుగా ఉంది. పెద్దవాడు సుశీమ్ ఉండగా రాజ్యాధికారం మరొకరికి కట్టబెట్టడం కుదరదు కదా? అన్నది ఆయన ఆలోచన.

- రాజు బిందుసారుడు కాదనలేకపోయాడు. తప్పని సరై, అశోకుణ్ణి యువరాజుగా ప్రకటించి ఉజ్జయినీకి వెళ్లమన్నాడు. కానీ, వంశపారంపర్యంగా పెద్దకుమారుడిని యువరాజు చేయడం ఆనవాయితీ గనుక, సుశీమ్‌ను కూడా యువ రాజుగా ప్రకటించి అతణ్ణి తక్షశిలకు వెళ్లాల్సిందిగా ఆదేశించాడు.


అశోకుడు తన పరివారాన్ని, సైన్యాన్ని తీసుకుని ఏనుగు మీద ఉజ్జయినీకి బయలుదేరాడు. మార్గమధ్యంలో విదిశానగరం వచ్చింది. అక్కడ విశ్రమించి వెళదామని ఆగాడు. విడిది ఏర్పాటు చేసుకున్నాడు. విదిశా చాలా అందమైన నగరమే కాదు, ధ వంతుల నగరం కూడా! యువరాజు అశోకుడు బసచేశాడని తెలిసి, నగరంలోని ధనిక స్వాములందరూ అతని దర్శనం కోసం రాసాగారు. ముఖ్యంగా నగర ప్రముఖుడైన వ్యాపారి ధనిరామ్ తన కూతురు దేవిని వెంటబెట్టుకుని వచ్చాడు. యువరాజును పరిచయం చేశాడు. అశోకుడు, దేవి ఒకరిపై ఒకరు మనసు పారేసుకున్నారు. విషయం గ్రహించి ధనిరామ్ సంతోషంగా వారి పెండ్లి చేశాడు. యువరాజుతో పెళ్లి - అంటే, ఇంకా ఆలోచించేది ఏముంటుంది? ఆ రోజుల్లో - మాటల్లో తెలిసిందేమంటే దేవి శాక్యగణానికి చెందిన కన్యనే. ఆమె పూర్వీకులెప్పుడో విదీశాకు వచ్చి స్థిరపడి, వ్యాపారస్తులుగా మారారు. దేవి అప్పటికే బౌద్ధధర్మం ఆచరించేది, అశోకుడు బౌద్ధం స్వీకరించడం వెనక రెండు కారణాలున్నాయని చెపుతారు. ఒకటి: కళింగ యుద్ధ బీభత్సంతో మనసు వికలం కావడం. రెండవది: బౌద్ధమతావలంబి అయిన భార్య దేవి ప్రభావం- విదిశలో కొంతకాలం ఆగిన అశోకుడు తన రాణి విదీశా మహాదేవిని వెంటబెట్టుకుని తన పరివారగణంతో సహా ఉజ్జయినీ చేరుకున్నాడు. అక్కడ అస్తవ్యస్తంగా ఉన్న వ్యవస్థల్ని తన బుద్ధి కుశలతతో చక్కదిద్దాడు.

అశోకుడి వివాహం దేవితో జరిగి సంవత్సరం తిరిగింది. వారికి ఒక పుత్రుడు కలిగాడు. అతని పేరు మహింద (మహేంద్ర) అని పెట్టారు. రెండేండ్ల తర్వాత వారికి ఒక కూతురు పుట్టింది. ఆమె పేరు సంఘమిట్ట (సంఘమిత్ర) అని పెట్టారు. వీరిద్దరు పెరిగి పెద్దవారై, బౌద్ధభిక్షులుగా మారారు. తండ్రి ఆదేశంతో శ్రీలంక వెళ్లి అక్కడ బౌద్ధాన్ని వ్యాపింపచేశారు. చివరకు దేశాన్నే బౌద్ధదేశంగా మార్చారు. వారు బౌద్ధ ప్రచారకులుగా మారడానికి వారి మీద వారి తల్లి దేవి ప్రభావం ఉండడం సహజం. లేకపోతే రాజభోగాలు, రాజ్యాధికారం వదులుకుని, బౌద్ధానికి జీవితం ఎందుకు అర్పిస్తారు? బౌద్ధంలోని ముఖ్యసూత్రం- శీలం! ఆ బౌద్ధాన్ని పాటించే దేశాన్ని 'శిలాన' అని అన్నారు. కాలక్రమంలో అదే 'సిలోన్' అయ్యింది. ఇటీవలి కాలంలోనే మనం దాన్ని శ్రీలంక - అని అంటున్నాం!

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

కార్పొరేటీకరణే లక్ష్యంగా 'యూజీసీ' దూకుడు

యూనివర్సిటీల ఏర్పాటుకు ఇదివరకున్న నిబంధనలను సడలిస్తూ కొత్తగా రూపొందించడానికి నిపుణులతో నియమించిన కమిటీ సిఫార్సులను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల విడుదల చేసింది.



కె.వేణుగోపాల్
9866514577

"కొత్తగా యూనివర్సిటీని స్థాపించేందుకు కనీసం ఇరవై ఎకరాలు అవసరం. కనీసం మూడువేల మంది విద్యార్థులు ఉండాలి. ఒకవేళ స్థలాన్ని లీజుకు తీసుకోవాలంటే ఆ కాలవ్యవధి కనీసం ముప్పై సంవత్సరాలుం డాలి. అందులో నలభై శాతం ఖాళీ ప్రదేశం ఉండాలి. యూనివర్సిటీ స్థాపించే ప్రాంతం మెట్రోపాలిటన్ నగరం లేదా పర్వత ప్రాంతమైతే పదెకరాల భూమి సరిపోతుంది. వాటిలో మూడెకరాల ఖాళీ స్థలం ఉండాలి. చట్టం అనుమతిస్తే బహుళ అంతస్తుల భవనాలను నిర్మించుకోవచ్చు. ఒకే యాజమాన్యం లేదా వేర్వేరు యాజమాన్యాలకు చెందిన విద్యాసంస్థలు దగ్గరగా ఉంటే క్రీడా మైదానం, జిమ్, గ్రంథాలయం తదితర వాటిని పరస్పరం వినియోగించుకోవచ్చు. ఓపెన్ యూనివర్సిటీకి ఐదెకరాల స్థలం చాలు. ఆఫ్ క్యాంపస్ పెట్టాలనుకుంటే కనీసం ఐదెకరాల విస్తీర్ణం అవసరం" అనే అంశాలు ఆ సిఫార్సుల్లో ఉన్నాయి.

2035 నాటికి 18 నుంచి 25 ఏండ్ల వయసున్న యువతలో యాభై శాతం మంది ఉన్నత విద్యలోకి ప్రవేశించాలనేది నూతన జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యం. ప్రస్తుతం ఉన్న స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 26.3 శాతం. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరిన్ని యూనివర్సిటీలు, కళాశాలలు అవసరమనే సాకుతో యూజీసీ ఈ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. ఈలక్ష్య సాధనకు ప్రభుత్వమే తగినన్ని యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలి. కానీ ఈ సిఫార్సులు ప్రయివేటు రంగంలో మరిన్ని విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కావలసిన నిబంధనలను సరళీకృతం చేసినట్లున్నాయి. వీటి ద్వారా ప్రయివేటు రంగంలో మరిన్ని విశ్వవిద్యాలయాలు ఏర్పాటు కావడానికి దోహదం అవుతుంది. దీనివల్ల ఉన్నత విద్య అంగట్లో సరుకయ్యే ప్రమాదం ఉంది. ఎందుకంటే ప్రయివేటు రంగంలోని యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలన్నీ విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేయడంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది.

ప్రపంచ వాణిజ్య సంస్థ తెచ్చిన జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ ఇన్ సర్వీసెస్ (గ్యాట్స్) ఒప్పందాలను అమలు చేసే క్రమంలోనే నూతన జాతీయ విద్యా విధానం ముందుకొచ్చింది. అందులో విద్యారంగాన్ని వాణిజ్యీకరణకు కావలసిన సూచనలు, సిఫార్సులు ఎన్నో ఉన్నాయి. అందులో భాగంగానే ఇటీవల యూజీసీ దూకుడుగా అనేక ముసాయిదాలను, రిపోర్టులను ప్రకటిస్తూ విద్యా వాణిజ్యానికి కావలసిన రంగాన్ని సిద్ధం చేస్తోంది. దేశంలో మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల కొరతను పేర్కొంటూ సంస్థలను మూసివేయటానికి అధికారం కలిగి ఉన్న 'హెచ్‌ఈసీఐ'ను ఏర్పాటు చేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. "ప్రతిపాదిత భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్‌ఈసీఐ-హెకీ) బిల్లు గణనీయమైన అధికారాలను కలిగి ఉంటుంది. ఇందులో డిగ్రీ ప్రదానం చేసే అధికారాన్ని మంజూరు చేయటం, ప్రమాణాలను పాటించటంలో విఫలమైన సంస్థలను మూసివేయటం వంటివి ఉంటాయి. ఇది ఉన్నత విద్యపై రాష్ట్రాల నియంత్రణను తొలగిస్తుంది. మౌలిక సదుపాయాలు లేదా అధ్యాపకుల కొరతతో బాధపడుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థలను మూసివేయటానికి అధికారం వస్తుంది. దీనివలన గ్రామీణ ప్రాంతాల్లో పరోక్షంగా ప్రయివేటీకరణకు ఆజ్యం పోస్తుందని" పార్లమెంటరీ ప్యానల్ వ్యతిరేకిస్తోంది.

ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) యూనివర్సిటీలు, కాలేజీలలో టీచర్లు, అకడమిక్ సిబ్బంది నియామకం, ప్రమోషన్, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణకు కనీస అర్హతలు పేరిట కొత్త నిబంధనల ముసాయిదా విడుదల చేసింది . దేశంలోని ఉన్నత విద్యా సంస్థలపై అదుపు పెంచుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మరో ప్రయత్నమిది. దేశంలోని అన్ని యూనివర్సిటీలకు



వైస్ ఛాన్సలర్ల నియామకం ఎలా జరగాలో ఈ ముసాయిదా నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. వీసీల పరిశీలన, ఎంపిక కమిటీల ఏర్పాటు నిబంధనలను మార్చడం కోసం ఇవి ఉద్దేశించబడ్డాయి. ప్రస్తుతం ఈ కమిటీలలో ముగ్గురు సభ్యులు-యూజీసీ ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనగా ఛాన్సలర్ ప్రతిపాదించిన సభ్యులు, యూనివర్సిటీ సిండికేట్-సెనేట్/ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ప్రతినిధి వుంటున్నారు. ఈ మార్పులు రాష్ట్ర ప్రభుత్వానికి ఏ పాత్ర లేకుండా చేసేవిగానూ ఉంటూ, కేంద్ర ప్రభుత్వానికి అధికారాలు సంక్రమించేలా ఉన్నాయి.

మోడీ సర్కారు ప్రతిపాదించిన భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్‌ఈసీఐ-హెకీ) బిల్లుపై పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ బిల్లు.. విద్యపై రాష్ట్రాల నియంత్రణను తొలగిస్తుందనీ, ప్రయివేటీకరణకు ఆజ్యం పోస్తుందని వివరించింది. ఏకీకృత నియంత్రణ సంస్థకు సంబంధించి అన్ని రాష్ట్రాలకూ తగిన ప్రాతినిథ్యం ఉండేలా విద్యా మంత్రిత్వ శాఖ నిర్ధారించాలనీ, అదనపు కేంద్రీకరణ ఉండొద్దని ప్యానెల్ సూచించింది. తొంభై శాతం కంటే ఎక్కువమంది విద్యార్థులను విద్యావంతులను చేసే రాష్ట్ర విశ్వవిద్యాలయాలు జాతీయ, రాష్ట్ర స్థాయి నిబంధనల మధ్య ఎలా చిక్కుకున్నాయో కమిటీ నొక్కి చెప్పింది.

విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకం అంశంలో యూజీసీ ముసాయిదా నిబంధనలపై ఆరు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల విద్యా మంత్రులు ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విశ్వ విద్యాలయాలలో వైస్-ఛాన్సలర్ల(వీసీ) నియామకంలో రాష్ట్రాలకు కీలక పాత్రను అప్పగించాలని వారు కేంద్రాన్ని, యూజీసీని కోరారు. ఈ మేరకు తెలంగాణ, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, జార్ఖండ్ మంత్రులు బెంగళూరులో సమావేశమై.. సహకార సమాఖ్యవాదం స్ఫూర్తితో రాష్ట్రాల సహకారంతో నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, నియమాలను రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. తెలంగాణ విద్యా కమిషన్ కూడా ఉన్నత విద్యలో మార్పులు చేసే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని సమర్థించిన విషయం గమనించాలి.

విద్యా వ్యాపారం సజావుగా జరగడానికి విద్యా పెట్టుబడి దారులకు ఎటువంటి నిబంధనలు, ఆంక్షలు, చట్టాలు ఉండకూడదు. అధ్యా పకులు, విద్యార్థులకు ఎటువంటి హక్కులు ఉండరాదు. భవిష్యత్తులో ప్రజా ఉద్యమాల ఒత్తిడికి లొంగి ప్రభుత్వాలు నిబంధనలు, ఆంక్షలు పెట్టకుండా స్వతంత్ర నియంత్రణ సాధికార సంస్థకు అప్పగించాలని జాతీయ విద్యావిధానం సూచిస్తోంది. అలాగే ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలను సమానంగా చూడాలని, ప్రభుత్వ విద్యా సంస్థలకు ఇచ్చే రాయితీలను ప్రయివేటు విద్యాసంస్థలకు కూడా ఇవ్వాలని కూడా చెప్తోంది. ఇక విద్యా వ్యాపారానికి అవసరమైన చట్టాలు, యంత్రాంగాలు తయారు కావాలి. విద్యా ప్రయోజనాలను, పరిశోధనలను మార్కెట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చాలి. అందుకే ఇప్పుడున్న చట్టాలు, నిబంధనలు, వ్యవస్థలను మార్చాల్సి ఉంటుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం దూకుడుగా ఉన్నత విద్యలో అనేక మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తెస్తోంది.

ప్రపంచీకరణకు అధికార కేంద్రీకరణ అవసరం. ఇంకా ప్రభుత్వ విద్యాసంస్థలను, ప్రయివేటు విద్యాసంస్థలను సమానంగా చూడాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఇచ్చే

విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకం అంశంలో యూజీసీ ముసాయిదా నిబంధనలపై ఆరు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల విద్యా మంత్రులు ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విశ్వ విద్యాలయాలలో వైస్-ఛాన్సలర్ల(వీసీ) నియామకంలో రాష్ట్రాలకు కీలక పాత్రను అప్పగించాలని వారు కేంద్రాన్ని, యూజీసీని కోరారు. ఈ మేరకు తెలంగాణ, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, జార్ఖండ్ మంత్రులు బెంగళూరులో సమావేశమై.. సహకార సమాఖ్యవాదం స్ఫూర్తితో రాష్ట్రాల సహకారంతో నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, నియమాలను రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. తెలంగాణ విద్యా కమిషన్ కూడా ఉన్నత విద్యలో మార్పులు చేసే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని సమర్థించిన విషయం గమనించాలి.

రాయితీలను ప్రయివేటు విద్యాసంస్థలకు ఇవ్వాలని, దేశీయ విద్యాసంస్థలకు ఇచ్చే రాయితీలు అన్ని విదేశీ విద్యాసంస్థలకు ఇవ్వాలనేది జాతీయ విద్యా విధానం చెప్తోంది.ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, విదేశీ విశ్వవిద్యాలయాలు సామాజిక న్యాయం, సమానత్వం పట్టించుకోవనే విమర్శలు వస్తాయనే ఆలోచనతోనే స్కాలర్‌షిప్పులు, రుణాల భావన తెస్తోంది.

యునెస్కో,ప్రపంచ బ్యాంకు నియమించిన టాస్క్‌ఫోర్స్ నివేదిక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉన్నతవిద్యను పరిశీలించింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు వెనుకబడిన దేశాల్లో నాణ్యతలేని కోర్సులు అందిస్తున్నాయని తెలిపింది. అంటే విదేశీ విశ్వవిద్యాలయాలు దేశంలోకి వస్తే అవి ఈ విద్యనే ఇస్తాయని అర్థమవుతుంది. అయినా మన పాలకులు పట్టించుకోకుండా నాణ్యత గల విద్యను విదేశీ సంస్థలే ఇస్తాయని నమ్మి పలుకుతున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ఆకర్షణీయమైన పదజాలం, మభ్యపెట్టే లక్ష్యాలతో జాతీయ విద్యా విధానం -2020ని ముందుకు తెచ్చింది ఈ పాలసీ మొత్తం విద్యారంగాన్ని ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ చేసి విద్యార్థులను వినియోగదారులను చేస్తుంది. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వాదులు, విద్యావేత్తలు, విద్యార్థులు అధ్యాపకులు ఉమ్మడిగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

ఆర్మీ జవాన్ మనోజ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- నిందితులపై అట్రాసిటి కేసుతో పాటు హత్యానేరం కేసు నమోదు చేయాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-చింతకాని

ఖమ్మం జిల్లా బోనకల్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బుదాల మనోజ్ పై చింతకాని పోలీస్ స్టేషన్లో దాడి చేసిన ఘటనపై దాడికి పాల్పడిన అగ్రకుల పెత్తందారుడు ఉమ్మినేని రమేష్‌పై అట్రాసిటీ కేసుతో పాటు హత్యానేరం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు రక్షణ ఉండే పోలీస్ స్టేషన్‌లోనే పోలీసులు చూస్తుండగానే దళిత ఆర్మీ జవాన్‌పై దాడి చేసి కులం పేరుతో దూషించిన గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన ఉమ్మినేని రమేష్ మరియు చింతకానికి చెందిన లగడపాటి సాయిలను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మినేని రమేష్‌ని అరెస్టు చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే కేవీపీఎస్ జిల్లా నాయకత్వం జిల్లా పోలీసు అధికారులకు విన్నవించిందన్నారు. అరాచకవాది రమేష్ నుండి దళిత యువకులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నర్సిరెడ్డిని గెలిపించండి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి

నవతెలంగాణ-కల్లూరు

ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే యుటిఎఫ్ టిపిటిఎఫ్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి కోరారు. గురువారం ప్రచారంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలలను సందర్శించి సందర్భంగా సమావేశాల్లో మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎంతో నమ్మకంతో అలుగువెల్లి నర్సిరెడ్డిని గెలిపించారని, తనకు మీరిచ్చిన అవకాశాన్ని మీ సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా నిరంతరం శ్రమించారని, అలాంటి నాయకుడిని మనం ఎన్నుకుంటే మన సమస్యలును శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి తన వంతు కృషి చేశారన్నారు. అదే స్ఫూర్తితో మరోసారి అవకాశం ఇస్తే మన సమస్యలు పరిష్కారం కోసం పోరాడతారని అన్నారు. మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా అధ్యాపకులను, ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కే.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కట్టడికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యలలో భాగంగా వేగాన్ని నియంత్రించేందుకు 150 సోలార్ బ్లింకింగ్ బారికేడ్స్, అదే విధంగా పోలీస్ శాఖలో ఎవిడెన్స్ ఆధారిత పోలీసింగ్ కోసం ప్రతి పోలీస్ స్టేషన్‌కు కొత్తగా రెండు కంప్యూటర్ ట్యాబ్‌లను అందజేశారు. 10 డిజిటల్ కెమెరాలు, 27 బ్రీత్ ఎనలైజర్, 60 కంప్యూటర్ ట్యాబ్‌లు, 02 స్పీడ్ లేజర్ గన్స్, ఇతర పరికరాల తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్లో అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణకు సోలార్ బ్లింకింగ్ బారికేడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు నిరంతరం డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాని పోలీస్ అధికారులకు ఆదేశించిట్లు తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుండి తప్పించుకోకుండా పోలీస్ శాఖలో ఎవిడెన్స్ ఆధారిత పోలీసింగ్‌లో భాగంగా కేసుల విచారణ, డయల్ 100 కాల్స్ స్పందనతో పాటు వీడియో, ఫోటోగ్రాఫీ ఎవిడెన్స్ వచ్చే విధంగా ప్రతి పోలీస్ స్టేషన్‌కు కొత్తగా రెండు కంప్యూటర్ ట్యాబ్‌లు అంజేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా వేసేందుకు డిజిటల్ కెమెరాలు ఉపయోగించాలని పోలీస్ అధికారులు సూచించారు. రహదారులపై వేగంగా దూసుకెళ్తున వాహనాలను కట్టడి చేసేందుకు స్పీడ్ లేజర్ గన్స్‌ను ఖమ్మంరూరల్ , వైరా డివిజన్ ప్రాంతాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు, ఇతర వాహన చోదకులు సీటు బెల్టు ధరించాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తూ..అసాంఘిక కార్యాకలాపాలు, నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల కట్టడికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ప్రార్థన మందిర నిర్మాణానికి యరమల పూర్ణచంద్రారెడ్డి వితరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని మామునూరు గ్రామంలో నిర్మించునున్న నూతన మందిర నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, దాత యరమల పూర్ణచంద్రారెడ్డి 50 వేల రూపాయలను వితరణ చేశారు. కొత్తగా చర్చి నిర్మాణం కొరకు అడిగిన వెంటనే 50 వేల రూపాయలు సహాయం చేసిన పూర్ణచంద్రరెడ్డికి సంఘ కాపరి, పెద్దలు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్యూర్‌పై వితరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఉద్దేశంతో వాటర్ ప్యూర్‌ఫైని వితరణ చేసినట్లు దాత అల్లూరి విష్ణుమూర్తి పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు జమలాపురం గ్రామానికి చెందిన భానుమతి జ్ఞాపకార్థం వారి భర్త దేవాదాయ శాఖ మాజీ కార్యనిర్వహణాధికారి దాత అల్లూరి విష్ణుమూర్తి గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగులవంచ జ్యోతి శ్రీకి అప్పగించారు. ఈ సందర్భంగా దాత విష్ణుమూర్తి మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానం పొందిన విద్యార్థికి 5 వేల రూపాయలు, రెండవ స్థానం సాధించిన విద్యార్థికి 3 వేల రూపాయలను నగదు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, వత్సలదేవి, పద్మజ, తిరుమల, సుమలత, లక్ష్మి, శ్రీను, మాజీ విఆర్ఓ కొల్లుగోపాలరావు, లక్కిరెడ్డి వెంకటనారాయణరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

గోకినేపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని గోకినేపల్లిలో ఖమ్మం మ్యాక్స్ విజన్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని పయ్యావుల వెంకటేశ్వరరావు గురువారం లాంఛనీయగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు గ్రామంలోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అందుబాటులో లేని ప్రజలు కూపన్స్ ద్వారా ఆస్పత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని మీగడ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మాక్స్ విజన్ ఆసుపత్రి కో-ఆర్డినేటర్స్‌కు మీగడ శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటనారాయణ, చావా శ్రీకాంత్, తోటమల్ల వంశి, ఎస్కె ఇస్మాయిల్, ఫిరోజ్, మీగడ బాబు, జానీ మియా, రామకోటి, జిలానిమియా, ఆసుపత్రి కో-ఆర్డినేటర్స్ కండె దేవేందర్, ప్రశాంత్, కౌన్సిలర్ శ్రీనివాస్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.



అలుపెరగని పోరాట యోధుడు భద్రయ్య

- క్రమశిక్షణకు మారుపేరు
- రైతాంగ ఉద్యమంలో చురుకైన పాత్ర
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ-కల్లూరు

కమ్యూనిస్టు ఉద్యమంలో అలుపెరగని పోరాట యోధుడు భద్రయ్య అని, సత్తుపల్లి ప్రాంతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు, భూస్వాములకు ఎదురొడ్డి పోరాటం చేయడం సులువైన పని కాదని, అయినా ఎరుపు అనేది లేకుండా శాంతియుత పోరాటాలు నిర్వహించిన వ్యక్తి మట్టూరు భద్రయ్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మండల పరిధిలోని లింగాల గ్రామంలో గురువారం మట్టూరి భద్రయ్య, సీతారత్నం సంస్మరణ సభ పార్టీ మండల కమిటీ కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉండటంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీకి ఎదురు నిలిచి పోరాటం చేయడంలో భద్రయ్య కీలక పాత్ర పోషించారు అన్నారు. సర్పంచ్‌గా ఎవరినీ నొప్పించకుండా అందరితో కలిసి మెలిసి ఉంటూ తనదైన శైలిలో రాజకీయ పోరాటాలు నడిపారు అన్నారు. అభివృద్ధి పనులకు బిల్లులు కాకపోతే ఎందుకు చేయరు అంటూ అధికారులను ఎదిరించి నిలదీసే వారు అన్నారు. నిజాయితీగా నిస్వార్థంగా పనులు చేస్తున్నప్పుడు మీరు ఎందుకు సహకరించరు అంటూ ప్రశ్నించేవారు అన్నారు. భద్రయ్య, సీతారత్నం దంపతులు పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారన్నారు. కల్లూరు మండలం తెలంగాణ సాయుధ పోరాటం దగ్గర నుండి ఉద్యమ మండలంగా పేరుగాంచిందన్నారు. దానికి కారణం మట్టూరి భద్రయ్య, చింతలపూడి జగ్గయ్య, కట్టా వెంకట నరసయ్య లాంటి నాయకులు ఉండి కార్యకర్తలను నడిపించడంతోనే సాధ్యపడుతుందని అన్నారు. వారు మన మధ్య లేకపోయినా వారు ఇచ్చిన స్ఫూర్తితో కార్యకర్తలు ముందుకు సాగి వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుగా కమ్యూనిస్టు పార్టీలే ఉన్నాయన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ మట్టూరి భద్రయ్య సీతారత్నంలు ఒకరు ప్రత్యక్షంగా మరొకరు పరోక్షంగా పార్టీకి సేవలందించాలన్నారు . భద్రయ్య ఎక్కడ ఉంటే అక్కడ చలోక్తులతో కార్యకర్తల్ని నాయకుల్ని ఉత్తేజపరిచేవారన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాల్లో భద్రయ్య కీలకపాత్ర పోషించేవారన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ పార్టీ విషయాలు తెలుసుకుంటూ సూచనలు సలహాలు ఇచ్చేవారు అన్నారు.



ఎంతమందిని భోజనానికి తీసుకొచ్చినా సీతారత్నం ఒక్కరే వారికి వండి పెట్టటం ఓపికగా చేసేవారన్నారు. చేదోడు వాదుడుగా ఉంటూ భద్రయ్య ఆశయాలకు సహకరించారని అన్నారు. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా ఉమ్మడి కుటుంబంలోనే ఉండాలని, బాంధవ్యాలు పెరగాలని భద్రయ్య గట్టిగా పట్టుపట్టేవారని భద్రయ్య కోడలు సుధారాణి అన్నారు. స్టేజి వివాహం వద్దంటే సంబంధం క్యాన్సిల్ చేసుకోవాలని నిర్ణయానికి రావడంతో వారి నిర్ణయం ప్రకారమే స్టేజి వివాహం నాకు జరిగిందని అన్నారు. పార్టీ మీద ఉన్న మమకారం పోరాటాల పైన ఉన్న పట్టు ఎనలేనిదన్నారు. కుటుంబ వ్యవస్థ బాగుంటేనే గ్రామం బాగుంటుందని, గ్రామం బాగుంటే దేశం బాగుంటుందని అలాంటి భావనతోనే సమస్యలపై పోరాటాలు చేసేవారు అన్నారు. తనకు ఎంత ఇబ్బంది అయినా ఎదుటివారిని ఇబ్బంది పెట్టకుండా ధైర్యంగా ముందుకు సాగేవారన్నారు. అలాంటి వారికి కోడలుగా రావడం అదృష్టం అని అన్నారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, ఎం.సుబ్బారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పార్టీ రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు సామినేని రామారావు, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనకాల సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి మోహన్‌రావు, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు, బీఆర్ఎస్ నాయకులు జడ్పీటిసి కట్టా అజయ్ కుమార్, పారుపల్లి ఝాన్సీ, మెరుగు రమణ, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు దండు ఆదినారాయణ, ఫకీరమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పాండురంగారావు, జాగిరి శ్రీనివాసరావు, చలమల విఠల్, దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భద్రయ్య సేవలను కొనియాడారు. తొలుత సభ దంపతులు స్మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మట్టూరి భద్రయ్య, సీతారత్నంకు నివాళి

మట్టూరి భద్రయ్య, సీతారత్నంకు నివాళ్లర్పించిన వారిలో మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, యుటిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, పైడిపల్లి రాధా క్రిష్ణమూర్తి, ఏయమ్‌సీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్, పోచారం సొసైటీ చైర్మన్ నర్వనేని అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు దిరిశాల నరసింహారావు, ఐద్వా నాయకులు పాకాల పాటి ఝాన్సీ, మచ్చా మణి, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి పట్టణ పార్టీ మండల కార్యదర్శులు అయినాల రామలింగేశ్వరరావు, గాయం తిరుపతిరావు, అర్వపల్లి జగన్ మోహన్రావు, కొలికపోగు సర్వేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు రావుల రాజబాబు, దోమతొట్టి పుల్లయ్య, పులి క్రిష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, కల్లూరు మండల కమిటీ సభ్యులు బట్టు నరసింహారావు, ముదిగొండ అంజయ్య, సామినేని హనుమంతరావు, తిగుళ్ళ బాబు, గంపల శ్రీనివాసరావు, సామినేని వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి ఉన్నారు.

నవతెలంగాణ సిబ్బంది నివాళి

మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన మట్టూరి భద్రయ్య, సీతారత్నం చిత్రపటాలకు నవతెలంగాణ డివిజన్ విలేకరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నవతెలంగాణ ఎడిషన్ మేనేజర్ ఎస్‌డి జావీద్, సర్క్యులేషన్ ఇంచార్జ్ వెంకటేశ్వరరావు, యాడ్స్ డివిజన్ ఇంచార్జి తాళ్లూరు నాగేశ్వరరావు, విలేకరులు పారుపల్లి కృష్ణారావు, పాటిబండ్ల సాంబశివరావు, ఎమ్‌డి ముస్తఫా, గుడిమెట్ల మోహన్‌రావు, కాంకటి రాఘవ, బండి యాలాద్రిలు నివాళ్లర్పించారు.









కేసీఆర్ కుటుంబం కులగణనలో పాల్గొనాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు
- బాలాజీ ఫౌండేషన్ సేవలు అభినందనీయం
- మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-కొణిజర్ల

రెండో విడతలో జరగనున్న కుల గణన సర్వేలో మాజీ ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతోపాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు పాల్గొనాలని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. మండల పరిధిలోని కొండవనమాల గ్రామంలో వత్సవాయి వెంకయ్య సీతారవమ్మ జ్ఞాపకర్థం వారి కుమారుడు శ్రీ బాలాజీ ఎస్టేట్స్ చైర్మన్ వత్సవాయి రవి ఏర్పాటు చేసిన ఆర్వోఆర్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తలతాకట్టు పెట్టైనా రాబోయే నాలుగు సంవత్సరాల్లో ఇరవై లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేని వారెవరూ అభద్రతా భావానికి లోనుకావద్దని, ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను మూడు నాలుగు రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, రబీలో పండించే సన్నవడ్లు పండించే రైతులకు కూడా 500 రూపాయలు బోనస్ ఇస్తామన్నారు. పుట్టిన ఊరుని కన్న తల్లితండ్రులను మరిచి పోతున్న ఈ రోజుల్లో తను పుట్టి పెరిగిన ఊరికి ఏదోక సాయం చేయాలనే తపనతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన వత్సవాయి రవిని, ఆయన శ్రేయోభిలాషి మాజీ ఎంపీపీ గోసు మధును పొంగులేటి అభినందించారు. ఈసందర్భంగా వత్సవాయి ఏర్పాటు చేసిన సేవా శ్రీ బాలాజీ సేవా ఫౌండేషన్‌ని మంత్రి చేత ఆవిష్కరించారు. వారిద్దరిని రామలక్ష్మణులుగా కీర్తించారు. అనంతరం ఎమ్మెల్యే రాందాసునాయక్ మాట్లాడుతూ తన నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు అధికంగా కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. జిల్లా మంత్రుల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె నారాయణ, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, రాయల పుల్లయ్య పొట్లపల్లి శేషగిరి కె శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.







లలిత ఆశయ సాధనకు కృషి చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని పెద్దతండా గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) మహిళా నాయకురాలు మూడ్ లలిత ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దతండా గ్రామంలో మూడ్ లలిత ఐదో వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ పట్ల చాలా నిబద్ధతగా ఉండే లలితను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు రావడం బాధాకరమన్నారు.ఎన్ని కష్టాలు, నష్టాలు, ఇబ్బందులు ఎదురైనా అన్నింటిని తట్టుకొని తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన వీర వనిత లలిత అన్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందంటారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నందిగామ కృష్ణ, మోరబోయిన పుల్లయ్య, ఏటుకూరి ప్రసాదరావు, కస్థల ఆంటోనీ, కుమ్మరి కుంట్ల శ్రీనివాసరావు, నూకల బాలరాజు, నందిపాటి లక్ష్మయ్య, లలిత భర్త మూడ్ మంగిలాల్, కుమారులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలపై పెనుభారం మోపుతున్న మోడీ

- ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పేదలపై పెనుభారం మోపుతూ మోడీ పెద్దలకు అండగా ఉంటున్నాడని ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ అన్నారు. మండలంలోని కస్నాతండా గ్రామంలో గురువారం వ్యవసాయ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడారు. బీమా రంగంలో వందశాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం వల్ల ఎల్ఐసి తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు.మోడీ అజెండా పేదలను నిరుపేదలుగా చేయడమేనన్నారు.పేద ప్రజల నడ్డి విరిచి పారిశ్రామికవేత్తల జేబులు నింపుతున్నారని విమర్శించారు. బడ్జెట్‌ను సవరించాలని ఉపాధి హామీ పథకానికి, విద్య, వైద్యానికి ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. బిజెపి అధికారం చేపట్టాక మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని విమర్శించారు. దళిత, గిరిజనుల పట్ల బిజెపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నిజస్వరూపాన్ని బయటపెడుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా లౌకిక శక్తులు ఏకమై బిజెపికి తగురీతిలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బండి పద్మ, మండల కార్యదర్శి పెండ్యాల సుమతి, సీపీఎం డివిజన్ నాయకులు భూక్య నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు పొన్నం వెంకటరమణ, ఊరుబండి చంద్రయ్య, పొన్నం భాస్కరరావు, ఉపేందర్, అవిరేణి నాగరాజు, కోటయ్య, గురవయ్య, భూక్య సైదమ్మ మార్తి శైలజ, నాగు బండి రవి తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో మాజీ ఎమ్మెల్యే కందాల పర్యటన

- బాధిత కుటుంబాల పరామర్శ

నవతెలంగాణ-నేలకొండపల్లి

నేలకొండపల్లి మండలంలో బిఆర్ఎస్ నాయకులు, పాలేరు మాజీ శాసన సభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి గురువారం పర్యటించారు. మండలంలోని సదాశివాపురం గ్రామంలో తమలపాకుల ఉపేందర్, జ్యోతి దంపతుల కుమార్తె చిరంజీవి హర్షిత నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకకు హాజరై ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఉపేందర్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలర్ నాగభూషణం కోడలు అనారోగ్యంతో బాధపడు తుండడంతో ఆమెను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో ఇటీవల పాలడుగు వెంకటేశ్వర్లు మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన పాలడుగు పూర్ణచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, యాతాకుల భాస్కర్, కోటి సైదారెడ్డి, అనగాని నరసింహారావు, మరికంటి రేణుబాబు, నెల్లూరి లీల ప్రసాద్, ఎస్‌కె హుస్సేన్, కమదన ప్రవీణ్, మల్లెపల్లి రమేష్, జానకిరామయ్య, బొలికొండ వెంకటనారాయణ, ఎస్‌కె నిజాం అలీ, జానీమియా, నాగుల్ మీరా, వేముల నరసయ్య, పాషా, సుధాకర్, రావెళ్ల వెంకయ్య, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.





సైలో బంకరు బాధితుల సమస్యను సింగరేణి పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్
- దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన ప్రజా సంఘాలు
- నాలుగో రోజుకు చేరిన అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ ప్రజల రిలే దీక్షలు
- జేవీఆర్ ఓసీ పీవో వాహనాన్ని అడ్డగించిన సైలో బాధితులు

నవతెలంగాణ-సత్తుపల్లి

సైలో బంకరు కాలుష్యం నుంచి సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ ప్రజలను సింగరేణి రక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ కోరారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న సైలో బంకరును తీసెయ్యాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ ప్రజలు చేపట్టిన నిరవధిక రిలే దీక్షల కార్యక్రమం గురువారం నాటికి నాలుగో రోజుకు చేరింది. వారు చేపట్టిన రిలే దీక్షల శిబిరాన్ని గురువారం సీపీఐ(ఎం), ప్రజా సంఘాల నాయకులు సందర్శించి బాధితులకు తమ పూర్తి మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సైలో బంకరు బాధితులంతా దళితులు, వెనుకబడిన కులాలకు చెందిన నిరుపేదలన్నారు. వారు చేస్తున్న పోరాటం న్యాయబద్ధమన్నారు. సింగరేణి యాజమాన్యం మానవతా దృక్పథంతో వ్యవహరించి సైలో బంకరును తీసివేయాలన్నారు. అది సాధ్యం కాకపోతే అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ కుటుంబాలకు వేరే ప్రాంతంలో పునరావాసం కల్పించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వీరు చేస్తున్న పోరాటానికి రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు రావుల రాజబాబు, బాల బుచ్చయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు కొలికిపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి వెంకటేశ్వరరావు, మోరంపూడి వెంకటరావు, చావా రమేశ్, దొడ్డా లక్ష్మీనారాయణ, ఐద్వా సత్తుపల్లి పట్టణ అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీ పీవో వాహనాన్ని అడ్డగించిన సైలో బంకరు బాధితులు

సైలో బంకరు సమస్యను పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా దీక్షలు జరుగుతున్నా పట్టించుకోకుండా అటుగా తిరుగుతున్న సింగరేణి అధికారుల వాహనాలను అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీకి చెందిన సైలో బంకరు బాధితులు అడ్డగించారు. తమ సొంత స్థలాల్లో వాహనాలు తిప్పొద్దంటూ హెచ్చరించారు. ఈలోగా అటుగా వచ్చిన జేవీఆర్ ఓసీ ప్రహ్లాద్ వాహనాన్ని అడ్డుకొని నిలువరించారు. ఇంతకాలం సింగరేణి సంస్థకు సహకరించామని ఇకపై సింగరేణి ఆటలు సాగవని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా శాంతియుతంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలు శుక్రవారం నుంచి ఉధృతంగా ఉంటాయని సింగరేణి అధికారులను సైలో బంకరు బాధితులు హెచ్చరించారు.

కూలీల ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పెనుబల్లి



కంకర లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొన్న ఘటన గురువారం ఉదయం మండల పరిధిలో జరిగింది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కందిమల్ల వారి బంజర గ్రామానికి చెందిన 13 మంది కూలీలు చంద్రుగొండ మండలంలో మొక్క జొన్న కంకులు వలిచేందుకు ఉదయం ఆటోలో ప్రయాణమయ్యారు. పాత కారాయిగూడెం నుండి బయన్నగూడెం వెళ్లే రహదారిలో మొక్కజొన్న సీడ్స్ తయారు చేసే ఫ్యాక్టరీ సమీపంలో రాగానే ఎదురుగా కంకర లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న తుమ్మలపల్లి రాంబాబు(24) తీవ్ర గాయాలు కాగా పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చూస్తుండగా మృతి చెందాడు. బత్తుల వెంకమ్మ, కంప మారమ్మ ఇద్దరు కూలీలకు కాళ్లు విరగడంతో పాటు గాయాలయ్యాయి. మృతి చెందిన రాంబాబు తండ్రి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగ చేతికొచ్చిన కొడుకు కూడా మృతి చెందడంతో ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది.

ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- గురుకుల పాఠశాలల టైమింగ్స్‌ను మార్చాలి
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-సత్తుపల్లి

ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సత్తుపల్లి వచ్చిన ఎమ్మెల్సీ అలుగుబెల్లి స్థానిక టీఎస్‌యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన జిల్లా, డివిజన్, మండలాల బాధ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ రకాల మెడికల్ బిల్లులు, పెన్షనర్ల బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, కేజీబీవీ సమ్మెకాలపు వేతనం, కళాశాలలకు సంబంధించిన పలు రకాల బిల్లులను సత్వరమే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల టైమింగ్స్‌ను వెంటనే మార్చడంతో పాటు కేర్‌టేకర్స్‌ను నియమించాలన్నారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను వారి స్థానిక ప్రాంతాలకు పంపించాలన్నారు. సర్వీసు రూల్సును రూపొందించి ఉపాధ్యాయులకు ఎంఈవో, డిప్యూటీ డీఈవో, లెక్చరర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్కే.రంజాన్, జిల్లా కార్యదర్శులు వీవీ.రామారావు, డి.ఉమామహేశ్వరరెడ్డి, నిర్మల కుమారి, మండల ప్రధాన కార్యదర్శి కొక్కెరగడ్డ వెంకటేశ్వరరావు (కేవీ) పాల్గొన్నారు. టీపీటీఎఫ్ నాయకులు కొత్తా శ్రీనివాసరావు, రామకృష్ణ, అధ్యాపకుల సంఘాల బాధ్యులు కృష్ణారావు, రాంబాబు అలుగుబెల్లికి తమ పూర్తి మద్దతును ఇస్తున్నట్లు సమావేశంలో ప్రకటించారు.



రెండో దఫా మళ్లీ ఎమ్మెల్సీగా గెలిపించండి

మండల పర్యటనలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి

గురువారం సత్తుపల్లి మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిచాక ఈ ఆరేళ్ల కాలంనుంచి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కట్టుబడి శాసన మండలిలో విద్యారంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు ప్రాతినిధ్యం చేస్తూ నిత్యం అన్ని యాజమాన్యాలలో ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై పట్ల నిరంతరం వారివారి పోరాటాలకు బయట, శాసన మండలిలోనూ మద్దతిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని నల్గొండ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్రలను చేయడం జరిగిందని ఉపాధ్యాయులకు తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహించి పరిష్కారం కృషిచేసిన సమస్యల్లో కొన్నింటిని పరిష్కరించడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ కోటాకింద వచ్చిన నిధులను ప్రభుత్వ విద్యాలయాలకు మాత్రమే కేటాయించడం జరిగిందన్నారు. ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో దఫా కూడా మొదటి ప్రాధాన్యత ఓటు ద్వారా గెలిపించాలని ఈ సందర్భంగా అలుగుబెల్లి ఉపాధ్యాయులను కోరారు.

నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

- మున్నేరు నదీ పరివాహక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మున్నేరు నదీ పరివాహక ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. మంచికంటి నగర్, బొక్కలగడ్డ మున్నేరు నదీ ప్రాంతంలో కాలినడకన నడిచి ఆ ప్రాంత నివాసితులతో శానిటేషన్, త్రాగునీరు, విద్యుత్, ఉపాధి పనులు, తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ ల్యాండ్‌లను పరిశీలించి చెత్త పేరుకొని పోకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు సంబంధిత స్థల యజమానికి తెలియజేయాలని మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ షఫీ ఉల్లాను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా కాల్వలను శుభ్రం చేయాలని అన్నారు. డ్రైయిన్లకు ఉన్న మరమ్మత్తులు పూర్తి చేయాలని, సిసి ఏర్పాటు చేయాలని, ప్రతి ఇంటికి చెత్త సేకరణ బండి వచ్చేలా చూడాలని, 3 బ్రిడ్జిల వద్ద చెత్త అధికంగా ఉందని, వీటిని ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. మున్నేరు నదీ పరివాహక ప్రాంతం మహిళలతో మాట్లాడుతూ మహిళా సంఘాలు చర్చించుకొని టైలరింగ్, వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని, వాటి గ్రౌండింగ్‌కు రుణాలు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాగా చూస్తున్నారా, వైద్యం అందుతుందా వివరాలు తెలుసుకున్నారు. అక్కడున్న మహిళా తన అమ్మాయికి కంటి చూపు సమస్య ఉన్నదని తెలుపగా సదరం క్యాంపులో చూపుకు సంబంధించి పరీక్షలు చేసి సర్టిఫికెట్ మంజూరు చేస్తామని అన్నారు. గతంలో వరద బీభత్సం వచ్చిందని, భవిష్యత్తులో వరద కష్టాలు పునరావృతం కావద్దంటే మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మించాలని, దీనికోసం ఎవరి ఇళ్లయినా తీయాల్సి వచ్చినా నూతన ఇండ్లు అందించిన తర్వాత తొలగిస్తామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. తొలుత మున్నేరు నదీ వద్ద శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవస్థానం దగ్గర ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద వద్ద కొబ్బరికాయ కొట్టారు. అక్కడ ఉన్న శివ సత్తులతో మాట్లాడుతూ మున్నేరు వాగుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేస్తున్నామని, రిటైనింగ్ వాల్ నిర్మాణం అయిన తర్వాత గద్దెల వద్ద అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి, సౌకర్యాల కొరకు చర్యలు చేపడతామని తెలిపారు. ఇండ్లు లేని పేదలకు దశల వారిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, జవాను, మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దళిత జవాన్‌పై దాడిలో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-చింతకాని

ఇద్దరు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ నాగుల్ మీరా తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండల పరిధిలో చింతకాని పోలీస్ స్టేషన్‌కు ఓ కేసు విషయంపై విచారణకు వచ్చిన దళిత జవాన్ భూదాల మనోజ్‌పై బోనకల్ మండలం గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన ఉమ్మినేని రమేష్, చింతకాని గ్రామానికి చెందిన లగడపాటి సాయి కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఉమ్మినేని రమేష్ లగడపాటి సాయిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బూదాల మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతకాని ఎస్సై షేక్ నాగుల్ మీరా స్టేషన్ ఆవరణంలో ఉన్న సిసి కెమెరాల ఫుటేజీ ఆధారాలతో పాటు పక్కనే ఉన్న మరో నలుగురు తెలిపిన వివరాల ప్రకారం వారి ఇరువురి పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం 3 టౌన్ పరిధిలో మరణించిన ఇరువురి వడ్డెర కుటుంబ సభ్యులకు దహన సంస్కారాలు నిమిత్తం గురువారం వడ్డెర సంఘం తరుపున ఆర్థిక సాయం అందజేశారు. వేముల జంపన్న తల్లి వేముల వెంకటమ్మ, అదేవిధంగా చల్లా శ్రీను, తల్లి చల్లా వెంకమ్మ వృద్ధాప్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న వడ్డెర సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుంజా శీను, కూరాకుల మల్లికార్జున్ వారి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇరువురి కుటుంబ సభ్యులను పరామర్శించి వడ్డెర సంఘం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద దహన సంస్కారాల నిమిత్తం ఒక్క కుటుంబానికి 10వేల చొప్పున 20వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. వారితో పాటు వడ్డెర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఉచిత పరికరాలు పంపిణీ

నవతెలంగాణ-వైరా

వైరా నియోజకవర్గ కేంద్రంలో ఆర్టిఫీషియల్ మ్యాన్ ఫ్యాక్చర్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో వయోవృద్ధులు వికలాంగులకు ఉచిత పరికరాలు అందజేయు అవగాహన క్యాంపు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నియోజకవర్గ పరిధిలోని వైరా, కొణిజర్ల, కారేపల్లి, జులూరుపాడు, ఏనుకూరు మండలాల నుంచి వందలాది మంది వికలాంగులు, వృద్ధులు, వికలాంగులు హాజరై తమకు అవసరమైన పరికరాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి రామ్ గోపాల్‌రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ బాల త్రిపుర సుందరి, లయన్స్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులు వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు వృద్ధులకు చేయూతనందించేందుకు పై సంస్థ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అవసరమైన పరికరాలు అందజేస్తామని తెలిపారు.

అంగన్వాడీ సెంటర్లో పాపను కర్రతో కొట్టిన ఆయా

- విధుల నుంచి తొలిగించాలని కుటుంబ సభ్యుల డిమాండ్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని గోపాలపురం సెంటర్ 1లో గురువారం అభం శుభం తెలియని చిన్నారిని వీపుపై వాతలు పడేలా కొట్టిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితురాలి తాతయ్య బండ్ల వెంకటనారాయణ మాట్లాడుతూ తమ మనవరాలు ఇరుగు కుషి అంగన్వాడీ కేంద్రానికి చదవు కోసం పాపను పంపితే చదువు చెప్పడం మాని పచ్చిబరెకతో వీపుపై వాతలు పడేవిదంగా కొట్టే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గోపాలపురం సెంటర్ 1 లో చదుకునెందుకు పంపించగా ఆ సెంటర్ ఆయా ఖాసింబీ విచక్షణ రహితంగా పసి పాప అనికూడా చూడకుండా పచ్చిబరెకతో కొట్టడంతో వల్లంతా వాతలు పడి జర్వం తగిలందని ఆవేదన వ్యక్తం చేశారు. తన మనవరాలిని కొట్టిన ఆయా, సెంటర్ టీచర్‌లను తక్షణమే తొలగించాలని, లేదంటే సెంటర్‌లో చదువుకోవడానికి పిల్లలు రావడానికి బయపడతారని అన్నారు. అసలు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను దండించి బెత్తంతో కొట్టె హక్కు ఎవరిచ్చారని, ఇటువంటి వారు పిల్లలకు చదువు చెప్పెందుకు పనికి రారని, సంబంధిత శాఖ అధికారులు వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే అంగన్వాడీ సెంటర్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

17న జరిగే మహాధర్నాను జయప్రదం చేయండి

- క్వింటా మిర్చికి రూ.25 వేలు ప్రభుత్వం ప్రకటించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు

నవతెలంగాణ-కూసుమంచి

ఈనెల 17న మిర్చి మార్కెట్ వద్ద రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 17న జరిగే మహాధర్నాలో రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆరుగాలం కష్టించి పంటను పండించిన రైతులకు శ్రమ ఫలితం దక్కకపోగా అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని, ఏ ప్రభుత్వాలు వచ్చిన మద్దతు ధర ప్రకటించకపోగా, పండించిన పంటకు అసలు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ఈ పరిస్థితులలో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ప్రస్తుతం క్వింటా మిర్చికి రూ.25 వేలు ధర ప్రకటించాలని, మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని, ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు తోటకూరి రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్, మండల కమిటీ సభ్యులు కంచర్ల జగన్మోహన్‌రెడ్డి, నెల్లూరి వెంగళరావు, ఉడుగు వెంకన్న, మూడు గన్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్
- ఆర్మీ జవాన్ మనోజ్‌పై దాడి చేసిన నిందితులపై అడిషనల్ డీసీపీకి ఫిర్యాదు

నవతెలంగాణ-ఖమ్మం



దళితుడిపై దాడి చేసిన ఉమ్మినేని రమేష్‌ని వెంటనే అరెస్ట్ చేసి బాధితుడికి న్యాయం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. బోనకల్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బుదాల మనోజ్‌పై ఇటీవల చింతకాని పోలీస్ స్టేషన్‌లో దాడి చేసిన ఘటనపై గురువారం ఖమ్మంలోని అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్‌ని బాధితుడితో కలిసి కేవీపీఎస్ జిల్లా బృందం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్ స్టేషన్‌లోనే ఆర్మీ జవాన్‌పై దాడి చేసి కులం పేరుతో దూషించిన గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన ఉమ్మినేని రమేష్, చింతకానికి చెందిన లగడపాటి సాయిలను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్‌కి పిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అడిషనల్ డీసీపీ సానుకూలంగా స్పందించారని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, బాధితుడికి న్యాయం చేస్తాం అని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా ఇప్పటికే కేసులో ఉన్నటువంటి ఉమ్మినేని రమేష్ అనే వ్యక్తి గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన మరో దళిత యువకులైనటువంటి దారెల్లి వంశీ, ముత్తారపు నవీన్, నారపోగు హరీష్, ఆదూరి గోపిలను నాకు మద్దతుగా వీడియోలో చెప్పకపోతే చంపుతాం అని రమేష్ బెదిరిస్తున్నాడు అని చెప్పారు. ఉమ్మినేని రమేష్‌ని అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతాం అని హెచ్చరించారు. అరాచకవాది రమేష్ నుండి దళిత యువకులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ, అయిలపోగు రామనాథం, బాధితుడు బూదాల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల పనివేళలు మార్చాలి : టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-పెనుబల్లి



గురుకులాల పనివేళలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి డిమాండ్ చేశారు. గురువారం టిఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో పెనుబల్లి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీ మోడల్ స్కూల్స్, గురుకులాల్లో అమలు జరగడం లేదన్నారు. రెండేళ్ళుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, జిపిఎఫ్, జిఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఇకుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలో జి.వీరస్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో చావ రవి మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఆదర్శంవంతమైన పనితీరు కనబరిచిన ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి ఎమ్మెల్సీగా అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, వివి రామారావు పాల్గొన్నారు.



డిజిటల్ టీవీలు, వీల్ చైర్స్ పంపిణీ

- విశేష సేవలు అందిస్తున్న చేతన ఫౌండేషన్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్ణ భారతి కళ్యాణ మండపం ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 50 ప్రభుత్వ పాఠశాలకు డిజిటల్ టీవీలు, వీల్ చైర్లు ఫౌండేషన్ చైర్మెన్ వెనిగళ్ళ రవికుమార్, తుమ్మల యుగంధర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ డిజిటల్ టీవీలు విద్యార్థులకు ఆధునిక విద్యను చేరువ చేసేలా విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాల ఫౌండేషన్ మౌలిక వసతిలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బెంచెస్, బ్యాగులు, పరీక్ష సామాగ్రి, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆన్‌లైన్ బోధన కోసం లాప్టాప్స్ అందించవన్నారం. వికలాంగులకు వీల్ చైర్స్, ట్రై సైకిల్, కృత్రిమ పాదాలను పంపిణీ చేశామని తెలిపారు. చేతన ఫౌండేషన్ ఈ విధంగా సమాజానికి సేవలు అందిస్తూ, విద్య, ఆరోగ్య పరంగా అండగా నిలిచేలా తన కృషిని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెనిగళ్ళ అనిల్ కుమార్, దొడ్డ సీతారామయ్య, పసుమర్తి రంగారావు, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, తుమ్మలపల్లి ప్రసాద్, మాదినేని నరసింహారావు, దొడ్డపనేని కృష్ణారావు మరియు స్వర్ణ భారతి కమిటీ సభ్యులు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | ఫిబ్రవరి 14, 2025 | www.navatelangana.com

సరోజినీ నాయుడు జయంతి వేడుకలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

టీఎన్జీవోస్ ప్రెసిడెంట్, సెక్రెటరీ డెక్క నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో సరోజినీ నాయుడు 146వ జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలవేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రాన్ని సిద్ధించడంలో ఎందరో మహానుభావులు వారి ప్రాణాలను త్యాగం చేశారని వారి త్యాగాల ఫలితంగానే ఈరోజు స్వాతంత్ర ఫలాలు భారత పౌరులైన మనము అనుభవిస్తున్నామన్నారు. మహిళా హక్కుల సాధన కోసం అహర్నిశలు శ్రమించిన వారిలో సరోజిని నాయుడు అగ్రగన్యులని తెలుపుతూ ప్రతి ఒక్క భారతీయ పౌరుడు వారిని సందర్భోచితంగా మననం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాస్, అంజిబాబు, హరీష్, పాషా, ఉద్యోగస్తులు, తదితరులు పాల్గొన్నారు.



సత్ఫలితాలను ఇస్తున్న ఆపరేషన్ చేయూత

- పోలీసుల ఎదుట లొంగిపోయిన 19 మంది మావోయిస్టులు
- జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబాలతో స్వేచ్ఛగా జీవించండి : ఎస్పీ రోహిత్ రాజ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తుపాకిని విడిచి జన జీవన స్రవంతిలో కలిసి కుటుంబాలతో స్వేచ్ఛగా జీవించాలని ఎస్పీ రోహిత్ రాజ్ మావోయిస్టులను కోరారు. గురువారం భద్రాచలం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో 81 బెటాలియన్, 141 బెటాలియన్, సీఆర్పీఎఫ్ అధికారులతో పాటు పోలీస్ అధికారుల సమక్షంలో 19 మంది మావోష్టులు లొంగిపోగా ఎస్పీ నేతృత్వంలో పత్రికల సమావేశం నిర్వహించి లొంగిపోయిన మావోయిస్టులు వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఎంతోకాలంగా మావోయిస్టు పార్టీలో వివిధ హోదాలలో పనిచేస్తున్న మావోయిస్టు పార్టీ సభ్యులు ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ చేయుట సత్ఫలితాన్ని ఇస్తుందని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల పట్ల ప్రభుత్వం ఎంతో ఉదారంగా వ్యవహరిస్తుందని వారికి జీవన ఉపాధికి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. అభివృద్ధికి నిరోధకులుగా మావోయిస్టులు తయారీ అనేక ఏజెన్సీ గ్రామాలకు కనీస మౌలిక వసతులు కూడా లేకుండా విధ్వంసాలు సృష్టిస్తున్నారని అన్నారు. సిద్ధాంతాల పేరుతో అరాచకాలను సృష్టిస్తూ అమాయక ఆదివాసీ గిరిజనులను కొరియర్ పేర్లతో హతమారుస్తున్నారని తెలిపారు. యువత ఉపాధి వైపు పయనిస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వం అనేక రకాల పథకాలను ప్రవేశపెడుతూ విద్యా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని విచ్చనకర ఉద్యమాల వైపు యువత వెళ్లకుండా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. లొంగిపోయిన మావోస్టులకు పునరావసం కల్పిస్తూ ఉపాధి అవకాశాలను చూపిస్తున్నామని తెలిపారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు

నరోటి మనీష్, మడవి నంద, మడివి హెూండా, మడివి హడమ, మడకం దేవ, కలుమ ఐతే, పోడియం సమ్మయ్య, ఓడియన్ నగేష్, సోడి హర్జన్, పోడియం అడుమ, మడకం ఉంగా, కుంజం మాస, మీర్గం సుక్కయ్య, మడవి ఇడుమయ్య, సల్వం వెంకట్, సల్వం శంకర్, మడవి కోస, దిద్దో సూల, సూడి ఇడుమ లొంగిపోయిన వారిలో ఉన్నారు.

విద్యుత్ ఆర్టిజన్స్‌ను పర్మినెంట్ చెయ్యాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- ఆర్టిజన్స్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులని వెట్టిచాకిరీ నుండి విముక్తి చేసి రెగ్యులర్ ఉద్యగులుగా పర్మినెంట్ చేసి కుటుంబాల్లో వెలుగులు నింపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వంకు విజ్ఞప్తి చేశారు. పాల్వంచలో రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్స్ నూతన క్యాలెండర్‌ను సాంబశివరావు గురువారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఆర్టిజన్ అనే పోస్టని క్రియేట్ చేసి 10 ఏళ్ల పాటు శ్రమ దోపిడీ చేపిస్తున్నారని, ఒక పర్మినెంట్ ఉద్యోగికి ఇచ్చే వేతనంతో 10 మంది ఆర్టిజన్ కార్మికులకు వేతనం ఇస్తూ దోపిడీని చట్ట బద్ధ ప్రభుత్వాలు చేస్తున్నాయి అని ఆరోపించారు. 20 వేల మంది కార్మికులు తెలంగాణ మొత్తం 4 కోట్ల మందికి విద్యుత్ వెలుగులు అందిస్తూ అరిజన్స్ కుటుంబాలు కొవ్వొత్తిలా కరిగి పోతున్నవి అని, చాలి చాలని వేతనంతో జీవిస్తున్నారని అన్నారు. రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిజన్స్‌కి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ ఉద్యోగలుగా కన్వరేషన్ చేసి నిలబెట్టుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నరాటి ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు బి.అయోధ్య, సాబీర్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శంకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు, కోలా శ్యామ్. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచెర్ల జమలయ్య, దేవరకొండ శంకర్, కే.సారయ్య, నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-కొత్తగూడెం

గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆనందఖని, కొత్తగూడెంలోని ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ సెంటర్ నందు గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. ఎన్నికల అధికారులందరూ శిక్షణా కార్యక్రమంలో అన్ని విషయాల పట్ల అవగాహన కల్పించుకొని, ఎటువంటి సందేహాలకు తావు లేకుండా పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి మాట్లాడుతూ మండల స్థాయిలో పీఓలకు, ఏపీవోలకు త్వరలోనే శిక్షణను అందిస్తామని, మండల స్థాయి అధికారులు అందరూ సంబంధిత శిక్షణను పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పంచాయతీ ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి నగిన సతీష్ కుమార్ మాట్లాడుతూ... కొత్తగూడెం డివిజన్, భద్రాచలం డివిజన్‌లో ఉన్న 409 మంది రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఇక్కడ శిక్షణ జరుగుతుందని, డివిజన్ వారీగా ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపులలో సంబంధిత ఆర్వోలు, ఏఆర్ఓలు జాయిన్ అయి, గ్రూపులో వారికి వచ్చేటువంటి సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓలు సుధీర్ కుమార్, రమణ, విద్యాశాఖ కో-ఆర్డినేటర్లు ఎస్‌కె.సైదులు, నాగరాజ శేఖర్, మాస్టర్ ట్రైనీలు సాయి కృష్ణ, శ్రీనివాసరావు, చలపతి రాజు, దుర్గ, శైలజ, స్వరూప్ కుమార్, బివిఎల్.కుమార్, ఆనంద్ కుమార్ స్వామి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వనమంతా జనం

- గద్దెలకు చేరుకున్న సమ్మక్క-సారలమ్మ
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



నవతెలంగాణ-చర్ల

మండల పరిధిలోని ఎదురుగుట్టల వద్ద వెలసి ఉన్న సమ్మక్క-సారక్క జాతరను పురస్కరించుకొని వనమంతా జనమయమైంది. చర్ల నుండి వెంకటాపురం వెళ్ళు మార్గంలో సుబ్బంపేట పంచాయతీ పరిధిలో తరతరాలుగా ఎదురుగుట్టలపై గల అబ్బు రాసి బండల వద్ద వెలచి ఉన్న సమ్మక్క-సారలమ్మ, పగిరెద్దరాజు, పడమరాజు, తిరగరాజు, ధర్మరాజుల జాతర ఉత్సవం అత్యంత వైవోపేతంగా గిరిజన ఆలయ పూజారి పూణెం సమ్మయ్య నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తారీకు నుండి నేటి వరకు ఎంతో వైవోపేతంగా నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర తొలి రోజు అంకరార్పురం జరగా గురువారం సమ్మక్క-సారక్కలు గద్ద పైకి వచ్చారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, ఆదివాసీ డోలు నాదాలతో అమ్మవార్లను ఎంతో భక్తి శ్రద్ధలతో గద్దెపైకు తీసుకువచ్చే సమయంలో శివశక్తులు భక్తి పార్వస్యంతో శివమెత్తారు. సరిహద్దు ఛత్తీస్గడ్, ఒడిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు ఎదురుగుట్టలకు చేరుకొని తమ తమ మొక్కులను తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వంట వార్పులు చేసుకొని ఆనందంగా ఆ చల్లని తల్లుల వద్ద గడిపారు. భక్తుల రాకతో వనమంతా జన సముద్రంగా మారింది. చర్ల సీఐ రాజు వర్మ తన సిబ్బందితో కలసి జాతర మూడు రోజులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నారు.

మంత్రి పొంగులేటి సుడిగాలి పర్యటన



నవతెలంగాణ-పాల్వంచ రూరల్

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్వంచలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా కేపీ జగన్నాధపురం పెద్దమ్మతల్లి దేవాలయం, శివాలయాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. స్థానిక ఫంక్షన్ హాల్లో జరిగిన బత్తుల అంజి సోదరుని కుమారుని వివాహానికి హాజరయ్యారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని నూతన, వధూవరులను ఆశీర్వదించారు. ఇటీవల వివాహం జరిగిన నవీన్ దంపతులను కేశవాపురం వారి ఇంటి వద్ద ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను అందించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన చీకటి కార్తీక్ గాంధీ భవన్‌లో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసేందుకు వెళ్తూ..మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన టీం మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించింది. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. పలు ప్రయివేట్ కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట భద్రాచలం, అశ్వరావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనం నుంచి జనంలోకి వనదేవతలు

- అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి సీతక్క ఎమ్మెల్యే పాయం, మాజీ ఎమ్మెల్యే చందా



నవతెలంగాణ-కరకగూడెం

మండల పరిధిలోని చిరుమళ్ళ గ్రామంలో రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే శ్రీ సమ్మక్క, సారలమ్మ నిండు జాతరకు రాష్ట్ర శిశు, సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే దానసరి సీతక్క (అనసూయ), పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర అమ్మవార్లను దర్శించుకున్నారు. తొలుత ఆలయ కమిటీ డప్పు వాయిద్యాలు, ఆదివాసీ నృత్యాలతో పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సీతక్క అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జాతరను ఉద్దేశించే మాట్లాడుతూ మేడారంను తలపించేలా జాతరను నిర్వహిస్తున్న చంద వంశీలను, పూజారులను ఆలయ కమిటీ సిబ్బందిని అభినందించారు. మేడారంలో చిన్న జాతర తల్లి పుట్టిన ఊరులో పెద్ద జాతర నిర్వహించుకోవడం, దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ సూచనలను పాటిస్తూ వారు ప్రతిపాదించిన ప్రతి దానిని పూర్తి చేస్తానని ఆమె అన్నారు. వనదేవతలు కొలిస్తే కొంగు బంగారాన్ని అందించే సమ్మక్క, సారలమ్మల గద్దెలను అభివృద్ధి చేస్తానని ఆమె తెలిపారు. కరకగూడెం నుంచి మంగపేటకు వెళ్లే దోమేడ రహదారిని త్వరలో మంజూరు చేసి పనులు పూర్తిచేస్తామని ఆమె అన్నారు. తల్లుల మీద ఉన్న విశ్వాసం నమ్మకానికి ప్రతీక జాతర అని ఆమె అన్నారు. ఐటీడీఏ ద్వారాగా తక్షణ సహాయం కింద రూ.5 లక్షలు అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. రాబోయే రోజుల్లో గుడి ఆవరణ చుట్టు సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రహరీ గోడ, ఆలయ కమిటీ తెలిపిన ప్రతి ప్రతిపాదనలకు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఆ తల్లి దీవెనలు, ఆశీస్సులు మండల ప్రజల మీద ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు చేయించి గుడిని అభివృద్ధి చేయిస్తానని ఆయన అన్నారు. జాతరకొచ్చిన భక్తులు క్షేమంగా వారి వారి గ్రామాలకు చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పూజారి వీరయ్య, ధర్మకర్త బిక్షపతి, భూపతయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు, ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- డాక్టర్ దుర్గాభవాని



నవతెలంగాణ-పినపాక

గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు దుర్గా భవాని కోరారు. గురువారం మండల పరిధిలో గల తోగూడెం ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిక్షేయ్ శివిర్ వందరోజుల ప్రణాళికలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో చెస్ట్ పరీక్షలు, ఎక్సరే, తెమడ పరీక్షలు నిర్వహించినట్టుగా తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- డయాలసిస్ సెంటర్‌ను సద్వినియోగపరచుకోండి
- చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్





నవతెలంగాణ-చర్ల

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా కలెక్టర్ ఆసుపత్రిలో మందులు అందించే గది, రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డ్, గర్భిణీల వార్డ్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఇన్ పేషెంట్ వార్డ్‌లో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేపడుతున్న డయాలసిస్ సెంటర్ పనులను ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. 5 డయాలసిస్ యూనిట్ల ఏర్పాటు పనులను పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్యులు, సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో త్రీఫేస్ విద్యుత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీఎస్ ఎంఐడీసీడీఈను ఆదేశించారు. కలెక్టర్ స్థానికులతో మాట్లాడారు. వారు గిరిజనులు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో డయాలసిస్ సేవలను ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీనియర్స్ అక్షర ప్రెస్‌క్లబ్ సభ్యులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో దంత వైద్యులు ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం అందించడానికి తగిన పరికరాలు లేవని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చుట్టుపక్కల గ్రామాల్లో సికి సెల్ ఎనిమియా తల సేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారు రక్తం మార్పిడి చేయించుకొనుటకు భద్రాచలం వెళ్లవలసి వస్తుందని, కావునా రోగులకు ఇబ్బంది కలగకుండా బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేయవలసిందిగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి కావలసిన సామగ్రికి సంబంధించిన ప్రతిపాదనలు పంపవలసిందిగా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందువలన ఎన్నికల అనంతరం ప్రతిపాదనలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డీసీహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరిండెంట్ సాయి వర్ధన్, డాక్టర్లు కాంత్, జగన్, డయాలసిస్ ఆపరేషన్ మేనేజర్ భాస్కర్, టీఎస్ ఎంఐటీసీ ఇంజనీర్లు, తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, ఎంపీఓ హజరత్ వలి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలి

- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు



నవతెలంగాణ-ములకలపల్లి

తునికాకు ప్రూనింగ్ పనులు ప్రభుత్వం వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గౌరి నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి ఆఫీస్ స్టాఫ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిగొండ రాంబాబు మాట్లాడుతూ...ఏజెన్సీ ప్రాంతంలో తునికాకు సేకరణ గిరిజనులకు, గిరిజనేతరులకు రెండో పంటగా ఉంటుందని నేటికీ ప్రూనింగ్ పనులు ప్రారంభించకపోవడంతో గిరిజనులు, గిరిజనేతర ప్రజలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం తునికి ఆకు సేకరణకు టెండర్లు పిలిచి సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు గిరిజనేతరులకు తునికాకు సేకరణ వల్ల ఒకొక్క కుటుంబానికి 20 నుంచి 50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ఫిబ్రవరి నెల చివరి వారంలో తునికాకు కొమ్ముకొట్టుడు పనులు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉండగా ప్రభుత్వం నేటికీ కొమ్ముకొట్టుట పనులు ప్రారంభించపోవాడంతో ప్రాంతంలో ఉన్న గిరిజనులు, గిరజనేతర ప్రజలకు తనికాకు సేకరణ ఉపాధిని కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పొడియం వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటేశ్వర్లు, శనగాని వినోద్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యుత్ శాఖ లైన్‌మేన్ మృతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ట్రాన్స్ కో లైన్‌మేన్ ఒకరు గురువారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... మండలంలోని వినాయకపురంకు చెందిన రామినేని సత్యనారాయణ (54) విద్యుత్ శాఖలో లైన్ మేన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది జరిగిన బదిలీల్లో వినాయకపురం సబ్ స్టేషన్‌కు లైన్ మేన్ రాగా, విధులు నిర్వహిస్తున్న క్రమంలోనే కొద్ది రోజుల క్రితం జ్వరం, కామెర్లు వచ్చాయి. దీంతో కుటుంబీకులు హైదారాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి గడిచిన పది రోజులుగా వైద్యం చేయిస్తున్నారు. చికిత్స పొందుతున్న క్రమంలోనే పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ వెంకటరత్నం, ఏఈఈ సంతోష్, తోటి సిబ్బంది సంతాపం తెలిపి, కుటుంబీకుల తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

వృక్ష కల్యాణ మహోత్సవం



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కొండాపురం సీహెచ్‌పీలో ఆవరణలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ ఓంకారేశ్వరి దేవి ఆలయంలో సింగరేణి సంస్థ, ఉద్యోగుల, కార్మికుల సంరక్షణ, లోక కళ్యాణం లక్ష్యంగా లక్ష్మీ నారాయణ స్వామి వృక్ష కళ్యాణ మహోత్సవం (రావి చెట్టు నారాయణస్వామి, వేప చెట్టు లక్ష్మీదేవి) గురువారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం దుర్గం రామచందర్, ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్ తిలకించారు. కుల మతాలకతీతంగా సింగరేణి పర్మినెంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు కలిసి సోదర భావంతో ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ వృక్ష కల్యాణం మహోత్సవం జరుపుకున్నారు. ఎప్పుడు యంత్రాల ధ్వనులతో ప్రతిధ్వనించే కేసీహెచ్‌పీ ఆవరణలో కల్యాణ మహోత్సవం సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం శ్రీశ్రీశ్రీ ఓంకారేశ్వరీ దేవి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మీనారాయణ కళ్యాణం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు ఈ కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలలో కూడా సమిష్టిగా అందరూ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కేసీహెచ్‌పీ డీజీఎం, ఆలయ ధర్మకర్త మదన్ నాయక్, ఇంజనీర్లు ఆర్ఎస్ గౌడ సందీప్, రామకృష్ణ, మల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు ఆవుల నాగరాజు, శ్రీనివాస్ (ఏఐటీయూసీ), వత్సవాయి కృష్ణంరాజు, శ్యాం వర్మ (ఐఎన్‌టీయూసీ), నాగెల్లి వెంకట్ (టీబీజీకేఎస్), శ్రీకాంత్ (సీఐటీయూ), ఎస్‌డీ నాసర్ పాషా (ఐఎఫ్‌టీయూ), ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేగళ్లపాడు వ్యవహారంపై రాజకీయ చిచ్చు..!

ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం

- తుమ్మల సీరియస్
- ముఖ్యమంత్రి వద్దకు చేరిన పంచాయితీ



నవతెలంగాణ-దమ్మపేట

రేగళ్లపాడు పామాయిల్ నర్సరీ వ్యవహారంపై రాజకీయ చిచ్చు రగులుతోంది. ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, రేగళ్లపాడు గ్రామంలోని పామాయిల్ నర్సరీలో మొక్కల ధ్వంసం అయిన ఘటన దుమారం లేపిన విషయం విధితమే. ఈ విషయంలో పెద్ద ఎత్తున అన్ని పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ నేపద్యంలో దమ్మపేట మండలానికి చెందిన ఒక పెద్దాయిన తన అనుచరులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయిల్‌ఫెడ్ అధికారుల మధ్య విభేదాలతోనే రేగళ్లపాడు విషయం రచ్చకెక్కిందని చెప్పారు. విలేకర్ల సమావేశం నిర్వహించిన మరుసటి రోజు దమ్మపేట, అశ్వారావుపేటల్లో విధులు నిర్వహిస్తున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు తమ గోడు వెళ్లబుచ్చుకునేందుకు ఆ పెద్దాయనవద్దకు వెళ్లారు. ఆ అధికారులు పెద్దాయన వద్ద వున్న సమయంలో ఆ సంస్థ నాయకుడు ఆ పెద్దాయనకు ఫోన్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విలేకర్ల సమావేశంలో జరిగిన చర్చ, రేగళ్లపాడు వ్యవహారాల గురించి వీరిద్దరి మధ్య ఫోన్‌లో చర్చ ప్రారంభం అయింది. ఈ చర్చ కాస్తా వేడెక్కి నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి చేరి నువ్వు ఫోన్ పెట్టేయి అంటే నువ్వు ఫోన్ పెట్టేయి అనే వరకు వెళ్లి మాటల యుద్ధం జరిగింది.

ఈ వ్యవహారంపై తుమ్మల సీరియస్..!

రేగళ్లపాడు నర్సరీలోని హాఫ్ ట్రైప్ మొక్కల రగడపై రైతుల దృష్టి మరల్చేందుకు వ్యూహం పన్ని నిర్వహించిన విలేకర్ల సమావేశం అధికారుల అనైక్యత అనే పదజాలం వాడటంతో ఈ విషయం పెద్ద చర్చగా మారి నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి చేరింది. రైతుల్లో విషయంపై పలు అనుమానాలతో పాటు ఎవరు ఆధిపత్యం కోసం వారు తమ జీవితాలతో ఆడుకుంటున్నారని పామాయిల్ రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. దీంతో వ్యవహారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వద్దకు వెళ్లినట్లు నమ్మదగ్గ సమాచారం. అనవసర విషయాలతో తనకు తలనొప్పులు తెస్తున్నారని ఆయన ఆగ్రహంగా వున్నట్లు తెలిసింది.

ముఖ్యమంత్రి వద్దకు చేరిన పంచాయితీ!

ఈ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తమ నేత ద్వారా తీసుకెళ్లినట్లు పేరు వెల్లడించడానికి ఇష్టం లేని అధికార పార్టీలోని ముఖ్య నాయకుడు తెలిపాడు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ముఖ్యమంత్రి అన్నట్లు సమాచారం. ఆయిల్‌ఫెడ్‌లో ఏం జరుగుతోంది? అధికారుల పనితీరు? అవినీతి తదితర విషయాలపై నిఘా వర్గాల ద్వారా సమాచారం తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నమ్మదగ్గ సమాచారం.

గోడు వెళ్లబోసుకుందామని వెళితే...

తమ గోడు వెళ్లబోసుకుందామని వెళ్లిన ఆ ఆయిల్‌ఫెడ్ అధికారులకు ఆ నాయకుల మధ్య జరిగిన మాటల యుద్ధం చూసి ఇంకాస్త బురదలో కూరుకు పోయామన్న భయం మొదలయినట్లు తెలుస్తోంది.



పర్ణశాల ఆలయ ప్రాంగణంలో తులసి మొక్కలు నాటాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ -దుమ్ముగూడెం

ప్రముఖ పుణ్య క్షేత్రమైన పర్ణశాల రామాలయ ఆవరణలో విస్తృతంగా తులసి మొక్కలు నాటలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆలయ అధికారులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. గురువారం అయన రామలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణం మొత్తం ఔషధ మొక్కలు అయినటువంటి తులసి మొక్కలను విరివిగా నాటాలని అన్నారు. దేవస్థానం వారు సూచించిన ప్రదేశాలను పరిశీలించారు. స్థానిక పంచాయతీ అధికారుల సహకారంతో తులసి మొక్కలను వేయాలని అన్నారు. పర్ణశాల ఆలయం పక్కన గల దారి మొత్తం షాపులతో కిక్కిరిసినందున ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పర్ణశాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఏ విధమైన చర్యలు తీసుకోవాలో తగు విధమైన ప్రణాళికను తయారు చేయాలని, ఆలయ రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా షాపులను వేరొక చోటకు మార్చు విధంగా సరైన ప్రణాళికలు సిద్ధం చేయవలసినదిగా పంచాయతీ, దేవస్థానం అధికారులను ఆదేశించారు. ఆలయం ఎదుట విప్ప పువ్వులు అమ్ముకునే వారి వద్ద ఆగి వారి నుండి వివరాలు తెలుసుకొని కొంత విప్ప పువ్వు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి, దేవస్థాన ఈఈ, పంచాయతీ సెక్రెటరీ పర్ణశాల ఆలయ ఇన్చార్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ స్కూళా... మజాకా..!?

- మండుటెండలో చిన్న పిల్లలను నిలబెట్టిన వైనం
- మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ -బూర్గంపాడు



స్కూలుకి ఆలస్యంగా వచ్చినందుకు ప్రయివేటు పాఠశాల యజమాన్యం చిన్న పిల్లలని కూడా చూడకుండా దాదాపు మూడు గంటలసేపు మండుటెండలో గేటు బయట నిలబెట్టిన ఘటన గురువారం బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో నడుపుతున్న స్టెల్లా మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూలు యజమాన్యం పాఠశాల సమయం దాటినా తర్వాత వచ్చినందుకు మండుటెండలో మూడు గంటలపాటు గేట్ బయట నిలబెట్టారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారుల తల్లిదండ్రులు పాఠశాల హెచ్ఎంను ప్రశ్నించడంతో ఆమె దురుసుగా ప్రవర్తించి టీసీ కూడా ఇచ్చి పంపుతానని బెదిరించినట్లు ప్రచారం జోరుగా సాగింది. స్కూలుకు ఆలస్యంగా వస్తే ఇంత పెద్ద శిక్ష వేయటం యాజమాన్యానికి తగునా అని విద్యార్థుల తల్లిదండ్రులు మండి పడుతున్నారు. గతంలో కూడా ఈ స్కూలులో ఫీజు చెల్లించలేదని చిన్న పిల్లలను ఆరు బయట నిలబెట్టి, వెనకకు పంపిన పరిస్థితి ఉంది. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి ఎదు సింహరాజు చొరవతో పిల్లలను స్కూల్లోకి పంపించారు. ఎంఈఓ చొరవ తీసుకోపోతే పిల్లలు ఎండలు మాడి పోవాల్సిందేనా అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలపై ఇంత నిర్లక్ష్యంగా, కఠినంగా వ్యవహరిస్తున్న స్కూలు యా జమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. స్కూల్ యజమాన్యం వైఖరిపై ఎంఈఓను విలేకరులు వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో పాఠశాల నడుపుతూ నిర్లక్ష్యంగా పిల్లలను హింసిస్తున్న ప్రయివేటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన 'బ్రిలియంట్' ఆణిముత్యం

నవతెలంగాణ- బూర్గంపాడు



మండల పరిధిలోని సారపాక బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదువుతున్న బి.సంయుక్త ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 79 శాతం ఉత్తీర్ణతతో జాతీయ స్థాయిలో రాణించి అందరినీ అబ్బురపరిచింది. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్ఆర్ నిర్వహించిన అభినందన కార్యక్రమానికి పంచాయతీ ఈవో కంది మహేష్ హాజరై ఆ విద్యార్థినిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఈవో మహేష్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతం నుంచి ఎన్నో కాంపిటీషన్ పరీక్షలకు విద్యార్థులను తయా రు చేసేలా సారపాకలో విద్యాసంస్థ ఉండటం గర్వంగా ఉందని ఆయన అన్నారు. తల్లిదండ్రులు మంచి కళాశాలను చూసి విద్యార్థులను పంపిస్తే వారంతా ఇలాంటి విజయాలే సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

17న టేకులపల్లిలో మిర్చి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ- టేకులపల్లి

ఈనెల 17వ తేదీ నుండి టేకులపల్లి సబ్ మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళు ప్రారంభిస్తున్నట్లు ఇల్లందు మార్కెట్ యార్డు సిబ్బంది గురువారం జీపు ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని రైతులు మిర్చి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ యార్డ్ సిబ్బంది. ఈ నరేష్ కుమార్, రంజిత్, వై. మధు తదితరులు పాల్గొన్నారు.

20న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకురాలు ఆదిలక్ష్మి

నవతెలంగాణ-అశ్వాపురం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరుతూ ఫిబ్రవరి 20న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ చేపట్టె చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా నాయకురాలు పెదగొని ఆదిలక్ష్మి కోరారు. గురువారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు డివిజన్ ఉపాధ్యక్షురాలు కణాతల ధనలక్ష్మి, రమాదేవి, ఎల్లమ్మ, వెంకటరమణ, లక్ష్మి, రమాదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలి

- ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సుద్ మొహిద్దిన్

నవతెలంగాణ-అశ్వాపురం



అడవుల్లో వేసవి కాలంలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని మణుగూరు ఎఫ్‌డిఓ సయ్యద్ మక్సుద్ మోహినుద్దీన్ అన్నారు. గురువారం అశ్వాపురం రేంజ్ పరిధిలోని ఎలకలగూడెం, కొత్తూరు గ్రామాలల్లోని అడవులలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు, వన్యప్రాణి సంరక్షణ గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అటవీ చుట్టు పక్కల గ్రామాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని, ఒకవేళ జరిగితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అనంతరం బండ్ల వారి గుంపు గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న ఫారెస్ట్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ కార్యకమంలో అశ్వాపురం రేంజ్ ఆఫీసర్ రమేష్, డీఆర్ఓ ధనలక్ష్మి, వెంకట్రావు, ఎఫ్‌బిఓలు బాబురావు, వాణి, సునీల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్ ఫండ్, భూతగాదాలకు సంబంధించిన కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగతనం కేసులు, ట్రాఫిక్ చాలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, కొట్టుకున్న కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, చిట్ ఫండ్ కేసులు ఈ లోకదాలత్‌లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వడదెబ్బ నివారణకు ముందస్తు ప్రచారం కల్పించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల లక్ష్యం 100 శాతం పూర్తి చేయాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

నవతెలంగాణ-పాల్వంచ

రాబోయే వేసవి కాలం దృష్ట్యా ప్రజలు వడదెబ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ జితేష వి పాటిల్ సూచించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ జితేష్.వి.పాటిల్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని ఆరోగ్యకేంద్రాలలో పనిచేస్తున్న వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది తమ తమ పరిధిలోని ఆస్పత్రులకు, పిహెచ్‌సిలకు సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించే కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలని, రాబోయే వేసవి కాలంలో వచ్చే వడదెబ్బ బారిన పడిన వారికి తక్షణ చికిత్సలో భాగంగా అన్ని రకాల మందులు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని సూచించారు. గర్భిణీనులను 12 వారలా లోపు ఎం.సి. హెచ్ పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. భాస్కర్ నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుకృత, సీహెచ్ఐ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం



ఆఫీసర్ డాక్టర్ అర్పి చైతన్య, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరున్, మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్పందన, డిప్యూటీ డెమో ఎం.డి. ఫైజ్ మొహి ఉద్దిన్ పాల్గొనారు.



కేఓసీతో ఇబ్బంది పడుతున్న గిరిజన కుటుంబాలు

- వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-టేకులపల్లి

కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు వెలికితీత పనులు ప్రారంభించినప్పటి నుండి పెట్రాంచెలక స్టేజికి సంబంధించిన గిరిజనుల కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు గురువారం బాధితులు తెలిపారు. 2001లో కోయగూడెం ఓపెన్ కాస్ట్ ద్వారా బొగ్గు వెలికితీత పనులు ప్రారంభించి, నిత్యం ప్రాజెక్ట్ నుండి పెట్రాంచెలక స్టేజి మీదగా వందలాది బొగ్గు లారీలు టేకులపల్లి ద్వారా నవభారత్, కేటీపీఎస్, వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తుంటారని, లారీల నుండి కిందపడిన బొగ్గుపెల్లలు నుండి కాలుష్యంతో దుమ్ము, ధూళి ఇండ్లపై వ్యాప్తి చెందుతుందని, దాని ద్వారా అనారోగ్య పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత 23 ఏళ్లుగా పెట్రాంచెలక స్టేజి గ్రామం మీదుగా బొగ్గు తోలుకుంటూ, నయా పైసా కూడా గ్రామానికి అభివృద్ధి చేయలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బొగ్గు టిప్పర్లను, సింగరేణి అధికారుల వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం మా బతుకుల్లో దుమ్ము కొడుతూ మా జీవితాలను సర్వనాశనం చేస్తూ, సింగరేణి కోట్లాది రూపాయలు లాభాలు సంపాదిస్తుందన్నారు. విపరీతమైన దుమ్ముతో నిమిషం కూడా, ఇండ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని, గ్రామస్తులు ఆందోళనలతో సుమారు మూడు గంటలు పైగా బొగ్గు టిప్పర్లను అడ్డుకున్నారు. సింగరేణి సీనియర్ సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి గ్రామస్తులతో చర్చించారు. బోడు ఎస్ఐ పి.శ్రీకాంత్ అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

పరిశుభ్రత పాటించాలి

- ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాదిని నియమిస్తాం
- ఆశ్రమ పాఠశాలు, సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ
- కోర్టును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

నవతెలంగాణ-ఇల్లందు

గిరిజన వసతి గృహాలలో పరిశుభ్రత పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి ఆదేశించారు. మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను, గిరిజన వసతి గృహాలను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ జి.భానుమతి ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థి, విద్యార్థులకు మెనూ ప్రకారం సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయో లేవో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు పాఠశాలలోని, శౌచాలయాలు, వంటశాలలను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని యజమాన్యానికి వారికి తగు సూచనలు చేశారు. విద్యార్థిని విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తనిఖీల్లో భాగంగా సబ్ జైల్‌ను సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయి లేవో అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది నియమిస్తామని తెలిపారు. తనిఖీల అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టును సందర్శించారు. వారికి ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి



పుష్పగుచ్చంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అధ్యక్షుడు పాటు కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు బి.రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు పి. బాలకృష్ణ టి. ప్రభాకర్, పి.జయప్రకాష్, పి.అనిల్ కుమార్, నిరంజన్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- టేకులపల్లి

మండలంలోని లచ్చాతండా గ్రామానికి చెందిన గుగులోత్ సక్రియ అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరం సురేందర్, రెడ్యానాయక్, మూడు సంజయ్, సాములు, బానోతు రవి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-ఇల్లందు

డివిజన్‌లో సివిల్ సప్లై హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సింగరేణి, జీసీసీ, కార్మికుల మస్టర్ అడ్డాల వద్ద జరిగిన సభలో ఏరియా అధ్యక్ష కార్యదర్శులు, పాయం వెంకన్న మల్లెల వెంకటేశ్వర్లు అన్నారు. ఇల్లందు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయూసీఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణను చేసి నాలుగు లేబర్ కోడ్స్ కు రూల్స్ పార్లమెంట్లో ఆమోదం పొందబోతోంది, ఆమోదం పొందితే, 8గంటల పని ఉండదన్నారు. సమ్మె హక్కు ఉండదు, అసలే కార్మికులకు ఉద్యోగ భద్రత లేదు, ఆ మేరకు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్య పేలం మీదనుండి పొయ్యిలోకి జారినట్టు ఉంటదన్నారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ -బూర్గంపాడు

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అంజనాపురం గ్రామంలో ఆటో ఢీకొని గాయాపాలైన వారిని పరామర్శించారు. క్షతగాత్రులను కారులో ఎక్కించి ఆసుప త్రికి తరలించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మానవత్వం చాటుకొని క్షతగాత్రు లకు వైద్యం అందించారు.

అంగన్వాడీ ఆయా లక్ష్మి మృతి

- సీఐటీయూ సంతాపం : 10 వేలు వితరణ

నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందులపాడు-1 సెంటర్ ఆయమ్మ లక్ష్మి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ వార్త తెలిసిన వెంటనే ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణ కుమారి, ఇల్లందులపాడు సెక్టార్ సూపర్ వైజర్ బీ.అన్నపూర్ణ, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ నేతలు అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు కార్యదర్శి కల్లేపల్లి మరియా, కోశాధికారి షేక్ ఫాతిమా, నాగలక్ష్మి సెంటరు టీచర్ ఈ.లక్ష్మీకాంత, దేవమణి, నక్క సుశీల, ఈ.యాకమ్మ, తదితరులు జే.లక్ష్మి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ప్రభుత్వం నుండి ఇవ్వవలసిన మట్టి ఖర్చుల డబ్బులు యూనియన్ నేతల సమక్షంలో సీడీపీఓ అరుణ కుమారి రూ.10 వేలు బాధిత కుటుంబానికి ఇచ్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.





వనదేవతలకు ఐటీడీఏ పీవో వస్త్రాలు సమర్పణ

నవతెలంగాణ-కరకగూడెం

మండల పరిధిలోని చిరుమళ్ళ గ్రామంలో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు జాతరను గురువారం ఐటిడిఏ పి.ఓ రాహుల్ సందర్శించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు మేల తాళాలు, డప్పు వాయిద్యాలు, ఆదివాసీ కళాకారుల నృత్య ప్రదర్శనతో ఘనస్వాగతం పలికారు. అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆలయంలో పగిడిద్దరాజు జీవిత చరిత్రను పీవో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడికి అవసరమైన ప్రతీ పనిని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఆలయ కమిటీ ప్రతిపాదించిన ప్రతి పనిని త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించిన ఎన్‌హెచ్ ఉన్నతాధికారులు

నవతెలంగాణ - అశ్వారావుపేట

అశ్వారావుపేట పట్టణంలో నిర్మిస్తున్న సెంట్రల్ లైటింగ్, డ్రయినేజీ, రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని నేషనల్ హైవే ఈఈ యుగంధర్ స్థానిక ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మూడు రోడ్ల కూడలి సమీపంలో గల మసీదు పరిసరాల్లో 50 అడుగుల మేరకు రోడ్డును విస్తరించాలని, డ్రైనేజీని కూడా అదే కొలతల పరిధిలో నిర్మించాలని సూచించారు. పట్టణంలో డ్రయినేజీ, రోడ్డు విస్తరణ పనులను గురువారం పరిశీలించారు. సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం వరకు నిర్మాణంలోని పనులను ఆయన క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. మసీదు వద్ద కొలతల సేకరణలో వివాదం నెలకొనడంతో కొద్ది రోజుల క్రితం ముస్లిం పెద్దలు పలువురు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. మంత్రి ఆదేశాలతో నేషనల్ హైవే అధికారులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యతపై పలు సూచనలు చేశారు. ప్రయాణికులు, వాహనదారుల సౌకర్యార్థం పోలీస్ స్టేషన్ మూల మలుపు వద్ద పనులకు అవసరం మేరకు విస్తరణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఆయన వెంట డీఈ బషీర్,



ఆర్ అండ్ బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌గా సూర్యం సేవలు మరువలేనివి

- ఐదు సార్లు సర్పంచ్ గా ప్రజలకు సేవలు
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ- బూర్గంపాడు

గ్రామ సర్పంచిగా అంజనాపురానికి చెందిన తేజావత్ సూర్యం అందించిన సేవలు మరువలేనివని, గ్రామ పంచాయతీకే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అంజనాపురం గ్రామానికి చెందిన తేజావత్ సూర్యం గ్రామ సర్పంచిగా ఐదుసార్లు బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేసినట్లు ఆయన అన్నారు. గురువారం అంజనాపురంలో నిర్వహించిన సూర్యం ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కళావేదికను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. తన తండ్రి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సూర్యం కుమారులు నాగేశ్వరరావు, కృష్ణ, జానకిరామ్ బూర్గంపాడు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలలో గత ఏడాది పదవతరగతిలో మొదటి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమ తులను అందజేశారు. అదేవిధంగా హైదరాబాద్ అడిషనల్ డీసీపీ తేజావత్ రాందాస్ పాల్గొని సూర్యం విగ్రహావిష్కరణ చేపట్టారు.

తేజావత్ సూర్యం చేసిన ప్రజాసేవ ఆదర్శప్రాయం : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

సర్పంచ్‌గా తేజావత్ సూర్యం చేసిన ప్రజాసేవ అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోరంపల్లి బంజర గ్రామ పంచాయతీ సర్పంచ్ గా తేజావత్ సూర్యం ఐదుసార్లు పని చేసి ప్రజా సేవ చేశారని ఆయన అన్నారు. సూర్యం ప్రజాసేవ ఎందరికో ఆదర్శ ప్రాయం మార్గ దర్శకమని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి సూర్యం పేరు మీద కుమారులు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ



కార్యక్రమంలో ఎంపిడివో జమలారెడ్డి, ఎంఈవో యదు సింహరాజు, మాజీ జడ్పిటిసి బట్టా విజయ గాంధీ, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, నాయకులు నరసింహ, భూక్య సేవాలాల్, మాజీ ఉప సర్పంచ్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, తేజావత్ పున్నా, భూక్యా సుగుణ, రమేష్, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

9

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | ఫిబ్రవరి 14, 2025 | www.navatelangana.com

సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న మెచ్చా



నవతెలంగాణ-చంద్రుగొండ

బెండలపాడు గ్రామ శివారులో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మల జాతర మహోత్సవంలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మెచ్చాని శాలువాతో సత్కరించారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులు మెచ్చాతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపడంతో అందరితో ఆత్మీయంగా మాట్లాడుతూ ఫొటోలు దిగుతూ సమయం గడిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దారా బాబు, ప్రధాన కార్యదర్శి సంగోండి రాఘవులు, నరకుల్ల సత్యనారాయణ, నల్లమోతు వెంకట నారాయణ,మేడా మోహన్ రావు, సురా వెంకటేశ్వర్లు, భూపతి రమేష్, రామరాజు, పండ్ల అంజన్ రావు, వెంకటేశ్వర్లు, రమేష్, వాసు, శ్రీనివాస్ నాయక్, తదితరులు ఉన్నారు.

అదేవిధంగా సమ్మక్క, సారక్క జాతరకు తహసీల్దార్ సంధ్యారాణి, ఉప తహసీల్దార్ ప్రసన్న గద్దెల వద్దకు చేరుకుని సమ్మక్క, సారక్క విగ్రహాలను దర్శించుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు వారు హాజరు కాగా సమ్మక్క సారక్క జాతర కమిటీ, భక్త బృందం, గ్రామస్తులు స్వాగతం పలుకుతూ గద్దెల వద్దకు తీసుకెళ్లారు. అనంతరం సమ్మక్క సారక్కలను దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. జాతర కమిటీ, భక్త బృందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ప్రజా ప్రతినిధులు

సమ్మక్క, సారక్క జాతర ప్రారంభం మహోత్సవ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, ఈసం రాములు, మాజీ ఎంపీటీసీ కారం వెంకటేశ్వర్లు, గుంపిన వ్యవసాయ సహకార సంఘ డైరెక్టర్స్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే భక్తులకు అసౌకర్య కలగకుండా చర్యలు చేపట్టాలని కమిటీకి సూచించారు.



ధైర్యంగా ఉండు అండగా మేముంటాం

- దయాలసిస్ పేషెంట్‌కు చేయూత ట్రస్ట్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని వేపలగడ్డ పంచాయతీ కొమ్ము నకిరి పేట గ్రామంలో కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న డయాలసిస్ పేషెంట్ బాడిష బాలకృష్ణ అనే రోగికి మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ గురువారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గత మూడు సంవత్సరాల నుండి కిడ్నీలు రెండు పనిచేయకుండా ఉండటంతో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయిస్తూ జీవితాన్ని నెట్టు కొస్తున్నాడని, అప్పులు చేసి లక్షల రూపాయలు వైద్యం చేయించిన పూర్తిస్థాయిలో జబ్బు తగ్గకపోవడంతో ఒక్కొక్క సందర్భంలో కనీసం డయాలసిస్ చేయించటానికి ఆటోకి డబ్బులు లేని పరిస్థితిలో ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. బాధితుడి భార్య నాగేశ్వరి కన్నీరు పెట్టు కుంటూ విలపించారు. ఇద్దరు పిల్లలను హాస్టల్లో చదివిస్తూ తన భర్తకు సేవలు చేసుకుంటూ కాలం గడుపుతూ ఆపన్న హస్తంకోసం ఎదురుచూస్తున్న తరుణంలో బంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్టు దృష్టికి సమాచారం అందగానే మానవత్వంతో చేయూత ట్రస్ట్ ముందు అడుగులు వేసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతూ చేయూత అడుగులు వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ కైపు నాగిరెడ్డి, గౌరవాధ్యక్షులు (కెవి) కె.వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి జక్కి రెడ్డి మల్లారెడ్డి, సహాయ కోశాధికారి గాది నర్సిరెడ్డి, సభ్యులు కె.చిన్న నాగిరెడ్డి, కే.వెంకట్ రెడ్డి, సెనగ మల్లేశ్వరరావు, సోము ఆదిరెడ్డి, బెజ్జం వెంకటరామిరెడ్డి, తమ్మినేని శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్లం ఎంతో అవసరం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



ప్రపంచాన్ని జయించాలంటే గ్లోబల్ లాంగ్వేజ్ అయిన ఆంగ్లం ఎంతో అవసరం అని ఎల్టా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి, షేక్ మీరా హుస్సేన్ అన్నారు. ఆంగ్ల దినోత్సవాన్ని (సరోజిని నాయుడు జయంతిని) పురస్కరించుకొని మండల పరిధిలోని రాజపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఆంగ్లం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను, శాస్త్ర సాంకేతిక రంగాలలో మరిన్ని పరిశోధనలు చేయాలన్న విద్యార్థులు తప్పనిసరిగా ఆంగ్లభాష నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం సరోజినీ నాయుడు జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూలతో సరోజినీ దేవికి నివాళు లర్పించారు. సరోజినీ నాయుడు జీవిత చరిత్రను ఆమె ఆదర్శాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ చల్లా భాస్కర్, అకాడమిక్ సెల్ కో కన్వీనర్ రవికుమార్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం.బి నాగరాజు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, బాలు, భాస్కర్, కేవీఆర్ వరప్రసాద్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దమ్మపేట మసీద్ కమిటీ అధ్యక్షుడిగా షబ్బీర్

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట జమా మసీద్ నూతన అధ్యక్షులుగా షేక్ షబ్బీర్ అహ్మద్ గురువారం ఎన్నికయ్యారు. అదే విధంగా సెక్రటరీగా సయ్యద్ వలీ, కోశాధికారిగా షేక్ ఇమ్రాన్‌లతో పాటు ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు షబ్బీర్ మాట్లాడుతూ ఈ అవకాశం నాకు కల్పించినందుకు ఆ అల్లాకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, అదే విధంగా నాపై ఉన్న బాధ్యతలను దేవుడి ఆజ్ఞ ప్రకారం, గ్రామంలోని అందరి సహోదరుల సహకారంతో న్యాయపరంగా అమలు చేస్తానని ప్రతి విషయంలో కూడా నాకంటే పెద్దవారి అనుభవము, చిన్నవారి సహకారంతో నా బాధ్యతలను అమలుపరుస్తానని తెలిపారు. అదే విధంగా సెక్రటరీ, కోశాధికారిలు మాట్లాడుతూ మజీద్ సదర్ ఆదేశాల ప్రకారం ఆయన మాకు ఇచ్చే బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తామని అందరితో కలిసి అందరినీ కలుపుకొని పనిచేస్తామని అన్నారు. ఈ కమిటీ ఎన్నికల్లో గ్రామ ముస్లిం సహోదరులు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగల అలజడి

నవతెలంగాణ-పాల్వంచ



మున్సిపల్ పరిధిలోని రాహుల్ గాంధీ నగర్‌లో పట్టపగలే దొంగలు దొంగతనానికి ప్రయత్నించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. యాదాద్రి పవర్ ప్లాంట్ లో ఫైర్ స్టేషన్లో ఫైర్ మాన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగేశ్వర్ రావు ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగ గడ్డపారతో తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. శబ్దాలు రావడంతో ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తులు గమనించి అరవడంతో దొంగ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇంటి యజమాని ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

యార్లగడ్డ వరమ్మకు నివాళి

నవతెలంగాణ - బోనకల్



కూలీల ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన ఆంధ్రప్రభ దినపత్రిక జర్నలిస్ట్, బోనకల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మాతృమూర్తి యార్లగడ్డ వరమ్మ దశదినకర్మ గురువారం బోనకల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, గిర్దావర్ -1 గుగులోతు లక్ష్మణ్ హాజరయ్యారు. వరమ్మ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ యువ నాయకులు బీపీ నాయక్ వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు సురభి వెంకన్న వివిధ పత్రికల జర్నలిస్టులు తమ్మారపు వెంకటేశ్వర్లు, రేగళ్ల శ్రీనివాసరావు, చింతకాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగం రాంబాబు, బోనకల్, చింతకాని మండలాల జర్నలిస్టులు, తదితరులు హాజరై వరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- నేలకొండపల్లిలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

నవతెలంగాణ-నేలకొండపల్లి



రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నేలకొండపల్లి మండలంలోని చెన్నారం, భైరవునిపల్లి, నేలకొండపల్లి గ్రామాలలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బెస్ట్ టీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 'హాయ్ చెల్లెమ్మ నీ చేతులతో త్వరగా చాయ్ ఇవ్వమ్మా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ టీ చాలా బాగుందమ్మా' అంటూ అభినందించారు. టీ స్టాల్ ఏర్పాటు చేసుకున్న భార్యాభర్తలతో కాసేపు సరదాగా ముచ్చటించారు. అనంతరం చెన్నారం గ్రామంలో చింతనిప్పు సైదులు కుమారుడు వివాహం జరగడంతో నూతన వధూవరులను ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన పాలడుగు పూర్ణచంద్రరావు ఇటీవల మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోళ్ళ శ్రీను సతీమణి మరణించడంతో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, పార్టీ నాయకులు నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, బొడ్డు బొందయ్య, రాయపూడి నవీన్, వేగినాటి లక్ష్మీనరసయ్య, కొమ్మూరి నరేష్, బచ్చలకూరి నాగరాజు, జక్రిపోతుల అంజని, బోయిన వేణు, ఎడవల్లి నాగరాజు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగును పరిశీలించిన ఆత్మ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని ఆళ్లపాడు, నారాయణపురం మైనర్ల కింద సాగుచేసిన మొక్కజొన్నను మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామ కోటేశ్వరరావు గురువారం పరిశీలించారు. వారం రోజుల క్రితం ఈ మైనర్ల కింద చివర భూములకు సాగర్ నీరు అందక మొక్కజొన్న పంట ఎండిపోతున్నాయని నవతెలంగాణ దినపత్రికలో కథనం రావటంతో మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు స్పందించారు. ఈ మేరకు ఆళ్లపాడు గ్రామంలో చివర భూములను వ్యవసాయ విస్తరణ అధికారి బంధం రజితతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎకరానికి ప్రస్తుతం సాగర్ నీరు అందుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అందని రైతులు ఎవరైనా ఉంటే ఆందోళన చెందవద్దని, ప్రతి ఎకరానికి రాష్ట్ర ప్రభుత్వం సాగర్ నీటిని అందిస్తుందని తెలిపారు. సాగర్ నీరు అందని రైతులు తమ దృష్టికి తీసుకువస్తే నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి చివరి ఆయకట్టు భూములకు సాగర్ నీటిని అందించే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. బోనకల్ మండలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను కాపాడేందుకు మధిర ఆత్మ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, రైతులు షేక్ దస్తగిరి, మరీదు లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంగారం మాజీ సర్పంచ్ రాచమల్ల మృతి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం గంగారం మాజీ సర్పంచ్ రాచమల్ల కృష్ణమూర్తి (74) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించారు. సర్పంచ్‌గా కృష్ణమూర్తి పనిచేసిన కాలంలో గంగారం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. సర్పంచ్ పదవీ తరువాత ఉపాధ్యాయుడిగా, పీఈటీగా విద్యార్థులను తీర్చిదిద్దారు. కృష్ణమూర్తి మరణవార్త తెలిసిన పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విశ్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకులు కృష్ణమూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఆ సంఘ సత్తుపల్లి యూనిట్ బాధ్యులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, సాంబశివరెడ్డి, కృష్ణయ్య, బోడెంపూడి బాబు, మధుసూదనరాజు, పీడీ రాజు, ఎస్టీ, ఎస్సీ హక్కుల పరిరక్షణ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరరావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండల జర్నలిస్టు కొత్తూరి శ్రీనివాసరావు కుమార్తె లావణ్య లహరి వివాహ వేడుక ఖమ్మంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పీ.సోమయ్య, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. వధువరులకు మంత్రి పొంగులేటి నూతన వస్త్రాలను బహుకరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, మెరుగు రమణ, కొండబోయిన ఉమావతి, కే నరేంద్ర, రేగళ్ల మంగయ్య, సొసైటీ డైరెక్టర్ కొత్తూరు రామారావు, కాటేపల్లి నవీన్, టీఎస్‌యుటిఎఫ్ నాయకులు వీరబాబు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, నర్సింగ్ శ్రీనివాసరావు, బానోత్ రాంమ్మూర్తి,నాగండ్ల జగన్, ఎండీ.యాకూబ్అలీ, బొల్ల రమేష్, గుగులోత్ మంగ్యా తొగరు శ్రీను తదితరులు ఉన్నారు



జేఈఈ-1 మెయిన్స్ ఫలితాలలో సత్తా చాటిన వీవీ విద్యాలయం పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-సత్తుపల్లి

పదో తరగతి వరకు వీవీ విద్యాలయం స్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు 2025 జేఈఈ-1 మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వంశీకష్ణ తెలిపారు. ఈ ఫలితాల్లో అత్తునూరి లక్ష్మీ నాగ వెంకటేశ్వరరెడ్డి 99.72, హసావత్ జశ్వంత్ రామ్ 99.52, కుర్సం గిరిధర్ 98.66, కదలి సత్యసాయి 96, గొర్ల నాగసాయి వర్షిత్ రెడ్డి 94.37, మిరియాల నిరీక్ గుప్తా 94 శాతం చొప్పున ఫలితాలు సాధించినట్లు వారు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి, ప్రిన్సిపల్ గోరంట్ల వంశీకష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. పిల్లల విజయం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

దయానంద్‌చే శ్రీవైష్ణవి సర్వీసు స్టేషన్ ప్రారంభం

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం కిష్టారంలో గంగిశెట్టి జగదీశ్‌కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీవైష్ణవి సర్వీసు స్టేషన్‌ను (పెట్రోలు బంకు) గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రారంభించారు. కొత్తగా ప్రారంభమైన శ్రీవైష్ణవి సర్వీసు స్టేషన్ వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. బంకు యజమాని గంగిశెట్టి జగదీశ్‌కుమార్ మాట్లాడుతూ నాణ్యతో కూడిన పెట్రోలు, డీజిల్‌ను వాహనదారులకు అందిస్తామని ఈ సందర్భంగా గంగిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నకేశవరావు, దొడ్డా శ్రీనివాసరావు, మొహమ్మద్ కమల్‌పాషా, వినుకొండ కృష్ణ, మానుకోట ప్రసాద్, మన్మదకుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు వందనపు సత్యనారాయణ (గ్యాస్), గంగిశెట్టి ప్రసాద్, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

నవతెలంగాణ-వైరాటౌన్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పూర్తి స్థాయిలో తక్షణమే విడుదల చేయాలని, ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని, విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని జార్జిరెడ్డి పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు మందా సురేష్ డిమాండ్ చేశారు. వైరా నియోజకవర్గం కేంద్రంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ తెలంగాణలో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను చెల్లించని కారణంగా విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా విద్యా రంగ సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందని అన్నారు. జిల్లా ప్రజల చిరకాల వాంఛగా మారిన ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రకటన చేయాలని కోరారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటుకు జిల్లా మంత్రులు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాలలో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ముఖ్యమంత్రితో స్పష్టమైన ప్రకటన చెపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యా సంస్థలపై, కోచింగ్ సెంటర్లు, అకాడమీలపై పై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఉన్నత అధికారులు పారదర్శకంగా తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.అజయ్, నాయకులు సందీప్, నరేష్, ప్రశాంత్, నాగేశ్వరరావు, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను అధిగమించడమే జీవితం

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్

నవతెలంగాణ-ముదిగొండ

జీవితంలో వచ్చే కష్టాలను అధిగమించడమే మనిషి ఆనందానికి పునాదని, విజయాలకు నాందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవితమంటే కష్టాలను అధిగమించటమే, అధిగమించిన తర్వాత వచ్చిన విజయాలను అనుభవించడమే మనిషి యొక్క మనగడని ఆయన చెప్పారు. కెజిబివి విద్యార్థినిల ప్రతిభ చూసి ప్రిన్సిపాల్ ముగ్ధుడై బహుమతులు అందజేశారు. అనంతరం విద్యాలయం బాలికలు సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి అలరించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కె శాంతికుమారి, న్యూలక్ష్మీపురం హైస్కూల్ హెచ్‌ఎం మైత్రి, పిఎస్ హెచ్‌ఎం కిషన్, ముదిగొండ జూనియర్ కళాశాల లెక్చరర్ వెంకట్, కెజిబివి, కళాశాల, ఉపాధ్యాయ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మనలో చాలా కథలు కదులుతుంటాయి

ప్రముఖ సాహిత్య విమర్శకులు ఏకె ప్రభాకర్

నవతెలంగాణ-ఖమ్మం

మనలో చాలా కథలు కదులుతుంటాయని, ప్రతిమనిషిలో అనేక జీవనానుభవ కథలు ఉంటాయని ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ ఏకె ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాలలో తెలుగు-హిందీ-ఇంగ్లీష్-ఐ.క్యూ, ఏసి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో "కథలోకి....కథ వర్క్ షాప్"ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కథ, వస్తువు-నిర్మాణం-శిల్పం -దృక్పథం అనే అంశాలపై వివరించారు. తొలుత ఖమ్మం ఈస్తటిక్స్ కథలపై బి.ఏ ద్వితీయ సంవత్సర విద్యార్థిని పి.శృతి 35 కథల పరిచయం సమీక్ష పుస్తకం "కథాంశం"ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ సభ్యులు రవిమారుత్, తెలుగు, ఇంగ్లీష్, హిందీ విభాగాధిపతులు డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ ఏ.నర్సమ్మ, డాక్టర్ గౌస్ షేక్, ఐక్యు, ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సునంద, వైస్ ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎస్.శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవ సలహాదారులు ప్రసేన్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సీతారాం, వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని దంసలాపురం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం, కణతాల నరసింహారావు ఆధ్వర్యంలో అత్యంత రమణీయంగా, కనుల పండుగగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవానికి ఖమ్మం నగరం, ముదిగొండ, చింతకాని, బోనకల్, రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల నుండి సుమారు 10 వేల మంది భక్తులు హాజరయ్యారు. దంసలాపురం బిఆర్ఎస్ నాయకులు మందడపు ప్రసాదరెడ్డి, జనసేన నాయకులు బండారు రామకృష్ణ అన్నదాన కిరాణా సామగ్రి అందించారు. అన్నదానం చేశారు. ఈ కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మందడపు మనోహర్, మందడపు బ్రహ్మారెడ్డి, పొన్నం పుల్లయ్య, బొమ్మిశెట్టి రమేష్, కత్తి నాగేశ్వరరావు, కెఎల్ఎన్ గౌడ్, వీరా గౌడ్, గుర్రం వీరన్న అండెం సతీష్, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ మోడల్ ఇల్లు సందర్శన

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ మండల పరిషత్తు కార్యాలయంలో నిర్మాణం చేసిన ఇందిరమ్మ మోడల్ ఇల్లును సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం గురువారం సందర్శించి పరిశీలించారు. ప్రతి మండలంలో ఇందిరమ్మ మోడల్ హౌజ్లు నిర్మాణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముదిగొండ మండల పరిషత్తు కార్యాలయం జాగాలో ఇందిరమ్మ మోడల్ ఇల్లును అధికారులు నిర్మాణం చేయించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షులు ఎస్కె ఖాజా ఉన్నారు.

తుళ్లూరు బ్రహ్మయ్యకు దయాకర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఖమ్మం



డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి పూల మొక్క ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో బ్రహ్మయ్య మరిన్ని రాజకీయ పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు .

సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెడితే చర్యలు తప్పవు : ఏసీపీ రహిమాన్

నవతెలంగాణ-వైరా



సామాజిక మాధ్యమాల ద్వారా విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఏసీపీ రహిమాన్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాజకీయ, కుల, మత, ప్రాంతీయ వివాదాలకు తావు ఇచ్చేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుచిత పోస్టలను ఫార్వర్డ్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు. కాబట్టి, సామాజిక మాధ్యమాలను సమాజానికి మంచిని చేకూర్చే విధంగా మాత్రమే ఉపయోగించుకోవాలని, నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏసీపీ రెహమాన్ హెచ్చరించారు.

అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడు మృతి

నవతెలంగాణ-కారేపల్లి

ఖమ్మం నుంచి ఇల్లందుకు వెళ్తున్న కారుకు శాంతినగర్ - సీతారాంపురం మార్గమధ్యలో రోడ్డుపైకి కుక్కలు అడ్డువచ్చాయి. కుక్కలను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టి యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఇల్లందుకు చెందిన దేరంగుల సాయి (30) మరో ఇద్దరు కలిసి కారులో ఇల్లందు వస్తున్నారు. ఈ కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకవెళ్ళి బోల్తా పడింది. ఈ ఘటనలో దేరంగుల సాయి తీవ్రగాయలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని స్థానికులు ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి. చికిత్స నిర్వహిస్తున్న క్రమంలో సాయి మతి చెందాడు. మతుడు ఇల్లందు మండల బీఆర్ఎస్ నాయకులు దేరంగుల పోశం కుమారుడు. మృతునికి భార్య కావ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ సర్వే మార్గదర్శకంగా నిలుస్తుంది

- బీజేపీ వ్యాపారుల పార్టీ
- సర్వేలో పాల్గొనని వారికి ఈ నెల 16 నుంచి 28 వరకు మరో అవకాశం : బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో చేసిన సర్వే దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా నిలుస్తుందని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మంత్రి మాట్లాడారు. సర్వే ద్వారా కోటి 15లక్షల కుటుంబాలకు సేవలు అందించినట్టు తెలిపారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఉద్యోగిని పంపించి, 150 కుటుంబాల సమూహాలను గుర్తించి, 10 మంది ఎన్యూమరేటర్ల ద్వారా ఈ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఈ సర్వేలో మిస్సయిన సమాచారాన్ని సేకరించడానికి ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు మరో అవకాశం ఇవ్వనున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ సర్వేపై విమర్శలు చేస్తున్నప్పటికీ, ఇది రీ-సర్వే కాదు, మిస్సయిన సమాచారాన్ని సేకరించడానికి మాత్రమే అవకాశం అని చెప్పారు. రాష్ట్రంలో 56శాతం బీసీలున్నందున, 42శాతం రిజర్వేషన్లు వారికి ఇవ్వడం అవసరమని, ఈ ప్రక్రియను కొనసాగించడంపై కేంద్రంతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడినా కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగినా, వాటిని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, సర్వేలో పాల్గొనని వారు రీ-సర్వేలో పాల్గొనాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు, రాష్ట్రంలో సామాజిక మార్పుల దిశగా ముందుకు వెళ్లడానికి కీలకమైనదని అన్నారు.

బీజేపీ వ్యాపాస్తుల పార్టీ అని, దానికి వ్యాపార ప్రయోజనాలే తప్ప జనం అవసరాలు పట్టవని, వాళ్లకు బలహీన వర్గాలకు రిజర్వేషన్ ఇవ్వడం ఇష్టం లేదని ఆరోపించారు. తమిళనాడులో లాగా ఇక్కడ కూడా రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, అంజనికుమార్, బండి శ్రీలత, చంద్రశేఖర్, పిట్టల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

- పురుగుల మందు డబ్బాతో ఎండిన పొలంలో రైతు నిరసన



నవతెలంగాణ-సూర్యాపేట

నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయని వెంటనే ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతు, సింగిల్‌విండో మాజీ చైర్మెన్ వేములకొండ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని కుడకుడలోని తన ఎండిన పొలంలో గురువారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆయన నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా సమయానికి నీటిని ఇచ్చారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు రాక నాలుగెకరాల పొలం ఎండిపోవడం చూసి తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతులు ఏమైనా బిచ్చగాళ్లా?

- ప్రశ్నిస్తే తమ కార్యకర్తలపై అక్రమ కేసులు
- అన్నీ పింక్‌బుక్‌లో రాసుకుంటున్నాం..
- కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా.. మోసం : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ-భువనగిరి/ జనగామ

"రైతు భరోసా డబ్బులు ఎకరా.. ఎకరాకు వేస్తున్నారు.. రైతులు ఏమైనా బిచ్చగాళ్లా? కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారు.. వారి జోలికొస్తే ఊరుకోబోం.. అన్నీ పింక్‌బుక్‌లో రాసుకుంటున్నాం.. అధికారంలోకొచ్చాక అన్నీ తిరిగి చెల్లిస్తాం.. లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు.. మీ లెక్కలు తీస్తాం.." అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం, జనగామలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీళ్ల కోసం ఇబ్బంది పడ్డాం అని, తెలంగాణ వచ్చిన తర్వాత కాళేశ్వరం కట్టి చెరువులను నింపి రైతులకు నీరిచ్చామని అన్నారు. బీఆర్ఎస్ కంటే మెరుగ్గా చేస్తామని అధికారంలోకి వచ్చి ఉన్న పనులను చేయకుండా ఆపేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 65 మంది హాస్టల్ పిల్లలు చనిపోయారన్నారు. ఉచిత బస్సు ప్రయాణమంటూ.. బస్సులను తగ్గించి మహిళపట్ల అవమానకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్లు పూర్తి చేసిన తర్వాత ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రాజకీయ పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ఇవ్వాలని, ఉద్యోగ నియామకాల్లో బీసీ జనాభా ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని అన్నారు. రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తారనే కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా విద్యుత్తు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

ఎన్నికలకు బయపడుతున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా మోసం అని కవిత విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమ్మక్క-సారలమ్మ బ్యారేజీ ప్రాజెక్టు మిగిలిన 5 శాతం నిర్మాణం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోందన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వడం లేదన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ పాలసీ స్కాలర్‌షిప్‌ను అటకెక్కించారన్నారు. సన్న బియ్యం విషయం అటు ఉంచితే, రైతులకు ఇస్తానన్న క్వింటాల్‌కు రూ.500 బోనస్ మాట ఏమైందని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడానికి ప్రభుత్వం భయపడుతోందన్నారు. అనేక కుంటిసాకులు చెబుతూ ఎన్నికలు వాయిదా వేస్తోందని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ వేసిందని, న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందని చెప్పారు. తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.భువనగిరి సమావేశంలో ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మాజీ ఎంపీపీ సుబ్బూర్ బీరు మల్లయ్య, జనగామ సమావేశంలో నాయకులు హెగ్డే మల్లేష్, జనగామ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రేమలతారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సిద్ధి లింగం తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ లోపల సదుపాయాల కల్పనకు ప్రణాళిక

సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న కోర్ అర్బన్ ఏరియాను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు, నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళి కాబద్ధంగా ముందుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన డ్రోన్ సర్వేను కోర్ అర్బన్ ఏరియా మొత్తం నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగరంలో గృహాలు, మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురుగునీటి వ్యవస్థకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలని కోరారు. తద్వారా నగరంలో నివాస ప్రాంతాలకు మౌలిక సదుపాయాల విషయంలో అవసరాలకు తగిన విధంగా ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాటు చేసే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైతే గూగుల్ సాంకేతిక సహకారాన్ని తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రధానమైన ఏడు కూడళ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే వీటికి టెండర్ల ను పిలువాలని ఆదేశించారు. భూసేకరణ, ఇతర పనులను పూర్తి చేసి వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని అధికారులకు సీఎం సూచించారు.

క్షయ వ్యాధి నియంత్రణకు కృషి

రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలు

- చికిత్స కాలంలో న్యూట్రిషన్ కిట్స్ అందజేస్తున్న ఫార్మా కంపెనీలు : మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆయా కంపెనీల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్షయ వ్యాధి విస్తరించకుండా రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఎనిమిది ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధులతో వ్యాధిగ్రస్తులకు చికిత్సా కాలంలో న్యూట్రిషన్ కిట్స్‌ను ఉచితంగా అందిస్తున్నాయని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులకు మంత్రి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు, ప్రతి నెలా చికిత్స కోసం రూ.1,000 నగదు అందజేస్తున్నట్టు తెలిపారు. ఆ వ్యాధి నిర్మూలనకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను, యాక్టివ్ కేస్ ఫైండింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వంద రోజుల పాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన 9 జిల్లాలలో ఉధతంగా కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు.



న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్న కార్పొరేట్

ఫార్మా కంపెనీలైనా ఆరాజన్ ఫౌండేషన్, ఆప్టిమస్ డ్రగ్స్, బయోలాజికల్-ఈ, గ్లాండ్ ఫార్మా, మెట్రో కెమ్, నాట్కో ఫార్మా, గ్రాన్యూల్స్, సన్ ఫార్మాసిటికల్ కంపెనీలను మంత్రి అభినందించారు. ఆ కంపెనీలు రూ.2.80 కోట్ల విలువైన ఫుడ్ బాస్కెట్ (కిట్స్)ను అందిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో (9 జిల్లాలు) 100 రోజులపాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన, యాక్టివ్‌నెస్ ఫైండింగ్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ కమలాసన్ రెడ్డి, టీబీ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్' బిల్లుపై రగడ

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరమేమీ లేదని ప్రకటించారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష సభ్యులిచ్చిన అసమ్మతి నోట్‌లను జేపీసీ నివేదికకు జత చేయాలని సూచించారు. అనంతరం లోక్‌సభను మార్చి 10 (సోమవారం)కి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ ఇదే వివాదం

రాజ్యసభ ప్రారంభం కాగానే బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా విశ్రామ్ కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. నివేదికలో తమ అసమ్మతి నోట్‌లను తొలగించారంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో సభను చైర్మెన్ జగదీప్ ధన్కర్ 20 నిమిషాలు వాయిదా వేశారు. అనంతరం సభ కార్యకలాపాలు ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు నిరసనను కొనసాగించాయి. వారి నిరసనల మధ్యే నివేదిక రాజ్యసభ ఆమోదం పొందింది. దీంతో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.రాజ్యసభలో జేపీసీ నివేదికపై ప్రతిపక్షాల ప్రశ్నలకు కిరణ్ రిజిజు సమాధానమిచ్చారు. తన మంత్రిత్వ శాఖ సభ్యులు జేపీసీ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యారని, ప్రతిపక్షాలు నివేదికను చదివి, ఆపై స్పందించాలని కోరారు. ప్రశ్నలు లేవనెత్తే వారు కూడా జేపీసీ సభ్యులేనన్నారు. అన్ని అసమ్మతి నోట్‌లను నివేదికలో జతచేశామని, నియమాలు ఉల్లంఘించకుండా నివేదికను సభలో పూర్తిగా ప్రవేశపెట్టినట్టు తెలిపారు.

ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై సభలో ప్రవేశపెట్టిన జేపీసీ నివేదికను ప్రతిపక్షం అంగీకరించబోదని, ఏ పార్టీ అభిప్రాయాన్నీ పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టం చేశారు. చర్చ కోసం బిల్లును వెనక్కి పంపాలని చైర్మెన్‌ను అభ్యర్థించారు. సభ్యుల అసమ్మతి నివేదిక లేకుండానే జేపీసీ వక్ఫ్ (సవరణ) బిల్లు తుది నివేదికను సమర్పించారన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, అలాంటి నకిలీ నివేదికలను ఎప్పటికీ అంగీకరించబోమని స్పష్టం చేశారు..డీఎంకే ఎంపీ, వక్ఫ్ జేపీసీ సభ్యుడు మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ విధివిధానాలు పక్కకు పెట్టి అన్ని సమావేశాలు హడావుడిగా నిర్వహించారన్నారు. ప్రతిపక్షాల సవరణల్లో ఒక్కటి కూడా ఆమోదించలేదని తెలిపారు. జేఎంఎం ఎంపీ మహువా మాంఝీ మాట్లాడుతూ జేపీసీ పక్షపాతంతో వ్యవహరించిందని విమర్శించారు. ప్రభుత్వం వక్ఫ్ భూములపై కన్నేసిందని, ఇదిలాగే కొనసాగితే అన్య మతాల ఆస్తులను సైతం లాగేసుకునే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఈ నివేదికకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ వాకౌట్ చేసిందని తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదికను పునఃపరిశీలించి, దానిని నిలిపివేయాలని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు ఇచ్చిన అన్ని సూచనలు తిరస్కరించి, అధికార పార్టీ సూచనలు అంగీకరిస్తే జేపీసీ వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. ఎస్పీ ఎంపీ డింపుల్ యాదవ్ మాట్లాడుతూ ఈ నివేదికకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉన్నాయన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- మద్యం మత్తులో బైక్‌ను ఢీ కొట్టిన లారీ డ్రైవర్
- ఇద్దరి మృతి
- మృతదేహాలతో రోడ్డుపై 3 గంటల పాటు కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసుల చొరవతో విరమణ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మద్యం సేవించి లారీని నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి భైరగులపాడు గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగింది. రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు మృతి చెందడంతో గ్రామస్తులు రహదారిపై ఆందోళన చేపట్టారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సుజ్ఞాపురం గ్రామానికి చెందిన భూక్య హరిబాబు(40) తన ద్విచక్రవాహనంపై భూక్య సోమ్లా (38)ను తీసుకొని చుంచుపల్లిలో జరిగే తమ బంధువులకు చెందిన దశదిన కార్యక్రమాలకు వెళుతున్నారు. ఈక్రమంలో బైరాగులపాడు గ్రామ శివారులో భద్రాచలం నుంచి చర్ల వైపు వస్తున్న లారీ(టీఎస్ 36 టిఏ 0435) డ్రైవర్ మద్యం మత్తులో లారీని అ జాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్డు ప్రమాదంతో అప్రమత్తమైన లారీ డ్రైవర్ పారిపోయే ప్రయత్నం చేయగా.. స్థానికులు అతన్ని వెంబడించి పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం సేవించి ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలుపుతున్నారు. ఈ ఘటనకు ముందు రోజు మండలంలోని జెడ్ వీరభద్రపురం గ్రామానికి చెందిన కొమరం రాంబాబును చర్ల మండలం రాళ్ల గూడెం వద్ద ఇసుక లారీ ఢీకొని మృతి చెందాడు.

రోడ్డుపై ధర్నాకు దిగిన బాధిత కుటుంబాలు

ఇసుక లారీలు ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులు భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి రామచంద్రపురం వద్ద ధర్నాకు దిగారు. లారీ యజమానులు ఇక్కడికి రావాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ సుమారు మూడు గంటల పాటు రోడ్డుపై బైటాయించడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సీఐ బొడ్డు అశోక్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలకి చట్టపరంగా న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా ఏదయా..?

(మొదటిపేజీ తరువాయి)

కూడా వ్యవసాయశాఖ అంచనాలు తప్పుతున్నాయి. ఉదాహరణకు ఖమ్మం జిల్లాకు రబీ సీజన్ మొత్తానికి 65వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉండగా ఇప్పటికే 58,056 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. ఫిబ్రవరి ప్రణాళిక ప్రకారం 15వేల మెట్రిక్ టన్నుల యూరియా ఈ నెలలో సరఫరా కావాల్సి ఉండగా 10వ తేదీ నాటికే 6,900 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. రైతుల నుంచి డిమాండ్ బాగా ఉండటంతో సెలవు దినాల్లోనూ యూరియా విక్రయాలు చేపడుతున్నారు. రోజుకు 600 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా జిల్లాకు సరఫరా అవుతున్నా.. పలుచోట్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

మూడో రైల్వేలైన్‌తో మూడు జిల్లాలకు బ్రేక్

విజయవాడ నుంచి సికింద్రాబాద్ వరకు మూడో రైల్వేలైన్ నిర్మాణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని రేక్ పాయింట్‌ను మార్చడంతో సమస్య తీవ్రమైంది. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ ఎరువుల దుకాణాలకు చింతకాని మండలం పందిళ్లపల్లి నుంచి ఎరువులు సరఫరా చేయటంలో రవాణాపరమైన సమస్యలున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏప్రిల్, మే నెలలో రేక్ పాయింట్‌ను మార్చాలని ఎరువుల డీలర్లు కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు ఎరువుల సరఫరా ఇబ్బందికరంగా మారింది. ఒక్కరోజు సరఫరా నిలిచినా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు వరంగల్ నుంచి రోడ్డుమార్గంలో తెప్పించుకుంటున్నారు.

ఎక్కడ దొరుకుతుందంటే అక్కడకు..

యూరియా ఎక్కడ లభిస్తుందంటే అక్కడికి రైతులు పరుగులు పెడుతున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం పీఏసీఎస్‌కు గత రెండు నెలలుగా వివిధ జిల్లాల నుంచి రైతులు వస్తున్నారు. అటు ఉమ్మడి నల్లగొండ, ఇటు వరంగల్ జిల్లాల నుంచి వచ్చి యూరియా కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. వరి, మొక్కజొన్న, పెసర వంటి పంటలు ఎక్కువగా సాగు చేయడంతో రైతులు అధికంగా యూరియా కోసం ఎగబడుతున్నారు.

ఈ పంటలకు ఎకరానికి అరకట్ట చల్లాల్సిన యూరియాను రెండు కట్టల వరకు రైతాంగం వినియోగిస్తోంది. ఈ సొసైటీకి చుట్టుపక్కలున్న ఏదులాపురంలో విక్రయాలు లేకపోవడం, చేగొమ్మ సొసైటీకి ఎక్కువగా యూరియా సరఫరా కాకపోవడంతో తిరుమలాయపాలెం పీఏసీఎస్‌కు రైతులు క్యూ కడుతున్నారు. మిర్యాలగూడెం, వరంగల్ నుంచి కూడా ఇక్కడికి వస్తుండటంతో రెండు నెలల్లో రూ.2.50 కోట్ల విలువైన యూరియాను ఈ ఒక్క సొసైటీ నుంచే విక్రయించారు. గత ఏడాది మొత్తం ఈ సొసైటీలో 130 లారీల (లారీకి 440 సంచులు) ఎరువులు అమ్మగా జనవరి నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకే ఒక్క యూరియానే 60 లారీలకు పైగా విక్రయించటం గమనార్హం. రోజుకు 200 మంది వరకు యూరియా కోసం వస్తున్నారు. రోజుకు రెండు లారీల యూరియా ఈ సొసైటీకి దిగుమతి అవుతోంది.

ఫామ్‌హౌస్‌లో జరిగిన ఘటనలో తనకు ఎలాంటి సంబంధం లేదు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మొయినాబాద్

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తొల్కట్టలో జరిగిన ఘటనకు, తనకు సంబంధం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం మొయినాబాద్ పోలీసులు నోటీసులిచ్చినందున పూర్తిస్థాయిలో పోలీసులకు సహకరిస్తానని తెలిపారు. కాగా, ఫామ్‌హౌస్‌లో మంగళవారం అర్ధరాత్రి భారీ ఎత్తున నిర్వహించిన కోడి పందేల వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మందిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుంచి రూ.30లక్షల నగదు, క్యాసినోలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లతో పాటు 50 కార్లు, 80 పందెం కోళ్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే. కాగా, ఈ ఘటనకు సంబంధించి ఆయన ప్రకటన విడుదల చేశారు. 2018లో కొనుగోలు చేసిన భూమికి సంబంధించి అన్ని వ్యవహారాలు తన మేనల్లుడు జ్ఞాన్‌దేవ్‌రెడ్డి చూసుకుంటున్నారని పేర్కొన్నారు. అక్కడ ఫామ్‌హౌస్ లేదని, కేవలం మామిడి, కొబ్బరి తోట ఉందని, అక్కడ పనిచేసే వారి కోసం రెండు గదులు ఉన్నాయని తెలిపారు. తోటను తన ప్రమేయం లేకుండా మేనేల్లుడు.. వర్రా రమేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్టు ఈ ఘటన తర్వాత తెలిసిందన్నారు. వర్రా రమేశ్ అనే వ్యక్తి ఆ తోటను మరో వ్యక్తి ఎం. వెంకటపతి రాజుకు కౌలుకు ఇచ్చినట్టు తెలిసింది. ఈ ఘటన గురించి తెలిసి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తానే ఫిర్యాదు చేశానని తెలిపారు. ఘటన జరిగిన రోజు తాను వరంగల్‌లో ఎల్లమ్మ పండుగలో ఉన్నానని చెప్పారు. రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టడానికి కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 20 ఏండ్ల రాజకీయ జీవితంలో ఒక్క చిన్న కేసు లేకుండా ప్రజాసేవకే అంకితమయ్యాయని, చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనని తెలిపారు. తాను భూమి యజమాని కావున తనకు పోలీసులు నోటీసులు ఇచ్చారని, పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని తెలిపారు.

అర్చకుడి కేసులో మరో ఏడుగురి అరెస్ట్

నవతెలంగాణ-మొయినాబాద్

'చిలుకూరు' అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన నిందితుల్లో మరో ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ పవన్ కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. నిందితుల్లో ఐదుగురు దేవి రెడ్డి వీరబాబు, రేఘన మూర్తి, జలపాల గోవిందరావు, లకోజి వెంకటరమణ, ముప్పిడి వెంకటరమణ శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారని, మిగితా ఇద్దరు ముప్పాల వెంకటేశ్వరరావు, కోపేల లక్ష్మణరావు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారని తెలిపారు.

న్యాయమూర్తిపై చెప్పు విసిరిన నేరస్థుడు


- నేడు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలకు న్యాయవాదుల పిలుపు

నవతెలంగాణ-హాయత్‌నగర్

న్యాయమూర్తిపై ఓ నేరస్థుడు చెప్పు విసిరిన ఘటన ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా కోర్టులో గురువారం జరిగింది. ఎల్‌బీ నగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ సిక్ విలేజ్‌కు చెందిన కరణ్‌సింగ్ అలియాస్ సర్దార్ చీమకొర్తి పలు కేసుల్లో నిందితుడు. కాగా, కొన్నేండ్లుగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మరో కేసు విచారణలో భాగంగా ఈ నెల 12న రంగారెడ్డి జిల్లా 9వ అడిషనల్ సెషన్స్ జడ్జి హరిశ.. అతనికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. మళ్లీ ఇంకో కేసులో గురువారం కరణ్‌సింగ్‌ను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. ఈ క్రమంలో అతను జైలులో తనకు ఎదురవుతున్న ఇబ్బందులపై జడ్జికి వివరించే ప్రయత్నం చేసినట్టు చేసి.. ముందుకు వెళ్లి ఒక్కసారిగా తన చెప్పు తీసి మహిళా జడ్జిపై విసిరాడు. ఈ పరిణామంతో జడ్జి సహా అందరూ షాక్‌కు గురి కాగా పోలీసులు వెంటనే నేరస్థున్ని అదుపులోకి తీసుకుని పక్కకు తీసుకెళ్లారు. జడ్జిపై జరిగిన దాడిని జిల్లా బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. నిరసనగా శుక్రవారం అన్ని కోర్టుల్లో విధులు బహిష్కరిస్తున్నట్టు తెలిపింది. న్యాయమూర్తిపై దాడిని న్యాయవ్యవస్థపై దాడిగా పరిగణిస్తూ.. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండల్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్‌లలో నిరసన, ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

తహసీల్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- రేషన్ కార్డు రాలేదని మనస్థాపం



నవతెలంగాణ-నిజాంసాగర్

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన గడ్డమీది సందీప్ గౌడ్ (29) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్‌గౌడ్‌కు 2019లో వివాహం కావడంతో ఉమ్మడి కుటుంబం నుంచి విడిగా ఉంటున్నారు. ఫ్యామిలీ రేషన్ కార్డు నుంచి తన పేరును తొలగించి కొత్త రేషన్ కార్డు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నాడు. అనంతరం మీ-సేవలో కూడా దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటివరకు రేషన్‌కార్డ్ రాకుండా స్థానిక నాయకులు అడ్డుకుంటున్నారని మనస్తాపం చెంది తహసీల్దార్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే స్పందించిన అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే ఎమ్మార్వో సందీప్‌గౌడ్ దగ్గర పూర్తి వివరాలు తీసుకొని రేషన్ కార్డ్ వచ్చేలా ప్రయత్నం చేస్తామని అన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ

- కరీంనగర్ బరిలో పట్టభద్రులు 56 మంది
- ఉపాధ్యాయులు 15 మంది
- నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం పోటీలో 19 మంది

నవతెలంగాణ - కరీంనగర్/నల్లగొండ

రాష్ట్రంలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. మెదక్- నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు సంబంధించి 12 మంది పట్టభద్రుల అభ్యర్థులు, ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గవ్వల లక్ష్మి, ఎడ్ల సాయికృష్ణప్రియ, కావూరి సత్యనారాయణగౌడ్, అలగొండ కష్టహరి, నాలకంటి యాదగిరి, బడే నరసయ్య, లింగాల శ్రీనివాస్, రేకల సైదులు, మదనం గంగాధర్, లింగం కృష్ణ, సోమగాని నరేందర్, దార మనోహర్ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి గవ్వల శ్రీకాంత్ ఉపసంహరించుకున్నారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీకి మొత్తం 56మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 19 మంది

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19మంది అభ్యర్థులు నిలిచారు. ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించు కున్నట్టు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఉపసంహరించుకున్న వారిలో స్వతంత్ర అభ్యర్థులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, బండారు నాగరాజు, గంగిరెడ్డి కోటిరెడ్డి ఉన్నారు. ఈనెల మూడు నుంచి పదో తేదీ వరకు జరిగిన నామినేషన్లలో మొత్తం 23 మంది అభ్యర్థులు 50 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నామినేషన్ల పరిశీలనలో స్వతంత్ర అభ్యర్థి తుండు ఉపేందర్ సంతకాలు చేయకపోవడంతో తిరస్కరణకు గురైంది. చివరకు 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

ఆవ నూనెతో అరికాళ్ల మసాజ్..

ఆవనూనెతో ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆవనూనెను వంటకాల్లో కూడా ఉపయోగిస్తుంటారు. ఇందులోని ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నూనెలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇందులో బహుళఅసంతృప్త, మోనోశాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి



శరీరానికి చాలా మంచివని నిపుణులు చెబుతున్నారు.

ఆవనూనెలో ఒమేగా-3, 6 వంటి సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఈ నూనెతో మసాజ్ చేసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగువుతుంది. చర్మాన్ని సహజంగా మాయిశ్చరైజ్ చేయడంలో కూడా ఆవాల నూనె ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆవాల నూనెను అరికాళ్లకు అప్లై చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ అరికాళ్లను ఆవనూనెతో మసాజ్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

ఆవనూనెతో అరికాళ్లలో మసాజ్ చేసుకోవడం వల్ల కండరాలకు ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది. ఎక్కువ సేపు నడిచే వారు, నిలబడి పనిచేసే వారు రాత్రుళ్లు పడుకునే ముందు ఆవాల నూనెతో మసాజ్ చేసుకుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. శరీరం మొత్తం రిలాక్స్ అవుతుంది. నిద్రలేమి సమస్య కూడా దూరమవుతుంది. హాయిగా నిద్రపడుతుంది.

నెలసరి సమయంలో మహిళల్లో కనిపించే కడుపు తిమ్మిరి, నొప్పి వంటి సమస్యలకు ఆవాల నూనె బాగా ఉపయోగపడుతుంది. రాత్రి పడుకునే ముందు ఆవాల నూనెను అరికాళ్లకు మసాజ్ చేసుకోవడం వల్ల పీరియడ్స్ క్రాంప్స్ నుంచి ఉపశమనం పొందొచ్చు. మానసి ఒత్తిడితో బాధపడేవారు, నిద్రలేమి సమస్యతో ఇబ్బంది పడేవారికి కూడా ఆవ నూనె మసాజ్ మేలు చేస్తుంది. గోరువెచ్చని ఆవాల నూనెతో పాదాలను మసాజ్ చేయడం వల్ల ఒత్తిడి దూరమై మనసు ప్రశాంతంగా మారుతుంది. ■

ప్రేమ పెండ్లిలో కులం ఏదైనా కుల వివక్షతకు గురవుతున్నది ఎవరు? కుల దురహంకార కత్తుల వేటకు బలవుతున్నది ఎవరు? వీచే గాలిలో... ఊగే కొమ్మలపై... చిలకా గోరింకలు ప్రేమగా విహరిస్తాయి.. బుర్రున ఎగిరిపోతాయి.. వేటగాడి దాడి నుండి కాపాడుకోవడానికి.. కానీ ఏ పక్షి గుంపు ఆ చిలకా గోరింకల మీరు దాడి చేయదు. తెల్లని పావురాల జత కోరుకుంటుంది.. మానవ ఉన్మాదం నుండి ఎర్రని రక్తం ఎప్పటికీ చిందించకూడదని.. స్వేచ్ఛగా విహరించాలని... కానీ ఏ పక్షి గుంపు ఆ పావురాల జత మీద దాడి చేయదు! ఈ రోజు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఉన్మాదుల చేతుల్లో బలైపోతున్న ప్రేమ గురించి మీతో పంచుకుంటున్నాను.

ప్రేమను పగబట్టిన కుల ఉన్మాదం



రెండు మానవ హృదయాలు కోరుకుంటాయి చిలక గోరింకల లాగా.. ఎగిరే పావురాలు లాగా... స్వేచ్ఛగా విహరించాలని.. కానీ ఒక మానవ ఉన్మాదుల గుంపు వచ్చి ఈ హృదయాలను బద్దలు కొట్టి హింసిస్తుంది. ఎందుకంటే వాళ్లు ప్రేమించుకున్నారు.. ఎందుకంటే వాళ్లు వారి కన్నా తక్కువ 'కులం' వారిని ప్రేమించారు.. ఎందుకంటే వాళ్లు వాళ్ల 'ఆర్థిక స్తోమత' కు తక్కువగా ఉన్న వారిని ప్రేమించారు.. కాబట్టి వాళ్ల ప్రేమ నిరాకరించబడుతుంది. వాళ్ల ప్రేమ తుంచి వేయబడుతుంది. వాళ్ల ప్రేమ మీద దాడి చేయబడుతోంది. చివరకు వాళ్లు, వాళ్ల ప్రేమ చంపి వేయబడుతోంది.

మానవత్వం ఎరుగని కుల దురాహంకారం

ప్రేమించి కులాంతర వివాహాలు చేసుకున్న ప్రేమ జంటలపైన కులం పేరుతోటి మతం పేరుతోటి జరుగుతున్నటువంటి హింసా కాండా నేటి ఆధునిక భారతంలో కూడా కొనసాగుతుంది. అంటే టెక్నాలజీ ఎంత పెరిగిన మనుషులలో మార్పు ఎందుకు లేదు? జీవించి ఉండడం కన్నా అంతం చెయ్యాలి అనే ప్రతికార చర్యకు ఎందుకు పోతున్నారు? కులం ఏది అయినా మనిషిని మనిషిగా ఎందుకు గౌరవించడం లేదు? ప్రేమకు కులం లేదు కానీ ప్రేమించుకున్న మనుషుల పట్ల ఉన్మాదం చెలరేగుతుంది.

వివక్షను ఎదుర్కొంటున్నది మహిళలే

కులాంతర వివాహాలు చేసుకున్న అమ్మాయిలు పెండ్లయ్యాక తన జీవిత భాగస్వామి తమకన్నా సామాజికంగా వెనుకబడిన కులం అయితే 'కులం తక్కువ వాడిని పెండ్లి చేసుకుంది' అని సమాజంలో వివక్షను ఎదుర్కొంటుంది. పుట్టింటి వారి ఇంటికి రాక నిరాకరించబడుతుంది. సమాజంలో ఇదొక రకమైన వివక్ష అయితే, తన జీవిత భాగస్వామి తన కన్నా ఎక్కువ కులం వాడైతే కులం తక్కువ అమ్మాయి మా ఇళ్లల్లోకి వచ్చిందని వెలివేతకు గురవుతుంది. ఇంట్లోకి రావడానికి నిరాకరించబడుతుంది. ఈ విధంగా ప్రతి అమ్మాయి ప్రేమ పెండ్లి చేసుకున్నప్పుడు ఏదో ఒక రకంగా వివక్షను కచ్చితంగా ఎదుర్కోవాల్సి వస్తుంది.

బలవుతున్న దళిత యువకులు

కులాంతర ప్రేమ పెండిండ్లు చేసుకున్న యువకులలో తమకన్నా తక్కువ కులం అమ్మాయిలను పెండ్లి చేసుకుంటే తన కులం నుండో, ఇంట్లో నుండే వెలివేతలకు గురవుతుంటాడు, వివక్షను ఎదుర్కొంటాడు. కానీ తమ కన్నా ఎక్కువ కులం అమ్మాయిలను పెండ్లి చేసుకున్నట్లయితే అత్యధికంగా కుల ఉన్మాదపు కత్తుల వేటలో బలి అవుతున్నారు. అలా హత్యలకు గురవుతున్న వారిలో దళిత యువకులే ఎక్కువగా ఉన్నారు.



ప్రేమకు ఆశయం ముఖ్యం

ఒక కులాన్ని, ఆస్తులను, అందాన్ని చూసి ప్రేమిస్తే అది ప్రేమ కాదు, అది శాశ్వతంగా నిలవదు. జీవిత భాగస్వామి మనసు, ప్రేమ, త్యాగం మంచితనంతో ఉండాలి. ఒక ఆశయం కోసం పనిచేసే లక్ష్యం ఉండాలి.

అమర ప్రేమల ఆదర్శం

సమాజంలో మానవ అభివృద్ధి కోసం, అసమానతలు రూపుమాపటం కోసం కఠిన పేదరికం అనుభవిస్తూ.. తన కడుపున పుట్టిన పిల్లలు చనిపోతున్నా, పిల్లలకు పాలకు బదులుగా రక్తం వస్తున్నా కూడా తన కుటుంబం కన్నా వ్యవస్థలో ఆర్థిక, సామాజిక అసమానతలు రూపుమాపడం కోసం పాటుపడిన మహోన్నత మైన ప్రేమ జంటలు మనకు ఆదర్శం. కారల్ మార్క్స్ - జెన్నీ మార్క్స్ ప్రేమ నేటి యువ ప్రేమికులకు ఆదర్శం. సావిత్రిబాయి పూలే - మహాత్మ జ్యోతిరావు పూలే దాంపత్యం, వారి జీవిత త్యాగాలు మాకు ఆదర్శం. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ - రమాబాయి అంబేద్కర్‌ల జీవిత త్యాగాలు ఆదర్శం.

గెలిచిన ప్రేమలకు శుభాకాంక్షలు

ఈ వ్యవస్థలో కూరుకుపోయిన కుల ఉన్మాదపు గోడలను బద్దలు కొట్టి, అంతరాల దొంతరల సమాజాన్ని మార్చుటకై, కులాంతర ప్రేమ వివాహాలు చేసుకుని కుల అసమానతలు రూపుమాపుటకై , సమానత్వానికై పయనిస్తున్న జంటలకు శుభాకాంక్షలు తెలుపుతూ...

ఆశయాల ప్రేమకు స్వాగతం..
స్వేచ్ఛ సమానత్వానికై పోరాడుదాం..
నిర్ణయాధికారా హక్కు కాలరాస్తున్న ఉన్మాద చర్యలపై గర్జిద్దాం..
జీవించే హక్కుపై జరుగుతున్న దాడి నుండి ప్రేమ జంటలను కాపాడుకోవడానికి పోరాడుదాం..

- వై గీత,
8639450138 ■

శ్రీలంకలోని విద్యుత్ ప్రాజెక్టులకు అదానీ గుడ్‌బై



న్యూఢిల్లీ : శ్రీలంకలోని పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి వైదొలుగుతున్నట్టు అదానీ గ్రూపు వెల్లడించింది. ఇటీవల ఆ దేశ ప్రభుత్వం ఆయా ప్రాజెక్టుల కేటాయింపునపై సమీక్షా చేస్తోన్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. శ్రీలంకలోని రెండు పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి తప్పుకోవాలని కంపెనీ బోర్డు నిర్ణయం మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. శ్రీలంక ప్రభుత్వం కోరుకుంటే భవిష్యత్తులో సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించింది. పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, విద్యుత్ పంపిణీకి అదానీ గ్రీన్‌తో గతంలో శ్రీలంక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రెండు పవన విద్యుత్ ప్రాజెక్టుల విలువ దాదాపు రూ.8500 కోట్లుగా ఉంది. ఇందులో తీవ్ర అవినీతి జరిగిందని అక్కడ ఆందోళనలు చెలరేగాయి. అవినీతి ఆరోపణల నేపథ్యంలో అదానీ సంస్థతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని అధికారికంగా రద్దు చేసుకున్నట్లు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే సర్కార్ ఇటీవలే ప్రకటించింది. గౌతమ్ అదానీ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లకు గాను అధికారులకు లంచం ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు శ్రీలంక ఇంధన మంత్రిత్వ శాఖ అధికారిక వర్గాలు 2024 డిసెంబరులో వెల్లడించాయి. దీంతో అదానీ గ్రూప్‌నకు ఊహించని భారీ ఎదురుదెబ్బ తగిలినట్టయ్యింది. 2024 మేలో వాయువ్య ప్రాంతంలో ఇప్పటికీ నిర్మించని అదానీ పవన విద్యుత్ కేంద్రం నుంచి కిలోవాట్‌కు 0.0826 డాలర్ల చొప్పున విద్యుత్తును కొనుగోలు చేయడానికి ఇదివరకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కాగా.. అక్కడి నూతన దిసానయకే ప్రభుత్వం స్థానిక ప్రాజెక్టులపై దర్యాప్తు ప్రారంభించింది.

ఇందులో భాగంగా మొత్తం అదానీ ప్రాజెక్టును సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అదానీ ప్రతిపాదన ఖర్చులో దాదాపు మూడింట రెండు వంతుల ధరకే చిన్న పునరుత్పాదన ఇంధన సంస్థలు విద్యుత్తును అందిస్తున్నాయి. దీంతో అదానీ ఒప్పందంపై ఆ దేశంలో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ క్రమంలో ఆ దేశ అధ్యక్షుడు దిసనాయకే శ్రీలంకలో అవినీతిని నిర్మూలించి, దేశాన్ని వృద్ధి పథంలో నడిపిస్తాననే హామీకి అనుగుణంగా అదానీ ప్రాజెక్టులపై సమీక్ష ప్రారంభించారు. లంచాలు ముట్టజెప్పి విద్యుత్ ఒప్పందాలు చేసుకుందని అదానీ గ్రూపునపై నవంబర్ 19న అమెరికాలో కేసు నమోదయిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల క్రమంలో అదానీ గ్రూపు తాజా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఆర్‌ఆర్‌ఆర్ పనుల వేగం పెంచండి

(మొదటిపేజి తరువాయి)

రాజధానికి వచ్చే రహదారులు పూర్తిస్థాయిలో అభివద్ధి చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు పనులు చేపట్టి నిధులు సద్వినియోగం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. గత పదేండ్లుగా పాలించిన వారు ఈ చట్టాన్ని నిర్లక్ష్యం చేశారని గుర్తుచేశారు. తిరిగి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చట్టం నిధుల మేరకు స్థానికంగా పనులు చేపడుతున్న విషయాన్ని ఆ ప్రాంత నేతలు, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ శాఖ అధికారులపై ఉందన్నారు. కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఏవియేషన్ రంగానికి తగిన ప్రోత్సాహం అందిస్తామని మంత్రులు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకష్ణారావు, వికాస్‌రాజ్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కష్ణభాస్కర్, కార్యదర్శి దాసరి హరిచందన, ఆర్థిక శాఖ కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

వివిధ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ ఐటీ సంస్థ గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. ప్రధానంగా వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాలు అమలు చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది. దీంతో భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు వ్యూహాత్మక సహకారం అందించనుంది. హైదరాబాద్‌లోని టీ హబ్‌లో గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు గూగుల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఆ సంస్థ రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలోనూ భాగస్వామ్యం పంచుకుంటుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఏఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెస్‌ను అందిస్తుంది. రైతులకు అవసరమైన ఇన్‌పుట్, రెడిట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్‌ను ప్రారంభిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ " ఏఐ ఆధారిత తెలంగాణ దార్శనికతకు గూగుల్ సహకారం ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని అనుకున్నాం. ఈ లక్ష్య సాధనలో గూగుల్‌తో ఒప్పందం కీలకంగా నిలుస్తుంది..' అని ఆశాభావం వ్యక్తం చేశారు. గూడుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కీలక రంగాలలో సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు. దేశ డిజిటల్ భవిష్యత్తు పట్ల తమ సంస్థ నిబద్ధతను ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని తెలిపారు. ఏఐ ఆధారిత వర్క్ ఫోర్స్‌ను పెంపొందించటం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, వ్యవసాయం, విద్య లాంటి కీలక రంగాల్లో పని చేయటం ఉత్సాహంగా ఉందని ప్రీతి హర్షం వ్యక్తం చేశారు.

బకాయిలు ఇస్తాం..

హాస్టళ్లు, గురుకులాల అద్దె భవనాల బకాయిలు వెంటనే చెల్లిస్తాం

గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టండి

ఉద్యోగ కల్పన కేంద్రాలుగా స్టడీ సెంటర్లు :

బీసీ సంక్షేమ, రవాణా శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల అద్దె బకాయిలను వెంటనే చెల్లిస్తామనీ, ప్రతిపాదనలు తీసుకురావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సంక్షేమ వసతి గహాలు, గురుకులాల్లో మరమ్మతులు చేపట్టాలని, కిటికీలు, ప్రధాన ద్వారాలతోపాటు దోమతెరలు ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన నిధులు వెంటనే కేటాయిస్తామని మంత్రులు తెలిపారు. బీసీ స్టడీ సెంటర్లు ఉద్యోగ కల్పన కేంద్రాలుగా ఉండాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాబ్ క్యాలెండర్‌ను అనుసరించి స్టడీ సెంటర్లలో కోచింగ్ నిర్వహించాలని కోరారు. డీఎస్సీ, బ్యాంకింగ్ వంటి పరీక్షలపైనా దష్టి సారించాలని ఆదేశించారు. గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశం పెట్టడం ద్వారా ఉపాధి లభించే అవకాశం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. రెగ్యులర్ కోర్స్‌తో పాటు ఒక కోర్స్ ఒకేషనల్ కోర్సులకు కేటాయించాలన్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో విద్యార్థులు పూర్తిగా అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెడితే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. ఆర్టీసీ ఆస్తులు. నిర్వహణ, ఆదాయ వనరులపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు ఏఐదే

(మొదటిపేజి తరువాయి)

పాటు మూసీ పునరుజ్జీవన పథకం సదుపాయాల కల్పనలో భాగమన్నారు. మైక్రోసాఫ్ట్ సంస్థతో హైదరాబాద్ అనుబంధం మూడు దశాబ్దాల నాటిదనీ, తాజాగా 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన భవనం నిర్మించడం ద్వారా తన అంకితభావాన్ని చాటుకుందని ఆయన ప్రశంసించారు. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో భారీ ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. దేశంలోనే హైదరాబాద్‌ను అతిపెద్ద డేటా సెంటర్ల హబ్‌గా మారుస్తోందని కొనియాడారు. 'ఏఐ సిటీలో తమ కృత్రిమ మేధ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ ప్రకటించడం తమ ప్రభుత్వ విశ్వసనీయతకు నిదర్శనం. సాంకేతిక దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌లను ప్రపంచ టెక్నాలజీకి అందించిన ఘనత ఈ నగరానిది. నూతన ఆవిష్కరణలకు మూలస్థంభంగా స్థానం సంపాదించుకుంది. ప్రపంచంలోని ప్రతి మూలన జరిగే సాంకేతిక విప్లవానికి ఈ నగరం ఏదో రకంగా భాగస్వామిగా ఉంటోంది. ఇక్కడితో మేం సంతృప్తి చెందడం లేదు. ఇది ఒక ఆరంభం మాత్రమే కాదు. సుదీర్ఘ ప్రస్థానానికి రహదారులు వేస్తున్నాం. 52 ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, 30కి మించిన విశ్వవిద్యాలయాలు, 6 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సులు, 60 లక్షల మంది ఉత్సాహం ఉరకలెత్తే శ్రామికశక్తితో హైదరాబాద్, తెలంగాణా వెలుగు లీనుతోంది. 90 లక్షల ఇండ్లను డిజిటల్ కనెక్టివిటిలోకి తీసుకొస్తున్నాం...' అని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫార్మా బాధిత రైతులకు న్యాయం చేయాలి

(మొదటిపేజి తరువాయి)

రైతులకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ బాధిత రైతులకు అన్యాయం చేయాలని చూస్తే ఎర్రజెండా పక్షాన పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల కార్యదర్శులు రావుల జంగయ్య, బుగ్గ రాములు, కందుకూరు మండల నాయకులు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కందుకూరి జగన్, నాయకులు పి.బ్రహ్మయ్య, ఎ. జంగయ్య, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

(మొదటిపేజి తరువాయి)

టచ్‌లో ఉన్నారు. అయితే బీజేపీ పగ్గాలు చేపడితే పరిస్థితులు మరింతగా చేజారే ప్రమాదం ఉందని అధిష్టానం గుర్తించినట్టు తెలుస్తోంది. దీంతో సరిగ్గా మోడీ అమెరికా పర్యటనలో ఉండగా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు.

మెయితి, కుకి వర్గాల మధ్య గత రెండేళ్ళుగా సాగుతున్న హింసాకాండ కారణంగా మణిపూర్‌లో శాంతి భద్రతలు దిగజారాయి. అయినా పధాని మోడీ ఒక్కసారి కూడా మణిపూర్ వెళ్ళడానికి ఇష్టపడలేదు. ఈ రెండేండ్లలో అనేకసార్లు విదేశాలకు పయనమయ్యారు కానీ బిజెపి పాలనలో రగులుతున్న మణిపూర్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కనీసం తమని ఓదార్చే ప్రయత్నం చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తూనే ఉన్నారు.

రాజకీయ ఒత్తిడితోనే

రాజ్యాంగంలోని ఆర్టికల్ 174(1) ప్రకారం రాష్ట్ర శాసనసభలు చివరిసారిగా సమావేశమైన ఆరు నెలల్లోపు సమావేశమవ్వాలి. మణిపూర్‌లో చివరి అసెంబ్లీ సమావేశం 2024 ఆగస్టు 12న జరిగింది. కానీ బుధవారంతో అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి గడువు ముగిసింది.

వాస్తవానికి ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో సోమవారం ప్రారంభం కావాల్సిన బడ్జెట్ సమావేశాన్ని గవర్నర్ అజయ్ భల్లా ఆదివారం నిలిపివేశారు. తన ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని, కీలకమైన బల పరీక్షను ఎదుర్కొనేందుకు కేవలం ఒక రోజు ముందుగా బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. ఇలాంటి మరెన్నో కారణాలతో బీరెన్ సీఎం పదవికి రాజీనామా చేయక తప్పలేదు. 2023 మే లో మణిపూర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన నేపథ్యంలో స్వపక్షంతో పాటు సంకీర్ణంలోని భాగస్వామ్యపార్టీలు కూడా ఆయనను తొలగించాలని నిరంతరంగా డిమాండ్ చేశాయి. ప్రతిపక్షం నుంచి పెరుగుతున్న ఒత్తిడి మధ్య ఆయన రాజీనామా చేశారు.

బీజేపీని కాపాడేందుకే

అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి ముందుగానే ముఖ్యమంత్రి రాజీనామా చేయడమంటే రాష్ట్ర ప్రజలను కాపాడటానికి కాదని, బీజేపీని కాపాడటానికేనని కాంగ్రెస్ విమర్శించింది. రాష్ట్రపతి పాలన విధించాలన్న నిర్ణయం చాలా ఆలస్యంగా తీసుకున్నారని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. కాగా, ఈశాన్య రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి బిజెపి వద్ద ఎటువంటి ప్రణాళిక లేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ విమర్శించారు.

మణిపూర్ హింసలో సీఎం పాత్ర ?

మణిపూర్ హింసలో తన పాత్రకు సంబంధించి లీక్ అయిన ఆడియో క్లిప్‌లపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించిన కొన్ని రోజుల తర్వాత బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. మీడియా నివేదికల ప్రకారం, ఆడియో క్లిప్‌లో, మణిపూర్‌లో హింస రగులుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయుధాలు , మందుగుండు సామాగ్రిని దోచుకోవడానికి మెయితీ గ్రూపులకు అనుమతి ఉందని బీరేన్ సింగ్ సూచించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో సుప్రీంకోర్టు సీల్డ్ ఫోరెన్సిక్ నివేదికను కోరింది. ఆ తర్వాత తలెత్తిన రాజకీయ ఒత్తిళ్ళు, కాంగ్రెస్ తెచ్చిన అవిశ్వాస తీర్మానం పరిస్థితులను మరింత తీవ్రతరం చేశాయి. దాంతో రాష్ట్రపతి పాలన విధించక తప్పని పరిస్థితి ఏర్పడింది.



'తల' తొలి టికెట్ కొన్న నాగార్జున

దీపా ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీనివాస్ గౌడ్ నిర్మాతగా అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించిన సినిమా 'తల'. ఈ చిత్రంతో అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా పరిచయం అవుతున్నారు. అంకిత నస్కర్ హీరోయిన్. రోహిత్, ఎస్తేర్ నోరన్హ, ముక్కు అవినాష్, సత్యం రాజేష్, అజయ్, విజ్జి చంద్రశేఖర్, రాజీవ్ కనకాల, ఇంద్రజ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా నేడు (శుక్రవారం) విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో హీరో నాగార్జున బుక్ మై షోలో ఈ మూవీ ఫస్ట్ టికెట్‌ను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ చిత్ర ట్రైలర్‌ను చూసి, చాలా బాగుందని మెచ్చుకున్నారు. అలాగే రాగిన్ రాజ్ పెద్ద హీరో అవుతాడని, అమ్మ రాజశేఖర్ డైరెక్షన్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని కితాబునిచ్చారు. ఈ సందర్భంగా అమ్మ రాజశేఖర్‌తో తన మొదటి పరిచయాన్ని గుర్తు చేసుకుని, ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, నిర్మాత శ్రీనివాస్ గౌడ్‌కు ఆల్ ద బెస్ట్ చెప్పారు.

బుక్ మై షోలో నాగార్జున 'తల' మూవీ ఫస్ట్ టికెట్‌ను కొనడం ఈ సినిమా సాధించబోతున్న పెద్ద విజయానికి చిహ్నం అని దర్శకుడు అమ్మ రాజశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నవచిత్రం

'మాయలో మాయకి చిక్కినాక..'



ప్రజ్వల్ దేవరాజ్

ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాక్షస'. ఈ చిత్రం ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒరిజినల్ వెర్షన్ కన్నడతో పాటు తెలుగులోనూ అదే రోజు రిలీజ్ కానుంది.

గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద' చిత్రాన్ని విడుదల చేసిన ఎంవీఆర్ కృష్ణ ఈ చిత్ర తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్ పై రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా గురువారం ఈ మూవీ టైటిల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. సినిమా కాన్సెప్ట్‌ను తెలియజేసేలా సాగిన ఈ పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. అజనీష్ లోక్‌నాథ్ కంపోజ్ చేసిన ఈ పాటలో సౌండ్ ట్రాక్స్, బ్యాగ్రౌండ్ స్కోర్ హైలెట్‌గా నిలిచాయి. 'మాయలో మాయకి చిక్కినాక.. దారిలో కానరాక చొచ్చుకెళ్లాక.. భయంతో గట్టిగా పిలిచే నువ్వెవరే..రా రా రాక్షస" అంటూ సాగిన పాటకు ప్రేమ్ బి ఎస్ అర్థవంతమైన లిరిక్స్‌ను అందించగా, సాయి చరణ్ వాయిస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ, 'ప్రజ్వల్ దేవరాజ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌కు, ట్రైలర్‌కు మంచి ఆదరణ దక్కింది. లేటెస్ట్‌గా విడుదల చేసిన పాటని కూడా ప్రతి ఒక్కరూ బాగుందని చెబుతున్నారు. ముఖ్యంగా 'కాంతారా' ఫేం అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుస్తుంది. ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. ఈ పాట తరహాలోనే సినిమా కూడా అందరూ ఇష్టపడేలా ఉంటుంది' అని తెలిపారు.

'కోబలి'కి విశేష ఆదరణ



నింబస్ ఫిలిమ్స్, యు1 ప్రొడక్షన్స్, టి.ఎస్.ఆర్ మూవీ మేకర్స్ సంస్థలపై జ్యోతి మెగావత్ రాథోడ్, రాజశేఖర్ రెడ్డి కామిరెడ్డి, తిరుపతి శ్రీనివాసరావు సంయుక్తంగా నిర్మించిన రా అండ్ రస్టిక్ వెబ్ సిరీస్ 'కోబలి'. ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ సిరీస్‌లో రవి ప్రకాష్, రాకీ సింగ్ ప్రధాన పాత్రలు పోషించగా, తరుణ్ రోహిత్, శ్రీతేజ్, శ్యామల, యోగి ఖత్రి, శ్రీ పవన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. రేవంత్ లేవాక దర్శకత్వం వహించారు. ఈనెల 4 నుండి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో 7 భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్‌కి అన్ని రాష్ట్రాల ప్రేక్షకుల నుండి సూపర్ రెస్పాన్స్ లభించింది. నార్త్ నుండి కూడా దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటికీ నెంబర్ వన్ ప్లేస్‌లో ట్రెండ్ అవుతోంది. దీంతో మేకర్స్ గురువారం ప్రసాద్‌ల్యాబ్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు.

నిర్మాత జ్యోతి మాట్లాడుతూ, 'మా 'కోబలి' కాన్సెప్ట్‌ని యాక్సెప్ట్ చేసిన హాట్ స్టార్ వారికి, ఆదరించిన ప్రేక్షకులకి కూడా థ్యాంక్స్' అని అన్నారు. 'మేము ఊహించిన దానికంటే పెద్ద సక్సెస్ అయ్యింది. నార్త్‌లో కూడా మేం ఊహించని గొప్ప ఆదరణ లభించింది. ఇలానే మంచి కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తాం' అని మరో నిర్మాత నిర్మాత రాజశేఖర్ రెడ్డి చెప్పారు. నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'గతంలో 'తికమకతాండ' సినిమా తీశాను. ఇప్పుడు 'కోబలి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాను. అన్ని రాష్ట్రాల్లోనూ ఇది సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతుంది. పార్ట్ 2 కూడా దీనికి మించి ఉంటుంది' అని తెలిపారు. "కోబలి'కి మేం అనుకున్న దానికంటే మంచి రీచ్ వచ్చింది. పార్ట్ 2 కూడా మంచి కంటెంట్‌తోనే ఉంటుంది. మాకు మంచి సపోర్ట్ అందిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు' అని దర్శకుడు రేవంత్ చెప్పారు.

కార్పొరేట్ల దురాశ, అసమానతలపై
కేరళ ప్రజల విజయం

- కేరళ ఆరోగ్య సంరక్షణా రంగంలో విప్లవం
- పలు విజయాలు సాధిస్తూ ముందుకు దూసుకుపోతున్న ప్రజారోగ్య రంగం



తిరువనంతపురం : కేరళలో ప్రైవేటు ఆస్పత్రులు వరుసగా మూతపడుతున్నాయని, 2011 నుంచి ఇప్పటివరకు 99 ఆస్పత్రులను మూసివేశారని న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10న తన వార్తా కథనంలో పేర్కొంది. కేరళ ప్రైవేట్ ఆస్పత్రుల సమాఖ్య (కేపీహెచ్‌ఏ) అందచేసిన డేటాను ఈ సందర్భంగా ఉటంకించింది. వాస్తవానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండొచ్చునని కూడా భావిస్తున్నారు. అయితే ఈ సమాచారం వినగానే కేరళలో ప్రైవేటు ఆరోగ్య సంరక్షర రంగం సంక్షోభంలో వుందని, కుప్పకూలిపోతోందని భావించడం సరికాదు. దీని వెనుక వున్న వాస్తవికతను అర్థం చేసుకోవాల్సి వుంది. ప్రైవేటు రంగంలో సంక్షోభంలో వుందనడమంటే వాస్తవాలను వక్రీకరించడమే కాగలదు. వాస్తవానికి ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ మరింత పటిష్టంగా తయారవుతుండడమే అసలు కారణంగా వుంది. రోజురోజుకు బలోపేతమవుతున్న ప్రభుత్వ ఆరోగ్య రంగంతో పోటీ పడలేక ప్రైవేటు రంగం కుదేలవుతోంది. అత్యంత తక్కువ వ్యయంతోనే అత్యంత నాణ్యమైన వైద్య సేవలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందడం, ఎలాంటి దోపిడీ వ్యవస్థ లేకపోవడం, పెట్టుబడిదారీ విధానంలో వుండే మోసపూరిత విధానాలు లేకపోవడం కారణాలుగా వున్నాయి.

ఇటీవలి సంవత్సరాల్లో కేరళలో ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అద్భుతమైన రీతిలో ముందుకు దూసుకుపోతోంది. ప్రాణాధారమైన మందులు, అత్యంత కీలకమైన వైద్య సేవలు, చికిత్సలు మరింతమందికి అందుబాటులోకి వచ్చాయి. ఆక్సిజన్ విషయంలో స్వావలంబన సాధించే దిశగా ముందడుగు పడడం పేర్కొనదగ్గ విజయాల్లో ఒకటిగా వుంది. 2,095.63 మెట్రిక్ టన్నుల ద్రవ్య ఆక్సిజన్ నిల్వ సామర్ధ్యంగా వుంది. దీంతో సకాలంలో, సమర్ధవంతమైన చికిత్స రోగులకు అందుతోంది.అలాగే కొత్తగా 709 కుటుంబ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణంలో కూడా గణనీయమైన విజయం సాధించింది. మొత్తంగా 885 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 709 కేంద్రాలను అభివృద్ధిపరిచారు. కీలకమైన ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకున్నారు. గత మూడున్నరేళ్ళలో 25.17లక్షల మంది ప్రజలు లబ్ధి పొందారు.

ఇక మౌలిక వసతులకు వస్తే, ఆరోగ్య సంరక్షణా నెట్‌వర్క్‌ను బాగా విస్తరించింది. 5,415 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పనిచేస్తున్నాయి. 380 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వున్నాయి. న్యూరో కేథ్ ల్యాబ్‌తో సమగ్రమైన రీతిలో స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా తిరువనంతపురంలోని మెడికల్ కాలేజీ దేశంలోనే మొదటి కాలేజీగా గుర్తింపు పొంది జాతీయ బెంచ్‌మార్క్‌ను సృష్టించింది. ఇక కేన్సర్ విషయంలో కూడా ప్రైవేటు ఆస్పత్రులతో పోల్చుకుంటే కేరళ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం మెరుగైన రీతిలో అందుతోంది. ఆదిలోనే వ్యాధిని గుర్తించేలా చర్యలు తీసుకోవడం, తర్వాత రోగులకు అందే సంరక్షణ వంటి విషయాల్లో ప్రభుత్వం బాగా దృష్టి సారించింది. దీనికి తోడు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లా, తాలుకా కేంద్రాల్లో వివిధ కేన్సర్ల నిర్ధారణా కేంద్రాలను నెలకొల్పింది.

దేశంలో ప్రభుత్వ రంగంలోనే మొదటిసారిగా, కేన్సర్‌కు రోబొటిక్ సర్జరీని రీజనల్ కేన్సర్ సెంటర్ (ఆర్‌సిసి), మలబార్ కేన్సర్ సెంటర్ (ఎంసిసి)ల్లో ప్రవేశపెట్టారు. కేరళ మౌలిక వసతుల పెట్టుబడుల నిధి నుండి అందిన రూ.562.25కోట్ల నిధులతో ఎంసిసి కేన్సర్ పరిశోధనలో పోస్టు గ్రాడ్యుయేట్ సంస్థగా ఎదిగింది. అరుదైన వ్యాధుల పరిష్కారంపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.

దీనికి తోడు, తిరువనంతపురం జనరల్ ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ ఎఐ నిర్దేశిత సాంకేతిక పరిజ్ఞానమైన జి-గెయిటర్‌ను నెలకొల్పడం ద్వారా దేశంలో మొదటి జిల్లా స్థాయి ఆస్పత్రిగా మారింది. సాధారణంగా కార్పొరేట్ ప్రైవేటు ఆస్పత్రుల్లోనే దొరికే ఇటువంటి అత్యాధునిక వైద్య సేవలను సాధారణ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా పొందగలగడం ప్రభుత్వం సాధించిన మరో ఘనత. ప్రైవేటు రంగం కుప్పకూలుతోందంటే అదేమీ విచారకరమైన విషయంగా చూడరాదు, దాన్ని ప్రజల విజయంగా భావించాలి.

కేవలం లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తే ప్రైవేటు ఆస్పత్రులు సాధారణంగా సామాన్యులు, సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజల అవసరాల పట్ల చిన్నచూపు చూస్తాయి. ఆరోగ్య సంరక్షణను కూడా ఒక లాభం సంపాదించే వస్తువుగా చూడడమే వారి లోపం. అటువంటి నేపథ్యంలో కేరళలో ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ ఆధిపత్యం వహించే స్థాయికి చేరడమంటే సమాన అవకాశాలు కలిగిన సమాజం దిశగా ఒక అడుగు ముందుకేసినట్లే. ప్రైవేటు ఆరోగ్య సంరక్షణ రంగం వైఫల్యమంటే కేవలం ఆర్థిక అసమర్ధత మాత్రమే కాదు, పెట్టుబడిదారీవాదం నైతికంగా, రాజకీయంగా కూడా విఫలమవడం కూడా ఒక లక్షణమే. ప్రభుత్వ రంగాన్ని విస్తరించడం ద్వారా, అందులో పెట్టుబడులు మరింతగా పెట్టడం ద్వారా మరిన్ని మంచి ఫలితాలు రాబట్టవచ్చని కేరళ ప్రభుత్వం నిరూపించింది. కేరళలో ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణా రంగం అభివృద్ధి చెందుతూ ముందుకు పరుగులు తీస్తోందంటే అది కార్పొరేట్ల దురాశపై ప్రజలు సాధించిన విజయంగా చూడాలి. మిగిలిన ప్రపంచానికి కూడా ఇది ఆదర్శప్రాయం కావాలి.

'కాల్పుల విరమణ' ఉల్లంఘన జరగలేదు : భారత్ ఆర్మీ


శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఓసీ) వద్ద ఎలాంటి 'కాల్పుల విరమణ ఒప్పందం' ఉల్లంఘన జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. భారత్, పాకిస్తాన్ మధ్య కుదిరిన అవగాహన ప్రకారం ఈ ఒప్పందం చెక్కుచెదరకుండా ఉందని సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఇటీవల ఎల్‌ఓసీ వద్ద జరిగిన వరుస కాల్పుల ఘటనలు, ఐఇడి పేలుడు కారణంగా ఏర్పడిన ఉద్రిక్తతలను నివారించడానికి యాంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపింది. అంతేకానీ, ఇటీవల కాలంలో ఎల్‌ఓసీ వద్ద భారీ అయుధాలతో ఎలాంటి కాల్పుల ఘటనలు జరగలేదని ఆర్మీ స్పష్టం చేసింది. ఎల్‌ఓసీ వద్ద పరిస్థితి స్థిరంగా ఉందని, నిశిత పరిశీలనలో ఉందని తెలిపింది. ఈ ప్రాంతం వద్ద భారత సైన్యం ఆధిపత్యం చెలాయిస్తోందని తెలిపింది. ఎల్‌ఓసీ వద్ద భారీ స్థాయిలో, అత్యాధునిక ఆయుధాలతో కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నాయని, భారీ సంఖ్యలో పాకిస్థాన్ సైనికులు మరణించారని ఇటీవల కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు వచ్చిన సమయంలో ఆర్మీ ఇలాంటి ప్రకటన విడుదల చేయడం విశేషం. మరోవైపు జమ్మూలో గురువారం జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నేతృత్వంలో అత్యున్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసులు, సైన్యం, సిఆర్‌పిఎఫ్ అధికారులతో పాటు, ఇతర విభాగాల ఉన్నతా ధికారులు కూడా పాల్గొన్నారు. గత రెండు రోజుల్లో సిన్హా ఇలాంటి సమావేశం నిర్వహించడం ఇది రెండోసారి. బుధవారం శ్రీనగర్‌లో భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఆటలు

డబ్ల్యూపీఎల్‌కు వేళాయే

- నేటినుంచి మహిళల ప్రిమియర్ లీగ్
- గుజరాత్ X బెంగళూరు మ్యాచ్‌తో ప్రారంభం
- ఆశా శోభన, పూజ వస్త్రాకర్ దూరం

రాత్రి 7.30గంటల నుంచి



ముంబయి: 'వుమెన్స్ ప్రిమియర్ లీగ్'(డబ్ల్యూపిఎల్) సంగ్రామం గురువారం నుంచి ప్రారంభం కానుంది. 2025 డబ్ల్యూపిఎల్ సీజన్‌లో ఈసారి ఐదు ఫ్రాంచైజీలు టైటిల్‌కోసం పోటీపడనున్నాయి. ఈసారి డబ్ల్యూపిఎల్‌లో మొత్తం 20 గ్రూప్ లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ దశలో భాగంగా ఒక్కో జట్టు మిగిలిన నాలుగు జట్లతో రెండేసిసార్లు ముఖాముఖి తలపడనుంది. లీగ్ దశ ముగిసిన తర్వాత టాప్-3లో నిలిచిన జట్లలో టాప్‌లో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. 2, 3 స్థానాల్లో నిలిచి రెండుజట్ల మధ్య ప్లే-ఆఫ్ మ్యాచ్ జరగనుంది. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరి టైటిల్‌కోసం టాప్‌లో నిలిచిన జట్టుతో పోటీపడనుంది. గ్రూప్ దశ పోటీలు ముగిసిన తర్వాత 3, 4 స్థానాల్లో నిలిచిన రెండు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి. ఫిబ్రవరి 14న గుజరాత్-బెంగళూరు జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ప్రారంభమై.. మార్చి 15న జరిగే ఫైనల్‌తో 2025 డబ్ల్యూపిఎల్ సీజన్ పోటీలు ముగియనున్నాయి. ప్రతి మ్యాచ్ రాత్రి 7.30గంటలకు ప్రారంభం కానుంది.

శోభన, పూజ దూరం :

2025 డబ్ల్యూపిఎల్ సీజన్‌కు ఆశా శోభన, పూజ వస్త్రాకర్ దూరమయ్యారు. ఆశా శోభన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు, పూజ వస్త్రాకర్ ముంబయి ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఆశా శోభన స్థానంలో రైల్వేస్‌కు చెందిన వికెట్ కీపర్, బ్యాటర్ పర్వీన్‌ను రూ.30లక్షల బేస్ ధరకు బెంగళూరు జట్టు కొనుగోలు చేసింది. ఇక డబ్ల్యూపిఎల్ తొలి సీజన్‌లో ఆడిన పరుణికను ముంబయి జట్టు రీప్లేస్ చేసుకుంది. ఆమెను కనీస ధర రూ.10లక్షలకు ముంబయి చేజిక్కించుకుంది. వడోధర, బెంగళూరు, లక్నో, ముంబయి వేదికలుగా ఈసారి డబ్ల్యూపిఎల్ లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఫ్రాంచైజీలు, కెప్టెన్లు...

1. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు	: స్మృతి మంధాన(భారత్)
2. గుజరాత్ జెయింట్స్	: అష్లే గార్డినర్(ఆస్ట్రేలియా)
3. ఢిల్లీ క్యాపిటల్స్	: మెగ్ లానింగ్(ఆస్ట్రేలియా)
4. యుపి వారియర్స్	: దీప్తి శర్మ(భారత్)
5. ముంబయి ఇండియన్స్	: హర్మన్‌ప్రీత్ కౌర్(భారత్)

మహిళల ప్రిమియర్ లీగ్ షెడ్యూల్...

ఫిబ్రవరి

14(శుక్ర)	: గుజరాత్ జెయింట్స్ X రాయల్ ఛాలెంజర్స్
15(శని)	: ముంబయి ఇండియన్స్ X ఢిల్లీ క్యాపిటల్స్
16(ఆది)	: గుజరాత్ జెయింట్స్ X యుపి వారియర్స్
17(సోమ)	: ఢిల్లీ క్యాపిటల్స్ X రాయల్ ఛాలెంజర్స్
18(మంగళ)	: గుజరాత్ జెయింట్స్ X ముంబయి ఇండియన్స్
19(బుధ)	: యుపి వారియర్స్ X ఢిల్లీ క్యాపిటల్స్
21(శుక్ర)	: రాయల్ ఛాలెంజర్స్ X ముంబయి ఇండియన్స్
22(శని)	: ఢిల్లీ క్యాపిటల్స్ X యుపి వారియర్స్
24(సోమ)	: రాయల్ ఛాలెంజర్స్ X యుపి వారియర్స్
25(మంగళ)	: ఢిల్లీ క్యాపిటల్స్ X గుజరాత్ జెయింట్స్
26(బుధ)	: ముంబయి ఇండియన్స్ X యుపి వారియర్స్
27(గురు)	: రాయల్ ఛాలెంజర్స్ X గుజరాత్ జెయింట్స్
28(శుక్ర)	: ఢిల్లీ క్యాపిటల్స్ X ముంబయి ఇండియన్స్
మార్చి 1(శని)	: రాయల్ ఛాలెంజర్స్ X ఢిల్లీ క్యాపిటల్స్
3(సోమ)	: ఢిల్లీ వారియర్స్ X గుజరాత్ జెయింట్స్
6(గురు)	: యుపి వారియర్స్ X ముంబయి ఇండియన్స్
7(శుక్ర)	: గుజరాత్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్
8(శని)	: ఢిల్లీ వారియర్స్ X రాయల్ ఛాలెంజర్స్
10(సోమ)	: ముంబయి ఇండియన్స్ X గుజరాత్ జెయింట్స్
11(మంగళ)	: ముంబయి ఇండియన్స్ X రాయల్ ఛాలెంజర్స్
13(గురు)	: ప్లే-ఆఫ్
15(శని)	: ఫైనల్

అగ్రస్థానంలోనే సర్వీసెస్

నేటితో ముగియనున్న 38వ జాతీయ క్రీడలు



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న 38వ జాతీయ క్రీడలు నేటితో ముగియనున్నాయి. ఈసారి అత్యధిక పతకాలను సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు(ఎస్ఎస్‌సిబి) మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. జాతీయ క్రీడల ముగింపుకు ఒక రోజు ముందు గురువారం నాటికి సర్వీసెస్ జట్టు 67 స్వర్ణ పతకాలతో టాప్‌లో నిలిచి. ఇక 2వ స్థానంలో ఉన్న మహారాష్ట్ర జట్టు సర్వీసెస్ కంటే అత్యధిక పతకాలు సాధించినా.. 53 స్వర్ణ పతకాలను మాత్రమే సాధించడంతో వెనుకబడింది. ఆతిథ్య ఉత్తరాఖండ్ జట్టు కూడా ఈసారి సెంచరీ మార్క్‌ను చేరుకోవడం విశేషం. ఆ జట్టు 24స్వర్ణ, 35రజత, 42కాంస్యాలతో 7వ స్థానంలో ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఒకటైన ఆంధ్రప్రదేశ్ జట్టు ఈసారి 14పతకాలను సాధించగా.. తెలంగాణ జట్టు 18పతకాలు సాధించినా.. కేవలం 3 స్వర్ణ పతకాలను సాధించి 26వ స్థానానికి పరిమితమైంది.

ఆర్సీబీ కొత్త కెప్టెన్‌గా రజత్ పటీదార్



బెంగుళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు(ఆర్సీబీ) జట్టుకు కొత్త కెప్టెన్‌ను నియమించింది. రజత్ పటీదార్‌ను నూతన సారథిగా నియమిస్తూ ఆర్సీబీ కీలక ప్రకటన చేసింది. రజత్ పటీదార్ నియామకాన్ని.. ఆ ఫ్రాంచైజీ సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లి ఆమోదించాడు. విరాట్ ఓ వీడియో సందేశాన్ని ఇచ్చాడు. ఆ వీడియోను ఆర్సీబీ తన ట్వీట్‌లో పోస్టు చేసింది. తనతో పాటు జట్టు సభ్యులు అందరూ రజత్‌కు అండగా ఉండనున్నట్లు ఆ వీడియో సందేశంలో కోహ్లి తెలిపాడు. నువ్వు ఎదిగిన తీరు హర్షణీయమని, అద్భుతమైన పర్ఫార్మెన్స్ ఇచ్చావని, ఆర్సీబీ అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నావని పటీదార్‌ను కోహ్లి మెచ్చుకున్నాడు. ఇటీవల ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలో మధ్యప్రదేశ్ జట్టుకు సారథిగా పటీదార్ బాధ్యతలు నిర్వర్తించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ ఫైనల్ వరకు వెళ్లింది. ఫైనల్లో ఆ జట్టు ముంబయి చేతిలో ఓడింది. ఆ టీ20 టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా పటీదార్ నిలిచాడు. 10 మ్యాచుల్లో అతను 428 పరుగులు చేశాడు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886